www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 45 సంచిక : 17,18 విజయవాడ 20-1-2013 పేజీలు : 12 వెల : రు 5.00

లోపలి పేజీల్లో...


- ◈ స్టాలిన్ పతాకను సమున్నతంగా నిలుపుదాం
- ◈ యూరోపు ఆర్థిక సంక్షోభం : అనివార్య విఫలతను బయటపెట్టుకున్న పెట్టుబడిదారీ విధానం
- ◈ ట్యునీసియా: 'పూర్తికాని విప్లవం'-ఇంటర్వ్యూ
- ◈ కసబ్‌కు ఉరిశిక్ష: టెర్రరిజంపై పోరు పేరిట సాగుతున్న తతంగం
- ◈ పర్యావరణంపై దోహాసదస్సు : ఫలితాలుండని కుస్తీపట్లు
- ◈ బాబ్రీమసీదు కూల్చివేతకు 20 ఏళ్ళు:ఈనాటికీ మాసిపోని దుష్పరిణామాలు
- ◈ కార్మికవర్గానికి పిలుపు : ఫిబ్రవరి 20,21 తేదీలలో సార్వత్రిక సమ్మె
- ◈ ఉద్యోగుల భవిష్యనిధి : కార్మికుల జేబుకు చిల్లు


## ఆర్థిక-రాజకీయ సంక్షోభంతో ప్రజల జీవనాన్ని కల్లోలపరుస్తున్న పాలక వర్గాలు

**కేంద్రప్రభుత్వం** డీజిలు, పెట్రోలు, ఎరువుల ధరలను విడతలవారీగా పెంచుకుంటూపోతున్నది. కుటుంబాలకిచ్చే గ్యాసు సిలిండర్ల సంఖ్యను ఏడాదికి ఆరుకు తగ్గించి, మిగిలిన వాటి ధరలను వెయ్యి రూపాయలకు పెంచింది. రైలు ప్రయాణ ఛార్జీలను బడ్జెట్టుకు మూడు నెలలముందే పెంచివేసింది. బడా బూర్జువావర్గం వేలకోట్ల రూపాయలను బ్యాంకులకు ఎగనామం పెట్టగా మౌనం పాటించి, ఇప్పుడు బ్యాంకులకు తిరిగి ద్రవ్య సహాయంతో పెట్టుబడి సమకూర్చేందుకు నిర్ణయించింది. అదే సమయంలో అరకొర ఏర్పాట్లతోనే నగదు బదిలీ పథకాన్ని ప్రారంభించింది. మరోవైపున పాకిస్తానుతో సరిహద్దుల్లో ఉద్రిక్తతను పెంచుతున్నది.

రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీ రేట్లను పెంచివేసింది. ఇంధన సర్‌ఛార్జి సర్దుబాటు పేరిట వాడుకొనని కరెంటుకు కూడా ఛార్జీలు వసూలుచేస్తూ, ఇప్పుడు మరలా 12 వందలకోట్ల మేరకు కరెంటు ఛార్జీలను పెంచటానికి పూనుకుంది. విద్యుత్తు కొరతను సృష్టించి, అధిక ధరపెట్టి కొనటమో లేదా పరిశ్రమను మూసివేసుకోవటమో అన్న పరిస్థితిని చిన్న పరిశ్రమదారులకు కల్పించింది. లక్షలాది కార్మికులను వీధిన పడవేస్తున్నది. కరెంటు లేక పరిశ్రమ నడవనందున బ్యాంకు రుణాల చెల్లింపు వాయిదా వెయ్యమని కోరినా వినకుండా పారుబాకీక్రింద జమకట్టి వేలం వేసేందుకు సిద్ధమౌతున్నాయి. గుర్తుకొచ్చినప్పుడల్లా భూముల, ఇళ్ల రిజిస్ట్రేషను ఛార్జీలను పెంచివేస్తున్నది. ఇక మద్యం ధరలను పెంచివేసి పేదలను నిలువునా దోచుకుంటున్నది.

అదే సమయంలో ఐదుగంటలు కూడా ఇవ్వకుండా, రైతాంగానికి ఉచిత విద్యుత్తు యిచ్చి ఆదుకుంటున్నానంటూ ప్రచారం చేస్తున్నది. మహిళల స్వయం సహాయక బృందాలకూ, రైతాంగానికీ ఆర్థిక సహాయాన్ని యిబ్బడి ముబ్బడిగా పెంచానంటూ ఆర్భాటం చేస్తున్నది. కాగా మతోన్మాద వాతావరణాన్ని పెంచేందుకు పూనుకుంది. హిందూ, ముస్లిము మతతత్వశక్తులు పరస్పరం రెచ్చగొట్టే ప్రసంగాలు చెయ్యటం తరచుగా సాగుతున్నా ఏనాడూ పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు కదలి అక్బరుద్దీన్ ఒవైసీని అరెస్టుచేసి మత ఉద్రిక్తతను పెంచేందుకు పూనుకుంది.

డిసెంబరునెల, జనవరి మొదటివారంలో జరిగిన పరిణామాలివి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఈ విధానాలలో ఒక సామ్యం వుంది. సామ్రాజ్యవాదులూ, బడాబూర్జువావర్గం, బడా భూస్వామ్యవర్గాల రాజకీయ ప్రతినిధులుగా పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఒకేవిధంగా వుండటంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.

ప్రజాసంక్షేమ బాధ్యత తమకు లేదని ప్రకటించుకుంటున్న ప్రభుత్వం, దోపిడీ పాలకవర్గాలకు ప్రభుత్వ ఖజానాను దోచిపెడుతున్నది. వేలకోట్ల రూపాయలను ప్రభుత్వ బ్యాంకులకు వారు ఎగ్గొట్టినా కిమ్మనకుండా ఖజానానుండి బ్యాంకులకిస్తున్నది. రైతాంగం రుణమాఫీవల్లనే యిబ్బందులు వస్తున్నాయంటూ నంగనాచి ప్రచారం చేస్తున్నది. చట్టంప్రకారం బ్యాంకులు రైతాంగానికివ్వాల్సిన రుణాలను సైతం బడావాణిజ్య వర్గాలకు మళ్లిస్తున్నది. రైతాంగంనుండి భూమిని గుంజుకుని, సాగునీటిని కూడా మళ్లించి నిర్మించిన ప్రైవేటు విద్యుత్తు ప్లాంటులు, తమ నిర్మాణ ఖర్చులను రెండు రెట్లు పెంచి చూపినా తెలియనట్లు నటిస్తూ అధిక ధరలకు వారినుండి విద్యుత్తు కొని, ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నాయి.

ఈ విధంగా ఖజానాకు పడిన చిల్లుకు ఎరువులు, చౌకధరల దుకాణాలూ, వంటగ్యాసు తక్కువ ధరకు అందించటమే కారణమంటూ ధరలు పెంచి, పన్నులు పెంచి ప్రజల గోళ్లూడగొట్టి వసూలుచేస్తూ ఖజానా లోటును పూరించుకుంటున్నది. దీనివల్ల రూపాయి విలువ పడిపోయి, అన్ని సరుకుల ధరలూ విపరీతంగా పెరిగిపోయి సామాన్యులు మరింత దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు.

21వ శతాబ్దంలో భారత్‌ను అగ్రరాజ్యంచేస్తామంటూ కాంగ్రెస్; భారత్ వెలిగిపోతున్నదంటూ బిజెపిలు కేంద్రంలోనూ, రాష్ట్రాన్ని మరో సింగపూర్ చేస్తానంటూ టిడిపి, ప్రజాసంక్షేమ రాజ్యస్థాపనే నా ధ్యేయమంటూ కాంగ్రెసు రాష్ట్రంలోనూ, ప్రారంభించి, అమలుజరిపి, ఇప్పుడు రెండవదశలోకి ప్రవేశించామంటున్న నూతన ఆర్థిక విధానాలు, తమ ప్రకటిత లక్ష్యాలను వేటినీ సాధించలేదు. దారిద్ర్యం, నిరుద్యోగం పెరిగిపోయాయనీ, నానాటికీ ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయనీ ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి.

కాగా, అప్రకటిత లక్ష్యాలను మాత్రం సాధించిపెట్టాయి. ప్రపంచ శతకోటీశ్వరుల లిస్టులో భారత బడా బూర్జువాలు పుంజీడు మంది చేరిపోయారు. దేశప్రజల శ్రమతో సృష్టించబడుతున్న సంపదంతా విదేశాలకు ప్రవాహంలా తరలిపోతున్నది. కొద్దిమంది భారత బడా బూర్జువాలు మెక్కుతున్నారు. మిగిలిన సంపదకూడా అవినీతిమయమైన రాజకీయ నేతల, నిరంకుశాధికార గణాల పరమౌతున్నది.

పర్యవసానంగా దేశంలో పేద-ధనిక వ్యత్యాసాలు తీవ్రమౌతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు కష్టాలమయమయ్యాయి. పాలకుల అభివృద్ధి నినాదాలు కల్పించిన పేరాశలు ఆవిరైపోయి ప్రజలలో తీవ్ర అశాంతి చోటుచేసుకున్నది. అది పాలకులపై ఆగ్రహంగా వ్యక్తమౌతున్నది. ఈ దోపిడీ విధానాలను ప్రశ్నిస్తూ, వారు వీధులలోకి వస్తున్నారు, పోరాటాలు సాగిస్తున్నారు.

ప్రజలలో పెరుగుతున్న అశాంతి, నిరసన, ప్రతిఘటనలు చూసి తమ దోపిడీ పాలనకెక్కడ విఘాతం కలుగుతోందోనని పాలకవర్గాలు ఆందోళన చెందుతున్నాయి. పెల్లుబుకుతున్న ప్రజాగ్రహంపై నీళ్లు చల్లేందుకు వారినుద్ధరిస్తామంటూ భ్రమలు కల్పించి, ప్రజలను సహాయంకోసం ఎదురు తెన్నులు చూసే స్థితిలో వుంచేందుకు పూనుకున్నాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామీణ ఆరోగ్య రక్షణ పథకం, విద్యాహక్కు చట్టంవంటి పథకాలను వరుసగా ప్రకటిస్తున్నాయి. ఈ కోవలోకి చెందినదే నగదు బదిలీ పథకం. మధ్యలో అధికారుల, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా మీబ్యాంకు ఎకౌంట్లలోకే నగదు జమచేస్తామంటూ ప్రజలను ఊరిస్తున్నాయి. అనుభవం దీని బూటకత్వాన్ని తెలిపింది. 'ది హిందూ' దినపత్రిక కిరోసిన్‌కు నగదు బదిలి అమలుజరిపిన రాజస్తాన్ అనుభవం గూర్చిరాసింది. లీటరు 45 రూ॥పెట్టి కిరోసిన్ కొనలేక ప్రజలు మానివేశారనీ, ఇంతవరకూ మూడవవంతు మందికి కూడా ఆరునెలలు దాటినా మొదటి నెల నగదు బదిలీ జరగలేదనీ తెలిపింది. కాగా ప్రజలు కొనుగోలు చేయలేకపోయినందున మిగిలిపోయిన కిరోసిన్‌ను చూపి ప్రభుత్వం మాత్రం సబ్సిడీ కిరోసిన్ అమ్మకంలో అక్రమాలను అరికట్టి వేలకోట్లు మిగుల్చుకున్నాననటం వాస్తవదూరమని తెలిపింది. వాస్తవమిలా వుంటే, ఆలూ లేదు చూలూ లేదు...అన్నచందంగా, మగవాడి బ్యాంకు ఎకౌంటులోవేస్తే తాగితందనాలాడుతాడు. ఆడవారి ఎకౌంటులో వెయ్యాలి వంటి సూచనలతో ఈ పథకం గొప్పదన్న భ్రమలను కల్పించే పనిలోనే ప్రతిపక్షాలున్నాయి.

కేంద్రం అడుగులలోనే రాష్ట్రమూ నడుస్తున్నది. మహిళలకూ, రైతులకూ, కౌలుదారులకూ వడ్డీలేని రుణాలిస్తానంటూ ముఖ్యమంత్రి విమానంలో రాష్ట్రమంతటా చుట్టి వస్తుంటే, ప్రతిపక్ష టిడిపి నాయకుడు పాదయాత్రలో ఎదురుపడిన వారందరికీ వరాలజల్లు కురిపిస్తున్నాడు.

**(తరువాయి 2వ పేజీలో)**

సంపాదకీయం

## సరిహద్దుల్లో చిచ్చు

కాశ్మీర్‌లో పాకిస్తాన్‌తో వున్న వాస్తవాధీన రేఖవద్ద మళ్లీ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పదేళ్లక్రితం కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాత ఇంతగా పరిస్థితి ఏనాడూ దిగజారలేదు. గత పదేళ్లలో ఏనాడూ లేనంతగా గత 13 నెలల్లోను 72 ఉద్రిక్త ఘటనలు జరిగాయి. వీటిలో ఎక్కువభాగం పీర్‌పంజాల్‌కు దక్షిణ ప్రాంతంలోనే జరిగాయి. ఇరువైపులా ప్రాణనష్టాలూ జరిగాయి.

భారత సైనికులు జరిపిన కాల్పుల్లో తమ సైనికుడు మరణించాడని పాకిస్తాన్ వాదిస్తున్నది. కాగా పాకిస్తాన్ సైన్యం, వాస్తవాధీన రేఖను దాటివచ్చి ఇద్దరు భారత సైనికులను హతమార్చిందని భారత్ వాదిస్తున్నది. ప్రస్తుత కాల్పులు ఎవరు మొదట చేశారువంటి వాస్తవాలను వెలికితీయటం సులభం కాదు. మొదట కాల్పులు ఎవరు చేశారన్న దానినలావుంచి ఆ కాల్పులకు దారితీసిన ఘటనలను చూస్తే, ప్రస్తుత కాల్పులకు భారత్ వైపునుండే తొందరపాటు వుందని తెలుస్తుంది.

పిల్లలు దశాబ్దాలక్రితం పాకిస్తానీ కాశ్మీరులోకి వెళ్లగా, తల్లిదండ్రులు భారత కాశ్మీర్‌లో వున్నారు. ఇటీవల భర్త మరణించగా శేషజీవితం పిల్లలవద్ద గడిపేందుకు రేష్మాబీ అన్న 70 ఏళ్ళ మహిళ సరిహద్దులుదాటి వెళ్లింది. దీనితో ఉగ్రవాదుల చొరబాటు మార్గంగా తీసుకుని భారత సైన్యం అక్కడ బంకరును నిర్మించింది. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం అక్కడ బంకరు నిర్మాణం జరగకూడదు. ఇది ప్రస్తుత కాల్పులకు దారితీసింది.

కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం యిరుపక్షాల క్షేత్రస్థాయి కమాండర్లు తరచుగా కలిసి ఉల్లంఘనలేమైనా జరిగితే వాటిని చర్చిస్తున్నారు. ఇరుపక్షాల సైనిక కార్యాల డైరక్టర్ జనరల్స్ మధ్య హాట్‌ఫోను వుంది. దీనివల్ల అడపా దడపా ఉల్లంఘనలు ఎటువైపునుండి జరిగినా, కాల్పుల విరమణ ఒప్పందం సాగుతున్నది. ఇంత ఏర్పాటువున్నా గత ఏడాది 72 ఘటనలెందుకు జరిగాయి? ఒక బంకరు నిర్మాణం కాల్పులకెందుకు దారితీసింది? ఈ ప్రశ్నలకు సమాధానం ప్రస్తుతంలో దొరకవు.

కొంతమంది వాదిస్తున్నట్లు పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు దిగిందని భావించటానికి ఆస్కారంలేదు. కొన్ని రోజులక్రితమే పాకిస్తాన్ సైన్యం తన ప్రాధాన్యతనలను పునఃనిర్వచించుకుంటున్న డాక్యుమెంటులో, ప్రధాన శతృవుగా భారత్‌ను తొలగించి టెర్రరిస్టులను పేర్కొంది. పాకిస్తాన్ ప్రభుత్వం నేడెదుర్కొంటున్న ఆంతరంగిక సమస్యలరీత్యా రెచ్చగొట్టే చర్యలకు దిగే స్థితిలోలేదు. అయితే పాకిస్తాన్ ప్రజలలో భారత వ్యతిరేకతను రెచ్చగొట్టే పని పాకిస్తాన్ పాలకులు మానివేశారని కాదు. ఆరీత్యా చూసినప్పుడు ప్రజల దృష్టి మళ్లించేందుకు భారత పాలకులే అతిగా వ్యవహరిస్తున్నారని భావించవలసి వుంటుంది. భారత్‌లోని ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వానికి వంతపాడుతున్నాయి. పాకిస్తాన్‌పట్ల కఠినంగా వ్యవహరించమని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ముంబయి దాడులగురించి, పాకిస్తాన్ దుశ్చర్యలగురించి బడాబూర్జువాల పత్రికలు ఏకరవుపెట్టి పాకిస్తాన్ వ్యతిరేక ప్రచారానికి పూనుకున్నాయి. భారత్‌కు వాణిజ్యంలో అత్యంత అనుకూలదేశస్థాయి గుర్తింపును పాకిస్తాను ఇచ్చేందుకు చర్చలకొరకు పాక్‌విదేశాంగమంత్రి ఈ నెలాఖరులో భారత్‌కు రాబోతుండగా ఇదంతా జరగటం సంబంధాలు మెరుగుపడేందుకు తోడ్పడదు.

ఉపఖండంపై ప్రత్యక్ష పాలన వదలుకుని వెళ్లిపోతూ, తమ దోపిడీ ఆధిపత్యాలు కొనసాగటానికి వీలుగా బ్రిటీషు సామ్రాజ్యవాదులు పెట్టిన చిచ్చు యిది. ఉపఖండ చరిత్రలో ఎరుగని మత ఘర్షణలు సృష్టించి ఉపఖండ విభజనలకు భూమికను తయారుచేసిందీ వారే. వలసపాలకులు వదలిన చెప్పుల్లో కాళ్ళుదూర్చిన భారత పాలకులు పొరుగు దేశాలపట్ల పెద్దన్నగా వ్యవహరిస్తుందనటానికి భారత దోపిడీ పాలక వర్గాలకున్న ప్రాంతీయ విస్తరణవాద కాంక్షలే కారణం. దాయాదులైన భారత-పాకిస్తాన్‌ల మధ్య సామ్రాజ్యవాదులు చిచ్చురగుల్చుతూ తమ ఆధిపత్యాన్ని సాగిస్తున్నారు. ఇరుపక్షాలకూ ఆయుధాలు అమ్ముకుంటూ లాభాలు గడిస్తున్నారు. దీని పర్యవసానంగానే భారత పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాలు సాగాయి. దేశ వనరులు ఆయుధాలుకొరకు వృధాఅవుతున్నాయి.

అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌లోకి మతోన్మాదులకు ఆయుధాలిచ్చి పంపింది. పాకిస్తాన్ పాలకులు దీనికి అన్నివిధాల తోడ్పడ్డారు. ఇప్పుడు మతోన్మాదమనే భస్మాసుర హస్తమే పాకిస్తాను ప్రజలను పట్టిపల్లారుస్తున్నది. అమెరికా పెంచిన మతోన్మాద శక్తులు అమెరికాపైనే కాక భారత్‌పైకీ వస్తున్నాయి.

భారత, పాకిస్తాన్ పాలకవర్గాలు అమెరికా సామ్రాజ్యవాదానికి తోకలుగా వ్యవహరిస్తున్న తీరు, ఎంతటి విపత్కర పరిణామాలకు దారితీస్తున్నదో గమనించినప్పుడు, పాకిస్తాన్‌తో సరిహద్దులో పెరుగుతున్న ఉద్రిక్తతలకు మూలమెక్కడుందో అర్థమౌతుంది.

పాకిస్తాన్‌పట్ల శతృత్వవైఖరిని విడనాడాలనీ, పాకిస్తాన్‌తో ఉన్న సమస్యలను సామ్రాజ్యవాదుల జోక్యంలేకుండా ఉభయులు చర్చలద్వారా పరిష్కరించుకోవాలనీ భారత పాలకులను వత్తిడిచేస్తూ ప్రజాఉద్యమాన్ని నిర్మించాలి. స్వతంత్రమైన విదేశాంగ విధానాన్ని, పొరుగుదేశాలతో మైత్రినీ సాధించాలని డిమాండు చేయాలి. ✡

## అభ్యుదయ రచయిత కా॥ సమతారావుకు జోహార్లు



**కా॥ సమతారావు** (చావలి రామచంద్రరావు) 1926లో గుంటూరుజిల్లా-కొల్లిపర గ్రామంలో జన్మించారు. తన 87వ ఏట 7-1-2013న ఒంగోలులో మరణించారు.

విద్యార్థి దశలోనే జాతీయోద్యమంలో పాల్గొని, 1943లో అర్లపూర్ జైలులో శిక్ష అనుభవించారు. తెనాలిలో జరిగిన అరసం ప్రథమ మహాసభలో పాల్గొని అభ్యుదయ కవితలు, గేయాలు రాశారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించి, కొద్దికాలం నెల్లూరు జిల్లాలో పూర్తికాలం కార్యకర్తగా పనిచేసారు. భారతదేశంలో సామ్యవాద వ్యవస్థ ఏర్పాటు కావాలని ఆకాంక్షించడమే గాక, దానికోసం ఒక దశాబ్దంపాటు క్రియాశీలకంగా పనిచేశారు.

1955 అనంతరం నెల్లూరు జిల్లాలో హిందీపండితులుగా పనిచేస్తూ, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పత్రిక ఉపాధ్యాయకు కవితలు-ముఖ్యంగా ఎన్నో బాలగేయాలు రాసి, సామాజిక చైతన్యం కల్గించారు. ఆ పత్రికకు సంపాదకులుగా పనిచేసి, ఉపాధ్యాయ ఉద్యమ అభివృద్ధికి కృషి చేశారు.

దినకర్ కురుక్షేత్ర, ప్రేమ్‌చంద్ కథలు, యశ్‌పాల్ గాంధీవాద శవపరీక్ష వంటి రచనలను అనువదించి, తెలుగు ప్రజలకు అందించారు. నాల్గు దశాబ్దాల క్రితం జై ఆంధ్ర ఉద్యమాన్ని పాలకవర్గాలు సాగించినపుడు ప్రాంతీయ వాదాన్ని ఎండగడుతూ "ఇదీ ఆంధ్రం! ఇదీ భారతం" (వచన కవితా వ్యాసం) నగారా పేరుతో రాసి, పుస్తకరూపంగా వెలువరించారు. ప్రాంతీయవాదానికి పరిష్కారంగా జనతా ప్రజాతంత్ర వ్యవస్థ సాధనే మార్గమని అందులో వక్కాణించి చెప్పారు.

కా॥ సమతారావు మృతికి "జనశక్తి" జోహార్లు ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతున్నది.

### ఆర్థిక-రాజకీయ... (మొదటి పేజీ తరువాయి)

తాను ప్రతిపాదించిన (ఆయనకా సలహా యిచ్చింది ఆయన వారసుడేనట!) నగదు బదిలీ పథకాన్ని భ్రష్టుపట్టించారంటూ, తనకధికారమిస్తే సరిగ్గా అమలు జరుపుతా నంటున్నాడు. ఆర్భాటంగా మొదలుపెట్టి అర్థాంతరంగా పాదయాత్ర ముగించినా, రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలనను తిరిగితెస్తానంటూ భ్రమలు కల్పించే ప్రచారాన్నే వైఎస్‌ఆర్ కాంగ్రెసు సాగిస్తున్నది. ప్రజలను భ్రమలు పాలుచేసి పదునెక్కుతున్న వారి చైతన్యాన్ని మొద్దుబార్చే పనిలో ఈ దోపిడీ పాలకవర్గాల పార్టీలన్నీ వున్నాయి.

అయినా ఇది ప్రజలలో పెరుగుతున్న అశాంతిని పూర్తిగా చల్లార్చలేదని వారికి తెలుసు. ప్రజలు సంఘటితపడి సమైక్య పోరాటాలు సాగించకుండా చేసేందుకు కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేందుకు పూనుకున్నారు. తమ కెదురౌతున్న మౌలిక సమస్యలనుండి ప్రజల దృష్టి మరల్చేందుకు పొరుగుదేశాలపట్ల విద్వేషాలను పెంచే పని కేంద్రంలోని కాంగ్రెసు చేస్తున్నది. పాకిస్తానుతో సరిహద్దులలో ఉద్రిక్తత సృష్టిస్తున్నది. ప్రతిపక్షంలోని బిజెపి కూడా జాతీయ భద్రత, ఆర్థిక జాతీయవాద నినాదాలతో వంతపాడుతున్నది.

అధికారంకోసం హైద్రాబాదు నగరంలో మతకల్లోలాలు సృష్టించిన చరిత్ర కాంగ్రెసు పార్టీదే. "హిందూజాతీయత" నినాదంతో హిందూమతతత్వ శక్తులను సమీకరించటమే తప్ప, బిజెపికి మరో కార్యక్రమంలేదు. ప్రజల మనస్సుల్లోలేని భాగ్యలక్ష్మి దేవాలయ వివాదాన్ని ఇటీవల తిరిగిరెచ్చగొట్టింది బిజెపి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేర్పడిన తర్వాత తీసి అప్పుడే ప్రచురించిన చార్మినార్ ఫోటోలో దానినానుకుని దేవాలయమన్నది లేదని ది హిందూ పత్రిక అప్పటి ఫోటోనూ, ఇప్పటి ఫోటోనూ తిరిగి ప్రచురించి స్పష్టంచేసింది. అయినా చార్మినార్‌తోపాటే అది వుందంటూ అక్కడ పూజలు చేస్తామంటూ (న్యాయస్థానం వద్దన్న స్టే వున్నా కూడా) బిజెపి యాగీకి దిగింది, మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకే. ఆ సందర్భంగా బిజెపి నాయకులూ, విహెచ్‌పి నాయకుడు తొగాడియా ఉపన్యాసాలు ఎంతరెచ్చగొట్టే స్థాయిలో సాగాయో అందరికీ తెలిసినదే. అక్కడ మొదలైన ఈ రచ్చ బిజెపి దూకుడును ఆపనందుకు కాంగ్రెసుతో ఎంఐఎం తెగతెంపులుకూ, అక్బరుద్దీన్ రెచ్చగొట్టే ఉపన్యాసానికీ దారితీసింది. అధికారంలో వుండి ఇప్పటికైనా రచ్చను సర్దుబాటుచేసి చల్లార్చే బదులు అక్బరుద్దీన్‌పై కేసులు, అరెస్టులు అంటూ ముస్లింలలో మతతత్వశక్తులు ప్రబలటానికి తగిన వాతావరణాన్ని కల్పించే చర్యలకు కాంగ్రెసు పూనుకుంది.

దీనికితోడు తెలంగాణా సమస్యను మళ్లీ ఎగదోయపూనుకుంది కాంగ్రెసు. ఇస్తాననో, ఇవ్వననో తేల్చకుండా సంవత్సరాల తరబడి సమస్యను నానబెట్టి ప్రజలమధ్య ప్రాంతీయ విద్వేషాలను రగిల్చే కుతంత్రాన్ని కాంగ్రెసు సాగిస్తున్నది. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. తెలంగాణా యివ్వాలంటే ఏకాభిప్రాయం కావాలంటూ కాంగ్రెసే రెండు అభిప్రాయాలుచెప్పి, నెలరోజులు వాయిదా వేసింది. ఇక రాజకీయాలన్నీ తెలంగాణా చుట్టూనే తిప్పపూనుకున్నది తప్ప సమస్యను పరిష్కరిద్దామన్న ఆలోచనకూడా లేదన్నది స్పష్టమే. నిర్ణయం చెప్పకుండానే రెండుగానీ, మూడుగానీ, హైద్రాబాదు ఎవరిదంటూ కాంగ్రెసు వారే చర్చోపచర్చలు చేయటం తెలంగాణా యిచ్చినా దాయాదుల పోరుగా చిచ్చును కొనసాగించే కుతంత్రమే సాగిస్తున్నది. మత, కుల, ప్రాంతీయ వైమనస్యాలను పెంచి ప్రజలను విడదీయటమే కర్తవ్యంగా, ఆవిధంగా దోపిడీ వర్గాల పాలనకు భంగం కలుగకుండా చూడటమే పనిగా పాలకపార్టీలు వ్యవహరిస్తున్నాయి.

అయినా ప్రజాగ్రహాన్ని చూసి భీతిల్లుతున్న పాలకులు, నిరంకుశ చట్టాలకు కోరలు సమకూరుస్తున్నారు. 144వ సెక్షను అమలులో లేని పట్టణం లేదు. ప్రదర్శనలపై నిషేధంలేని నగరమూ లేదు. టెంటు వేసుకుని నిరాహారదీక్ష చెయ్యాలన్నా పోలీసుల అనుమతి కోరాల్సిందే. ఇక ముస్లిం టెర్రరిజంపేరిట మైనారిటీ యువకులను పట్టుకుపోయి విచారణ లేకుండా జైళ్ళలో కుక్కుతున్నారు. రెండేళ్ల తర్వాత కోర్టుముందుకు వస్తే, నిర్దోషులని వదలివేస్తున్న ఘటనలు బయటకొస్తున్నాయి. జాతీయ భద్రత పేరిట నిర్బంధ చట్టాలను పదునెక్కిస్తున్నారు. అభివృద్ధి ప్రాజెక్టులు, విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో మంచిచెడ్డలు చెప్పి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాల్సిన చట్టవిహిత సభలను కూడా పోలీసు పహారాపెట్టి, ప్రజలను రాకుండాచేసి నిర్వహించు కుంటున్నారంటే ఎంతగా నిర్బంధ యంత్రాంగంపై ఆధారపడి మాత్రమే పాలన సాగించదలచారో అర్థమౌతుంది. ఆడపిల్లను వేధించాడని (అది సహించరాని నేరమైనప్పటికీ) పట్టుకుని ఎన్‌కౌంటరు పేరుతో చంపిన పోలీసు అధికారికి, చట్టబద్ధ పాలనే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మనే రాజకీయ నేతలతో సహా ఉన్నత వర్గాలు నీరాజనాలు పలికాయంటే "తక్షణ న్యాయమన్న" మధ్యయుగాల చీకటి రాచరిక నిర్బంధకాండకు పరోక్ష ఆమోదముద్ర పొందటానికేనన్నది స్పష్టం.

గత రెండు నెలలుగా దేశంలోనూ, రాష్ట్రంలోనూ సాగిన పరిణామాల అంతరార్థమిది. వేరువేరుగా విడివిడిగా సాగినట్లు కన్పించే ఆర్థిక, రాజకీయ విధానాలూ, నిర్ణయాలలో పూసల్లో దారంలా వున్న అంశమిదే.

దోపిడీ అణచివేతలతో ప్రజల జీవితాలను కల్లోలభరితం చేస్తున్నారు. తత్పర్యవసానంగా ప్రజలలో పెరుగుతున్న అశాంతిని చల్లార్చేందుకు భ్రమలు కల్పించే పథకాలతో ప్రజలను సహాయం కోసం ఎదురుచూసే స్థితిలో వుంచుతున్నారు. ప్రజలు సంఘటితపడకుండా కుల, మత, ప్రాంతీయ వైమనస్యాలను రెచ్చగొట్టి విడదీస్తున్నారు. అది చాలక పాశవిక నిర్బంధంతో అణచివేతకు దిగుతున్నారు.

దోపిడీ పాలక వర్గాల, వారి రాజకీయ ప్రతినిధులైన పాలకపార్టీల ఈ నిజస్వభావాన్ని గుర్తించి, వారు కల్పిస్తున్న భ్రమలను వదల్చుకుని, వైషమ్యాలను అధిగమించి ప్రజలు సంఘటిత పోరాటాలు సాగించాలి. ఈ చైతన్యంతో వర్గ పోరాటాలు నిర్వహించటమే వారి తక్షణ, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి దారితీస్తాయి. అలాంటి వర్గపోరాటాలకు ప్రజలను అన్నివిధాలుగా సన్నద్ధం చేయటమే కమ్యూనిస్టు విప్లవకారుల కర్తవ్యం. ✡

## లక్షింపేట దళిత హంతకుల విచారణకు లక్షింపేటలో ప్రత్యేకకోర్టు ఏర్పాటు - దళితుల పోరాట విజయం

**2012** జూన్ 12న శ్రీకాకుళంజిల్లా-వంగర మండలం-లక్షింపేట గ్రామంలోని దళితవాడపై కాపు కులదురహంకారులు ఏకపక్షంగా, విచ్చల విడిగాసాగించిన క్రూరమైన దాడిలో నలుగురు మృతిచెందగా పదుల సంఖ్యలో తీవ్రగాయాలపాలైన సంగతి విదితమే.

ఈ నేపథ్యంలో వివిధ ప్రజాసంఘాలతో 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావకమిటీ' ఏర్పడి, ఈ కమిటి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాపితంగా విస్తృత ప్రచార, ఆందోళనా కార్యక్రమాలు సాగుతూ వస్తున్నాయి. లక్షింపేటలోనే ప్రత్యేకకోర్టునేర్పరచి సత్వర విచారణ పూర్తిచేయాలని; లక్షింపేట దళితులపై హంతక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, మడ్డువలస రిజర్వాయరులో మునకకు గురికాని 250 ఎకరాల భూములను దళితులకే కేటాయించాలని; దళితులపై దాడికి బాధ్యులైన బొత్స సత్యనారాయణ, కోండ్రు మురళిలను రాష్ట్రమంత్రివర్గంనుండి బర్తరఫ్ చేయాలనే డిమాండ్స్‌తో రాష్ట్రపరిధిలోనేగాక, ఢిల్లీ స్థాయిలోనూ ఆందోళనను చేపట్టి-కేంద్రహోంశాఖామంత్రి సుషీల్‌కుమార్ షిండేకు మెమోరాండం అందజేయటం జరిగింది.

ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చి దళితులపై హంతకదాడికి పాల్పడిన దోషుల విచారణకై లక్షింపేటలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు అంగీకరించటంపట్ల 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' హర్షం వ్యక్తం చేస్తున్నది. ఇది దళితుల, ప్రజాస్వామికశక్తుల ఐక్యపోరాట విజయంగా ప్రకటిస్తూ, లక్షింపేట దళితుల మిగిలిన డిమాండ్స్ పరిష్కారమయ్యేంతదాకా, ఐక్య ఉద్యమాన్ని ముందుకు కొనసాగించాలని పిలుపునిస్తున్నాం.

**అభినందనలతో**
**బొజ్జాతారకం**
**కన్వీనర్**
**లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి**

## రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) అభినందనలు

**లక్షింపేట** మారణకాండ అనంతరం కా॥బొజ్జాతారకం కన్వీనర్‌గా ఏర్పడిన 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి'లో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) భాగస్వామిగా, కమిటి పిలుపులన్నింటినీ చురుగ్గా అమలుచేస్తూ వస్తున్నది. జిల్లా స్థాయి ధర్నాలు, ప్రాంతీయ సదస్సులు, పాదయాత్ర, ఢిల్లీధర్నా, చలో హైదరాబాద్ మొదలైన కార్యక్రమాలన్నింటా దళిత, వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను, ఐక్యపోరాట ఆవశ్యకతను గాఢంగా ప్రకటిస్తూవస్తున్నది.

లక్షింపేట మారణకాండ దోషులను విచారించేందుకు లక్షింపేటలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు దళిత, ప్రజాస్వామిక శక్తుల ఐక్యపోరాట విజయంగా పేర్కొంటూ, లక్షింపేట దళితుల భూమి సమస్య పరిష్కారానికి, రాష్ట్రంలో మరింతగా పెచ్చుమీరుతున్న ఫ్యూడల్ అణచివేత, దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దీర్ఘకాల ఐక్యకార్యాచరణకు పూనిక వహించాల్సిందిగా పిలుపునిస్తున్నది.

**అభినందనలతో**
**యస్.ఝాన్సి**
**అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)**

**విజయవాడ**
**9-1-13**

## ఒడిషా భూమి సమస్యపై కొనసాగుతున్న ఆందోళన

**ఒడిషారాష్ట్రం** - పూరిజిల్లాలోని బ్రహ్మగిరి బ్లాక్-సిపాసరుబాలితాలూకా ప్రజానీకం యుజెజెఎస్‌ఎస్ మరియు ఛాసీమూలియా సంఘల ఆధ్వర్యంలో 1307 ఎకరాల ప్రభుత్వ భూముల స్వాధీనం కొరకు పోరాటం ప్రారంభించి దాదాపు సంవత్సరకాలమైంది. అప్పటికి దశాబ్దాలకాలంగా చట్టవిరుద్ధంగా, బలప్రయోగంతో ఈ భూమి దురాక్రమించు కొనివున్న భూ కబ్జాముఠాను తరిమివేసి ప్రజలు ఈ భూమిని స్వాధీనంలో వుంచుకున్నారు. ఈ భూమిపై తమ న్యాయమైన, ప్రజాస్వామిక హక్కును నిర్ధారించుకొని, ఈ భూమిలో ఉత్పత్తిని సాగించటానికి మరిన్ని నిర్దిష్టమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఎంచేతనంటే, ప్రభుత్వం దుర్మార్గపూరితంగా కోస్తా తీరప్రాంతంలోని విస్తారమైన భూములను బహుళజాతి పరిశ్రమలకు ధారదత్తం చేసిన విధంగానే, పర్యాటక రంగం పేరుతో, మెగాహోటల్ పథకాలను అమలు చేసే పేరిటా ప్రభుత్వం ఈ భూములను కూడా బడావ్యాపారులకు కట్టబెట్టకుండా నిరోధించ వలసివుంది.

దశబ్దాలుగా, ప్రభుత్వానికి చెందిన ఈ భూములను భూకబ్జాదారులు తమ ఆధీనంలోకి తీసుకొని అనుభవిస్తూ వుంటే, ఒడిషా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించింది. భూమిలేని పరిసర 20 గ్రామలకు చెందిన నిరుపేద ప్రజానీకం, ఈ భూమిని తమకు కేటాయించాలని కోరడంతోనే ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆందోళనకారులపై అక్రమ కేసులు బనాయించింది. సాయుధ పోలీసు బలగాల పహారాలో ఆ భూమి చుట్టూతా ఇనుపకంచె నిర్మాణం చేసే ప్రయత్నం చేసింది. కానీ ప్రజల సమైక్య, సంఘటిత, శాంతియుత ప్రతిఘటనతోనే ప్రభుత్వం వెనక్కితగ్గింది.

ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలని ప్రజాస్వామిక వాదులు, మేధావులు తీవ్రంగా నిరసించారు. 2012 జులై 12న న్యాయవాదులు, ప్రజాస్వామికవాదులు, సామాజిక కార్యకర్తలతో కూడిన ఓ నిజనిర్ధారణబృందం సిపాసరుబాలి తాలూకాను సందర్శించి వాస్తవాలను వెల్లడించింది. ప్రజల న్యాయమైన ఆందోళనకు మద్దతు ప్రకటించింది. కోస్తాతీర ప్రాంతంలో మెగాహోటల్ పథకాలను రద్దుచేసుకోమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రజలపై నిర్బంధ చర్యలను నిలిపివేయాలని కోరింది. ప్రజల ఆధీనంలోనున్న ప్రభుత్వ భూమిపై వారికే హక్కు కల్పించాలని డిమాండ్ చేసింది.

ఈ పరిణామాల నేపథ్యంలో పూరి జిల్లా సబ్‌కలెక్టరు ఆందోళనకారుల ప్రతినిధి బృందాన్ని చర్చలకు పిలవటం ఆహ్వానించదగినది. 2012 జులై 17న చర్చలు జరిగాయి. ప్రభుత్వ భూముల చుట్టూ కంచె వేయటం, ఆ భూములను పరిరక్షించుకోవటం కోసం తప్పితే, మెగా హోటల్ ప్రాజెక్టుల వంటివేవీ లేవని సబ్‌కలెక్టరు ప్రకటించారు. ఆందోళనకారుల ప్రతినిధిబృందం ఆధారాలతో సహా ప్రభుత్వ వాదనల బూటకత్వాన్ని ఎత్తిచూపింది. కోస్తా తీరప్రాంతంలోని యావత్తు భూములు, అడవి, ఇసుక ఇతర వనరులన్నింటినీ ప్రజలకు మించి మరెవరూ సమర్ధవంతంగా కాపుగాయరని ప్రతినిధిబృందం తేల్చిచెప్పింది. భూమిహీనులైన పేదలకు భూమి కల్పిస్తామని సబ్‌కలెక్టరు వాగ్దానం చేశాడు. ఒక ఒప్పందం ఏమీ లేకుండానే చర్చలు ముగిసాయి. 2012 జులై 24న తన డిమాండ్లన్నింటినీ యుజెజెఎస్‌ఎస్ వ్రాతపూర్వకంగా జాయింట్ కలెక్టరుకు అందజేసింది.

అందులో 1. ప్రత్యేక పర్యాటక రంగంగా కోస్తా తీరప్రాంతాన్ని మరల్చే బృహత్ పథకాన్ని; షముఖ బీచ్ పథకాన్ని పూర్తిగా రద్దుచేయాలి. 2. 1307ఎకరాల ప్రభుత్వ భూమిపై భూమిలేని నిరుపేదలకు హక్కు కల్పించాలి. ఎలాంటి భూకబ్జాదారులకు చోటు కల్పించరాదు. 3. మాజీ జమిందారు అయిన కాపూర్ కుటుంబానికి చెందిన, మిగులు భూమిగా తేలిన 177 ఎకరాలను ఒడిషా హైకోర్టు ఆదేశించిన ప్రకారం 1984 నుండి ఆ భూములను సాగుచేస్తున్న కుటుంబాలకే అప్పగించాలి. 4. సిపాసరుబాలి భూపోరాటంలో ప్రభుత్వం బనాయించిన కేసులన్నింటినీ ఎత్తివేయాలి. 5. ప్రజలపై దాడులకు తెగబడిన నేరస్తులను అరెస్టు చేయాలి.

ఈ డిమాండ్లపై ప్రభుత్వంవైపునుండి లాంఛన ప్రాయమైన స్పందనకూడా వ్యక్తంకాలేదు. కనుక, ప్రజలు తమ ఆందోళనను కొనసాగించేందుకే నిర్ణయించుకున్నారు.

**(తరువాయి 7వ పేజీలో)**

చీల్చడానికీ, సోవియటు వ్యతిరేక ఉన్మాదాన్ని పెంచటానికీ ట్రాట్స్కీ అనుచరులు పనిచేశారు. ప్రపంచ శాంతికి సోవియటు తక్షణ ప్రమాదమనీ, దాని నాయకుడు స్టాలిన్ రక్తపిపాసి అనీ పశ్చిమ దేశాలలోని "వామపక్షీయుల"ను నమ్మించేందుకు వారు పూనుకున్నారు. వారు సోవియటు యూనియనును బాదేందుకు సామ్రాజ్యవాదుల చేతిలో సైద్ధాంతిక లాఠీలుగా తయారయ్యారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో విద్రోహులుగా రూపొందారు.

## దేశభక్తియుత యుద్ధం

1941 జూన్ 22న ఎలాంటి యుద్ధ ప్రకటనా చేయకుండానే సోవియటు యూనియన్‌పై జర్మనీ దురాక్రమణకు దిగింది. సోవియటుపై మెరుపుదాడితో విజయం సాధించవచ్చని జర్మనీ సైన్యం ఆశించింది. తూర్పువైపుకు తనకున్న విస్తరణకాంక్షను హిట్లరెప్పుడూ దాచుకోలేదు. జర్మనులకు రష్యా నివాస భూమికావాలి. స్లావ్ జాతి ప్రజలలో మూడవవంతును ఊచకోత కోయాలనీ, మరో మూడవ వంతును అర్ధబానిసత్వంలో వుంచాలనీ, మిగిలిన మూడవవంతును జర్మను సామ్రాజ్యంలో ఇతర భాగాలకు వెట్టిచాకిరికి తరలించాలనీ హిట్లర్ అన్నాడు. ఈ హిట్లర్ పథకాన్ని అమలు జరపటానికి ఎంచుకున్నవాడే గూఢచార అధిపతి జనరల్ రీన్‌హర్డ్ గెలెన్. జర్మనీ ఆక్రమిత ప్రాంతాలలో ప్రత్యేకదళాలు కమ్యూనిస్టులందరినీ ఒకచోట చేర్చి మెషిన్‌గన్‌లతో కాల్చిచంపాయి. సోషలిస్టు నిర్మాణ దశ ఆగిపోయింది. యుద్ధకాలం ప్రారంభమైంది. అది జర్మన్ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా సోవియటు ప్రజలు సాగించిన దేశభక్తియుత విముక్తి యుద్ధం.

జర్మను దురాక్రమణదారులను తరిమివేసేందుకు సోవియటు ప్రజల శక్తులన్నింటినీ సమీకరించేందుకు రాజ్య రక్షణ కమిటి ఏర్పడింది. స్టాలిన్ ఈ కమిటీకి అధ్యక్షుడు.

1941 జూలై మూడున దేశప్రజలనూ, ఎర్ర సైన్యాన్నీ ఉద్దేశించి స్టాలిన్ రేడియోలో ప్రసంగించారు. ఈ చారిత్రక ప్రసంగంలో స్టాలిన్ సైనికంగా ఉన్న తీవ్ర పరిస్థితిని ప్రజలముందుంచారు. మాతృభూమికి ఏర్పడే ముప్పు తీవ్రతను ఆకళింపు చేసుకొమ్మని సోవియటు ప్రజలను కోరారు.

సోవియటు యూనియనుకు వ్యతిరేకంగా యుద్ధంలో జర్మనీ కున్న లక్ష్యాలను ప్రజలముందుంచారు.

**"శత్రువు క్రూరుడు; మారనివాడు. మనకనుబొమలనుండి జాలువారిన చెమటతో తడిసిన మన భూమిని ఆక్రమించుకోవాలని తపిస్తున్నవాడు. మన కాయకష్టంతో పొందిన ధాన్యాన్నీ, చమురునూ కబళించాలని చూస్తున్నవాడు. భూస్వాముల పాలననూ, జారుప్రభువు పాలననూ పునఃస్థాపించాలని చూస్తున్నవాడు. రష్యన్ల, ఉక్రేనియన్ల, బైలోరష్యన్ల, లిథువానియన్ల, లాత్వియన్ల, ఎస్తోనియన్ల, ఉజ్బెకుల, తార్తారుల, మొల్దావియన్ల, జార్జియన్ల, ఆర్మీనియన్ల, అజర్‌బైజానియన్ల, ఇతర స్వేచ్ఛా సోవియటు ప్రజల జాతీయ సంస్కృతినీ, జాతిరాజ్యాలుగా వారి ఉనికినీ నాశనం చేయపూనుకున్నవాడు. వారిని జర్మనీకరించ డానికీ, జర్మనీప్రభువులకు, భూస్వాములకు బానిసలుగా చేయపూనుకున్నవాడు. కనుక సమస్య సోవియట్ రాజ్య జీవన్మరణ సమస్య. సోవియటు ప్రజల జీవన్మరణ సమస్య, సోవియటు ప్రజలు స్వేచ్ఛా జీవులుగా వుంటారా లేక బానిసత్వంలోకి కూరుకుపోతారా?"**

తమ పనిని తక్షణమే పునర్‌నిర్వచించుకోమనీ, యుద్ధరంగ అవసరాలకు సర్వశక్తులను ఒడ్డమనీ, శత్రువును ఓండించమనీ సోవియటు ప్రజలకు స్టాలిన్ పిలుపునిచ్చారు. సోవియటు భూమిలో ప్రతి అంగుళాన్నీ రక్షించమనీ, ప్రతిగ్రామం, పట్టణం రక్షణ కొరకు చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడమనీ ఎర్రసైన్యానికీ, సోవియటు పౌరులకూ స్టాలిన్ పిలుపునిచ్చారు. ఎర్రసైన్యం వెనుకడుగు వెయ్యాల్సివస్తే, "శత్రువుకు ఒక్క యంత్రం కూడా లభించరాదు. ఒక్క రైలు పెట్టెకూడా దొరకరాదు; ఒక కిలో గోధుమలు గానీ, గ్యాలను చమురు గానీ మిగలరాదు...శతృఆక్రమిత ప్రాంతాలలో గెరిల్లా దళాలను ఏర్పరచాలి; శతృవు వనరులను ధ్వంసం చేసే దళాలుండాలి. వంతెనలు, రోడ్లు, టెలిఫోనులైన్లు కూల్చివేయాలి. అడవులను, రవాణా సాధనాలను ధ్వంసం చేయాలి" అని స్టాలిన్ ఆదేశించారు.

బోల్షివిక్ విప్లవకారుడి లక్షణాలైన సాహసం, పట్టుదల, ఉక్కు సంకల్పంతో ప్రజా రక్షణ కమీస్సార్ అయిన జె.వి. స్టాలిన్ సోవియట్ ప్రజలను సమీకరించారు: **"సోవియటు యూనియన్ ప్రజలను విధ్వంసం చేసే యుద్ధాన్ని జర్మను దురాక్రమణదారులు కోరుకుంటున్నారు. సరే, వారదే కోరుకుంటే, వారికదే జరుగుతుంది".**

"మన పూర్వయోధుల వీరత్వం మిమ్ములను ఉత్తేజపరుస్తుంది" అని స్టాలిన్ ఎర్రసైన్యానికి చెప్పారు.

జర్మనులు మాస్కో నగర పొలిమేరలకు చేరినప్పుడు,

*సోషలిస్టు అభివృద్ధి ప్రణాళికల లక్ష్యాలను సాధించడానికి లక్షలాది కార్మికులనూ, రైతాంగాన్ని సమీకరించారు. ఆనాటికది ప్రపంచ చరిత్రలోనే పెద్ద ప్రజాఉద్యమం. ఇంత పెద్దస్థాయిలో, అభివృద్ధికొరకు ప్రజాభాగస్వామ్యంతో పారిశ్రామిక నిర్మాణాన్ని చరిత్ర ఎరుగదు. ఇది అనేకమంది శ్రమవీరులను సృజించింది. పనిపట్ల సరికొత్త భావనలను తెచ్చింది. దేశప్రణాళికలో పెట్టుకున్న లక్ష్యాలను మించే విధంగా అదనపు ప్రణాళికలను ప్రతి ఫ్యాక్టరీ, ప్రతి సమిష్టిక్షేత్రాలలో కార్మికులూ, రైతులూ రూపొందించుకున్నారు. శ్రమపట్ల వైఖరులు మారాయి. పెట్టుబడిదారీ విధానంలో వున్న నిర్బంధ బానిసత్వ చాకిరీనుండి స్టాలిన్ మాటల్లో "గౌరవంగా, వీరత్వంగా, ప్రతిష్టగా మారింది. పెట్టుబడిదారీ విధానంలో దీనితో సరితూగగలిగేదేమీ లేదు".*

ఎర్రసైన్య నాయకత్వాన్ని స్టాలిన్ స్వయంగా చేపట్టారు. ఒకవేళ మాస్కో శత్రువుచేత చిక్కితే పోరాటాన్ని కొనసాగించేందుకు దాదాపుగా అధికారులందరినీ యురల్సు పర్వతాలకు తూర్పువైపుకు పంపారు. అయితే తాను మాత్రం మాస్కో నగరంలోనే వుండి దానిరక్షణను స్వయంగా చేపట్టారు.

1941 డిసెంబరు 6న మాస్కోలో కేంద్రీకరించిన అనేక ఎర్రసైన్య దళాలు ఒక్కసారిగా శత్రుబలగాలపై విరుచుకుపడ్డాయి. తీవ్రయుద్ధం తర్వాత శత్రుదళాలు దెబ్బతిని వెనక్కు తగ్గాయి. అయితే ఎర్రసైన్యం పశ్చిమంగా పురోగమించి శత్రుదళాలను 400 కి.మీ. వరకూ తరిమి కొట్టింది. మాస్కోను చుట్టుముట్టి కైవశం చేసుకోవాలన్న హిట్లర్ పథకం విఫలమైంది.

మాస్కో నగర పొలిమేరల నుండి జర్మన్ సైన్యం తరిమివేత ఒక నిర్ణయాత్మక సైనిక ఘటన. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనులు పొందిన మొదటి పెద్దఓటమి. జర్మనుసైన్యం అజేయమన్నది పుక్కిటి పురాణమని నిరూపించింది.

1942 వసంతకాలంలో నాజీలు మళ్లీ దాడికి దిగారు. ఉత్తరాన లెనిన్ గ్రాడ్ వైపు, మధ్యన మాస్కో వైపు చొచ్చుకు వచ్చే ప్రయత్నం చేశారు. దక్షిణాన కాకసస్ చమురు క్షేత్రాలను ఆక్రమించుకుంటారనిపించింది. అయితే వారి లక్ష్యం స్టాలిన్‌గ్రాడ్. ఎట్టిపరిస్థితిలోను స్టాలిన్‌గ్రాడ్ చేజారి పోరాదని స్టాలిన్ ఆజ్ఞాపించారు.

చరిత్రలో ఎరగని అతిపెద్ద యుద్ధం, స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం మొదలైంది. ఎర్రసైన్యం వీరోచితంగా ఓల్గా నదీతీర నగరాన్ని రక్షించింది. 1942 ఆగస్టు నుండి 1943 జనవరి వరకూ గడపగడపకూ పోరాటంసాగింది. జర్మనీ చుట్టుముట్టిన నగరానికి ఆహార సరఫరాలేక వేల మంది రష్యన్లు మరణించారు.

**సోవియటు ప్రజలనుద్దేశించి స్టాలిన్ ఇలా చెప్పారు:**

**"జర్మనీ ఫాసిస్టు రక్కసి మూకల, దాని మిత్రుల దాడిని తట్టుకుని మరే దేశమూ, మరే సైన్యమూ నిలవగలిగినవి కావని నేను భావిస్తున్నాను. సోవియటు దేశానికీ, ఎర్రసైన్యానికీ మాత్రమే అది సాధ్యమైంది. తట్టుకొని నిలవటమే కాదు దానిని జయించగలిగింది"**

1942 నవంబరు 19న, స్టాలిన్ ఆదేశాల మేరకు సోవియటు సైన్యం స్టాలిన్ గ్రాడ్‌వైపు పురోగమించింది. జర్మను సైన్యానికి కుడి, ఎడమవైపులా, తర్వాత వెనుకనా దాడి చేసింది. ఈ వ్యూహం ఎర్రసైన్యానికి విజయం చేకూర్చింది. కొద్ది రోజుల్లోనే 3 లక్షల జర్మన్ సైన్యం చుట్టివేతకు గురయింది. గొప్పయుద్ధాలలో కెల్లా ఇది ప్రముఖ విజయం.

**స్టాలిన్‌గ్రాడ్ యుద్ధ ప్రాధాన్యత గురించి తర్వాత స్టాలిన్ ఇలా వ్రాసారు:**

**"జర్మను ఫాసిస్టు సైన్య పతనానికి స్టాలిన్‌గ్రాడ్ ప్రారంభంగా వుంది. స్టాలిన్‌గ్రాడ్ దెబ్బనుండి జర్మను సైన్యం ఎప్పటికీ కోలుకోలేక పోయిందని నేడందరికీ తెలిసినదే"**

స్టాలిన్ గ్రాడ్ విజయంతో చొరవ చేతికొచ్చిన ఎర్రసైన్యం తన ఎదురుదాడిని కొనసాగించింది. సోవియటు భూమి నుండి శత్రువు తరిమివేత దగ్గరపడింది.

1944లో సోవియటు సైన్యానికి నిర్ణయాత్మక విజయాలు వచ్చాయి. అక్టోబరు సోషలిస్టు మహావిప్లవ 27వ వార్షికోత్సవం సందర్భంగా స్టాలిన్–ఎర్రసైన్యపు విజయం, మాతృభూమి విముక్తి, బెర్లిన్‌లో విజయ అరుణపతాక ఎగురవేత తథ్యమని చెప్పారు. 1945 మే 2న సోవియటు సైన్యం జర్మనీ రాజధాని బెర్లిన్‌ను వశపరుచుకుంది. స్టాలిన్ పిలుపును ఎర్రసైన్యం అమలు జరిపింది.

సర్వసైన్యాధిపతి స్టాలిన్ ఆదేశం మేరకు 1945 జూన్ 24న మాస్కోలో విజయోత్సవం జరిగింది. తాము ధ్వంసం చేసిన జర్మనీ సైనిక దళాల పతాకాలను సోవియటు సైన్యం రెడ్ స్క్వేర్‌కు తెచ్చి, విజయులైన సోవియటు ప్రజల పాదాల వద్ద వుంచారు. లెనిన్ మాసోలియం మెట్లపై వుంచారు. ఈ భవనంపైనే స్టాలిన్ నిలబడి సైనిక కవాతును చూశారు.

**సోవియటు యూనియన్ సాగించిన దేశభక్తియుత మహాయుద్ధం గురించి స్టాలిన్ ఇలావ్రాసారు :**

**"సోవియటు దేశభక్తి యొక్కబలం తెగల లేక జాతుల మధ్య దురభిప్రాయాలపై ఆధార పడిలేదు; అది సోవియటు మాతృభూమిపట్ల ప్రజల అపరిమిత విశ్వాసంపై ఆధారపడివుంది. ఆ మాతృభూమిలో జీవిస్తున్న అన్ని జాతుల శ్రమజీవుల సౌభాతృత్వ సహకారాలపై ఆధారపడివుంది. ప్రజల జాతీయ సాంప్రదాయాల, సోవియటు యూనియనులోని శ్రమజీవుల సమిష్టి ప్రయోజనాల సమమేళవింపే సోవియట్ దేశభక్తి...అదే సమయంలో, విదేశాలలోని ప్రజల స్వాతంత్ర్యాన్నీ, హక్కులనూ సోవియటు ప్రజలు గౌరవిస్తారు. పొరుగు దేశాలతో శాంతి, స్నేహాలతో జీవించేందుకు ఎల్లప్పుడూ సంసిద్ధంగా వుంటారు. మనదేశానికీ, ఇతర స్వేచ్ఛా కాముక ప్రజలకూ మధ్య సంబంధాల విస్తరణకూ, పెరుగుదలకూ దీనినే ప్రాతిపదికగా పరిగణించాలి"**

జర్మనీ దురాక్రమణతో సోవియటు యూనియను విధ్వంస పూరిత నష్టాలకు గురైంది. సోవియటు రష్యాలో 70వేల గ్రామాలు, 1700 పట్టణాలు, 60 లక్షల యిళ్లు, 31వేల ఫ్యాక్టరీలు ధ్వంసమయ్యాయి. 86 లక్షల సోవియటు సైనికులు నిహతులయ్యారు. ఒక కోటి 70 లక్షల మంది పురుషులు, స్త్రీలు, పిల్లలు హత్య కావించబడ్డారు. "అన్నికాలాలలోనూ అత్యంత విధ్వంసక" యుద్ధమని బ్రిటీషు చరిత్రకారుడు ఏ.జి.పి. టైలర్ వర్ణించారు.

ఈ విధ్వంసం నుండి కోలుకోవటానికి సోవియటు యూనియనుకు కొన్ని దశాబ్దాలు పడుతుందని కొందరు పశ్చిమ దేశాల నాయకులు భావించారు. ఈ తీవ్ర నష్టాలతో సోవియటు యూనియను కుంగిపోతుందని మరికొందరు భావించారు. ఇరువురూ తప్పే.

ప్రతిఘటనలో సోషలిస్టు స్ఫూర్తికీ, ప్రజల వీరోచిత త్యాగాలకూ ప్రతీకగా నిలచిన మహామనీషి స్టాలిన్ మరిన్ని విజయాల వైపుగా సోవియటు పౌరులను నడిపించారు.

## సోషలిస్టు నిర్మాణం

రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత సోవియటు ప్రజలు మరింత అభివృద్ధి కార్యక్రమాలతో పునర్నిర్మాణాన్ని ప్రారంభించారు. స్టాలిన్‌ను ఆదర్శంగా తీసుకుని సోవియటు కార్మికులు ఘనవిజయాలు సాధించారు. సోవియటు పారిశ్రామికరంగం వేగంగా పెరిగింది. ముందడుగులో వున్న పశ్చిమదేశాలతో పోటా పోటీగా నిలిచింది.

పచ్చి రష్యా వ్యతిరేకి, పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకి అయిన విన్‌స్టన్ చర్చిల్ సోవియటు యూనియను వేగవంత అభివృద్ధిని చూసి బేజారు పడ్డాడు. పశ్చిమ పెట్టుబడిదారీ 'నాగరిత'కు స్టాలిన్ తెచ్చే ప్రమాదాన్ని గూర్చి మాట్లాడాడు. నాజీల ప్రచార మంత్రి గొబెల్స్ తీరులో ''ఇనుపతెర'' వెనుక సోవియటు యూనియనుందన్నాడు. సోషలిజం పురోగమనాన్ని ఆపేందుకూ, నూతనంగా విముక్తి చెందిన తూర్పుయూరపు దేశాలలో పెట్టుబడిదారీ విధానాన్ని స్థాపించేందుకూ సోవియటు యూనియన్‌పై ఆంగ్లో–అమెరికన్ కూటమి పవిత్రయుద్ధం సాగించాలన్నాడు. పునరుజ్జీవిస్తున్న సోవియటు యూనియన్‌ను పెట్టుబడిదారీ విధానం సహించలేక పోతోంది. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో ఒకప్పుడు మిత్రుడైన స్టాలిన్, ఇప్పుడు ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి ప్రధాన శతృవయ్యాడు.

యుద్ధం ముగిసిన తర్వాత, సోషలిజాన్ని నిర్మించే పంథాలో సోవియటు యూనియను పురోగమిస్తున్నది. జాతీయ విముక్తి ఉద్యమాల ఉధృతి పెరుగుతున్నది. నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు స్టాలిన్ నాయకత్వంలో సాగుతున్న సోషలిస్టు వ్యవస్థతో ప్రభావితమౌతున్నాయి. ఇది లండన్, పారిస్, న్యూయార్కులలోని గుత్త పెట్టుబడిదారుల గుండెలలో దడపుట్టించింది. ప్రపంచ విప్లవోద్యమాన్ని అణచి వేసేందుకూ, సోవియటు యూనియన్‌ను ఒంటరి చేసేందుకూ అన్ని రకాల రాజకీయ కుట్రలకూ, గూఢచారి చర్యలకూ, మోసాలకూ వారు పాల్పడ్డారు.

తమ గూఢచారుల ద్వారా, తమ ప్రభావంలో వున్న అంతర్గత ఏజంట్ల ద్వారా సోవియటు యూనియన్‌ను ధ్వంసం చేసే చర్యలకు పాల్పడుతున్నారని తెలిసిన స్టాలిన్, దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. సోవియటు రాజ్యాంగంలో నిజమైన ప్రజాస్వామికం కొరకు కొన్ని సవరణలను పార్టీ ముందు ప్రతిపాదించారు. అదే సమయంలో సోవియటు నాయకులను విషంతో హత్యలు చేసేందుకు పూనుకున్న కొందరు వైద్యులను అరెస్టు చేయించాడు (1953 జనవరిలో) అనేకమంది ద్రోహులు దాగి వుండటాన్ని గుర్తించారు. సాక్ష్యాధారాలతో న్యాయస్థానాల ముందు వారిని విచారించే పని సాగుతుండగా, 1953 మార్చి 5న ఆయన హఠాత్తుగా మృతి చెందారు. దీనితో ఈ ద్రోహులు వెల్లడికాకుండా తప్పించుకున్నారు.

స్టాలిన్ మరణంతో సోవియటు యూనియను పతనం మొదలైంది. కమ్యూనిస్టు పార్టీలోని అవకాశవాద నిరంకుశులు నిజమైన విప్లవయోధులను ప్రక్కకు నెట్టివేసి అధికారాన్ని కైవశం చేసుకున్నారు.

స్టాలిన్ మరణం తర్వాత మూడేళ్లకు కమ్యూనిస్టు పార్టీ 20వ మహాసభలో ఈ అవకాశవాదులు బహిరంగ దాడికి దిగారు. ఈ దాడితో సోవియటు ప్రజలలో, ప్రపంచ ప్రజలలో స్టాలిన్‌కున్న అపరిమిత ప్రభావాన్ని తుడిచివేసేందుకు పూనుకున్నారు. స్టాలిన్ పరిరక్షించిన, అభివృద్ధి పరిచిన విప్లవసూత్రాలన్నింటినీ త్రోసిరాజన టానికి పూనుకున్నారు. సామ్రాజ్యవాదం, యుద్ధము–శాంతి, విప్లవం, అగ్రగామిగా పార్టీ మొదలగు అన్ని మార్క్సిస్టు–లెనినిస్టు సూత్రాలనూ తిరగదోడారు. ఆధునిక రివిజనిస్టులుగా రూపం దాల్చారు. "వ్యక్తిపూజపై పోరాటం" మాటున స్టాలిన్ శ్రమించిన ప్రతి సూత్రాన్ని తిరస్కరించిదీ రివిజనిస్టు ముఠా. కృశ్చేవ్, బ్రెజ్నవ్‌లు ప్రారంభించిన ఈ రివిజనిస్టు క్రమం గోర్బచెవ్, ఎల్టిసిన్ వంటి ద్రోహులను రంగం మీదకు తెచ్చింది.

సామ్రాజ్యవాద శక్తులూ, ట్రాట్స్కీవారసులూ సోవియటు యూనియన్‌ను కూల్చివేసిన గొర్బచెవ్ తదితర ద్రోహులను ఆకాశానికెత్తి పొగిడారు. ఈ ప్రబుద్ధులు "చరిత్ర ముగిసింద"ని ప్రకటించారు.

20వ శతాబ్దం ముగింపులో సోషలిజంపై పెట్టుబడిదారీ విధానం విజయం సాధించిందని చెప్పుకున్నారు. శ్రామిక ప్రజలపై దోపిడీ, అణచివేతలు పెంచారు. మోసపూరిత "నూతన ప్రపంచ వ్యవస్థ"కు ప్రత్యామ్నాయం లేదన్నారు. పెట్టుబడిదారీ సంస్కృతి విషంకక్కిన, రాక్షసుడిగా చిత్రించిన నాయకుడు స్టాలిన్.

కోట్లాది మంది మృతికి కారకుడని గుత్తపెట్టుబడి స్టాలిన్‌పై నిందా ప్రచారం సాగించింది. ఇది అబద్ధపు ప్రచారమనటానికి ఒకే ఉదాహరణచాలు. రెండవ ప్రపంచ యుద్ధంలో ప్రాణాలర్పించిన సోవియటు వీరులందరినీ స్టాలిన్ బాధిత మృతులలో తన "పెరిస్త్రోయికా" గ్రంథంలో గొర్బచేవ్ పేర్కొన్నాడు. మరో ఉదాహరణ : కమ్యూనిస్టు పార్టీ నుండి నెట్టివేయటంపై పెద్ద గ్రంథాన్ని రాసిన బ్రిటిషర్ జె.ఎ. జెట్టీ మాటలు: "రష్యా, పశ్చిమ దేశాల పరిశోధకుల ఇటీవలి పరిశీలనలో 1930 దశకంలో జరిగిన అరెస్టులు, శిక్షలు గురించి గతంలోని అంచనాలకంటే చాలా తక్కువగా వున్నాయని తేలింది".

అయితే స్టాలిన్‌కు కట్టబెట్టిన పొరపాట్లు, హింసలే స్టాలిన్‌పై ఇంతటి విషప్రచారానికి కారణం కాదన్నది స్పష్టం.

స్టాలిన్‌పై విషం కక్కడానికి కారణమేమిటి? సోవియటు యూనియన్ నాయకుడిగా స్టాలిన్ ఉన్నంత కాలమూ ప్రపంచంలోని దోపిడీదారుడెవ్వరికీ శాంతి లేదు. జోసఫ్ స్టాలిన్ నాయకత్వంలో సోవియటు యూనియన్ సకలరూపాల దోపిడీకీ, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా నిలిచింది. ప్రపంచంలోని సామాన్య ప్రజలందరికీ ఆశాజ్యోతిగా నిలిచింది. అవును...దానికి కొన్ని బలహీనతలున్నాయి. ఇంటా బయటా శతృవులున్నారు. కానీ అది ఉనికిలో వున్నంత కాలమూ దోపిడీదారులకు భయం కల్పించింది. పెట్టుబడిదారీ విధానం కంటే విభిన్నమైన, వున్నతమైన విలువలూ, ఆచరణలూ, మానవీయతగల సామాజిక విధానాన్ని ప్రతిష్టించింది.

సోవియటులోని కోట్లాది ప్రజలకు – అది, పెట్టుబడిదారీ విధానాన్ని సవాలు చేసిన నూతన నాగరికత. "ఉక్కుమనిషి" స్టాలిన్ దాని నాయకుడు. దీనంతటినీ మించి ఆయన నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుడు. ఈ కారణం రీత్యానే కోట్లాది శ్రమజీవులు ఆయననెల్లప్పటికీ ప్రేమిస్తారు; సామ్రాజ్యవాద శక్తులు ఆయనపై విషం కక్కుతూనే వుంటాయి. ✡

*జర్మనీ దురాక్రమణతో సోవియటు యూనియను విధ్వంస పూరిత నష్టాలకు గురైంది. సోవియటు రష్యాలో 70వేల గ్రామాలు, 1700 పట్టణాలు, 60 లక్షల యిళ్లు, 31వేల ఫ్యాక్టరీలు ధ్వంసమయ్యాయి. 86 లక్షల సోవియటు సైనికులు నిహతులయ్యారు. ఒక కోటి 70 లక్షల మంది పురుషులు, స్త్రీలు, పిల్లలు హత్యకావించబడ్డారు. "అన్నికాలాలలోనూ అత్యంత విధ్వంసక" యుద్ధమని బ్రిటీషు చరిత్రకారుడు ఏ.జి.పి. టైలర్ వర్ణించారు.*

# యూరోపు ఆర్థిక సంక్షోభం

# అనివార్య విఫలతను బయటపెట్టుకున్న పెట్టుబడిదారీ విధానం

**పెట్టుబడిదారీ** విధానం కూరుకు పోయిన తీవ్ర సంక్షోభం నుండి బయటపడేందుకు యూరపుదేశాల పాలకవర్గాలు తెగబడి కార్మికవర్గం పైనా, పీడిత ప్రజలపైనా కఠిన పొదుపు చర్యలు అమలు జరుపుతున్నారు.

"తనకున్న అవకాశానికి మించి" కార్మిక వర్గం యిన్నాళ్లూ బ్రతుకుతూ వస్తున్నదనీ, ఇప్పుడు దానికి మూల్యం చెల్లించాలనీ పెట్టుబడిదారీ విధాన సమర్థకులు వాదిస్తున్నారు. ఇన్నాళ్లూ బూర్జువావర్గపు దయతో, ధర్మబుద్ధితో మంచి ఆరోగ్యసేవ, విద్య, నిపుణులైన కార్మికులు సెలవుల్లో విదేశాలకు వెళ్ళగలిగినంత పెద్ద వేతనాలు కార్మిక వర్గంపై కురింపిచినందునే ప్రస్తుత సంక్షోభమేర్పడిందని వారంటున్నారు. శ్రమజీవుల విలాసవంత వ్యయం వల్లనే సంక్షోభమేర్పడిందిగనుక, ఆర్థిక వ్యవస్థను కోలుకొనేలా చేసేందుకు పొదుపు చర్యలు తప్పనిసరంటున్నారు.

దీనికి భిన్నంగా అమ్ముడుకానంత రీతిలో అధికోత్పత్తి జరిగినందునే ప్రస్తుత సంక్షోభం ఏర్పడింది. దీనినే మార్క్స్ "ఈ అధికోత్పత్తిలో సంక్షోభం ఉత్పత్తి దారుల దివాళాకూ, నిరుద్యోగానికీ, నిష్టదారిద్ర్యానికీ దారితీస్తుం'దన్నాడు.

ఈ వైరుధ్య, విచిత్ర ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు స్పెయిన్, గ్రీసులలోని పరిస్థితిని చూద్దాం.

### స్పెయిన్ గూడులేని శ్రమజీవులు

తాము ఉత్పత్తి చేసిన సరుకులు తమకెంత అవసరమైనప్పటికీ, వాటిని పొందలేనంతగా కార్మికులను పెట్టుబడిదారీ విధానం దారిద్ర్యంలోకి నెట్టివేస్తోంది. స్పెయిన్‌లోని నేటి స్థితి దీనికి తాజా ఉదాహరణ.

ప్రభుత్వ రుణం విపరీతంగా పెరిగి దానిని తీర్చేందుకు ప్రభుత్వం కఠిన పొదుపు చర్యలు అమలు చేయటంతో స్పెయిన్ కృంగి పోతున్నది. ప్రభుత్వ వ్యయంలో కోత, వేలాది ప్రభుత్వ ఉద్యోగాల రద్దు, కార్మికుల, ఉద్యోగుల వేతనాలలో భారీకోతలు-ఈ పొదుపు చర్యలతో అప్పుతీర్చేందుకు పూనుకుంది.

అధికోత్పత్తి ప్రధానంగా నివాస గృహాల నిర్మాణంలో సాగింది. సంక్షోభం తాకేవరకూ, స్పెయిన్‌లో ఇళ్ళ అమ్మకాల మార్కెట్టులో కొనుగోలు దాహం చల్లారబోదనిపించింది. వ్యాపారులు ఎగబడి ఇళ్లనిర్మాణం సాగించారు. 20 ఏళ్లు సాగిన కార్యకలాపాలు ఆగబోవని అన్నారు. ఇళ్లధరలు పెరిగిపోయాయి. రియలు ఎస్టేటు రంగం అంతులేని లాభాలు మూటగట్టుకుంది. వడ్డీలతో లాభాలు చేసుకునేందుకు బ్యాంకులు గృహ నిర్మాణానికీ కొనుగోలుదార్లకూ రుణాలిచ్చేందుకు పరుగులు పెట్టాయి.

ఆర్థిక సంక్షోభం రావటంతో ఇళ్లకు డిమాండు పడిపోయింది. ఇళ్లు అమ్ముడు కాక అప్పులు పారుబాకీలై బ్యాంకులు కళ్ళు తేలవేశాయి. ప్రభుత్వం పూనుకుని బ్యాంకులను రక్షించింది. విపరీత మొత్తాలను ప్రభుత్వ ఖజానా నుండి వారికి ధారపోసింది. ఈ లోటంతా ఇప్పుడు పన్ను చెల్లింపుదారులు, అంటే కార్మికులు, ఉద్యోగులు చేయాలి. దీనితో వారు అధిక పన్నులు చెల్లించవలసిరావటంతోపాటు, ఉద్యోగం వుండాలంటే తక్కువ వేతనానికి అంగీకరించాలి; లేదంటే ఉద్యోగం పోగొట్టుకోవాలి,

నిరుద్యోగం 25 శాతానికి చేరింది. 26 ఏళ్ల లోపున్న యువతలో అది 50 శాతానికి చేరిందని ప్రభుత్వమే అంగీకరించింది. దీనితో లక్షలాది శ్రమజీవులు ఇళ్లకు చేసిన అప్పులకు కిస్తీలు కట్టలేని స్థితి ఏర్పడింది. దీనితో రోజూ వందలకొద్దీ అప్పు చిట్టాలను ఆవర్జావేసి, ఇళ్లు స్వాధీనం చేసుకుని, నివాసులను రోడ్డు మీదకు గెంటి వేస్తున్నారు.

ఇదీ విచిత్రం - స్పెయిన్ కార్మికులు "ఎక్కువ" ఇళ్లు నిర్మించారు. అందువల్ల వారికి ఇళ్లు లేకుండా పోతున్నాయి. ఇదీ పెట్టుబడిదారీ విధానమంటే! 20 లక్షల యిళ్లు అమ్ముడు కాకుండా వుండిపోయాయి. లక్షలాది కార్మిక కుటుంబాలు ఇళ్లు లేక రోడ్ల మీదకు చేరారు.

స్పెయిన్‌లో ఇళ్లులేనివారికి ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందదు. ఫలితంగా మరోరూపపు "ఆక్రమణ" ఉద్యమం ముందుకొచ్చింది. కుటుంబాలు ఖాళీగా వున్న ఇళ్లలో చేరుతున్నాయి. చాలాసార్లు తమను గెంటివేసిన ఇళ్లలోకే, ఈ ఇళ్లకు నీరు, విద్యుత్తు సరఫరా వుండదు. కుటుంబాలు చిన్న జనరేటర్లతో గడుపుకొస్తున్నాయి.

మునలీ ముతకా, పసిబాలలను బలవంతంగా ఖాళీచేయించే పనితో విసిగిపోయి, ఆ పని చేయనిచ్చగించని పోలీసులు - ఆగ్రహంతో మండిపడుతున్న ప్రజలు-దీనితో ఖాళీ చేయించే పనికి పోలీసులు అందుబాటులో వుండరని ప్రభుత్వం ప్రకటించాల్సివచ్చింది.

అయితే ఇది స్పెయిన్ కార్మికులకు ఊరటకల్గించే చర్యకాదు. "స్పెయిన్‌లో చేసిన రుణానికి రుణగ్రహీతలు వ్యక్తిగతంగా పూర్తి బాధ్యత వహించాలి. కిస్తీ కట్టక పోతే అపరాధరుసుము, వడ్డీపై వడ్డీ మోపెడవుతాయి. పోనీ కోర్టు కెళ్లి ఐపి పెట్టినా (దివాళా తీసానన్నా) చేసిన అప్పును మినహాయించరు." (సుజానా డాలే, న్యూయార్క్ టైమ్స్, 12-11-2012)

ఈ నిరంకుశ చట్టాలు ఒకవేళ రేపేనాడైనా ఉద్యోగం వచ్చినా లక్షలాది నిరుద్యోగ కార్మికుల మూపున తీర్చలేని రుణభారాన్ని మోపుతుంది. పోరాడటం తప్ప, స్పెయిన్ కార్మికులకు మరో దారిలేదు.

### గ్రీసు పెనం నుండి పొయ్యిలోకి...

గ్రీసులో అమలవుతున్న పొదుపు చర్యల తీవ్రత తెలిసినదే. అవి కఠినంగా వుండటమన్నదేకాదు; అవి పరిస్థితి మెరుగుపరిచే బదులుగా దేశ ఆర్థికాన్ని మరింత దిగజార్చి వేస్తున్నాయి.

"అసలీ సమస్యలకు దారితీసిన కారణాలేవైనప్పటికీ, యూరపు రుణ సంక్షోభాన్ని తీర్చేందుకు తీసుకుంటున్న చర్యలు ఇంకాఎక్కువ చేటు కలిగిస్తున్న స్థితికి చేరాము" ఇది గ్రీసులోను, ఇప్పుడు స్పెయినులోను వ్యక్తమౌతున్న వ్యధ (సుజానా డాలే).

రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన వెన్వెంటనే, ప్రజల అశాంతిని అదుపులో పెట్టేందుకు గ్రీసు బూర్జువావర్గం కొంతకాలం ఫాసిస్టు సైనికపాలన విధించిన నాటి కాలానికి గ్రీసు నెట్టివేయబడుతున్నది. మళ్లీ ఆనాటిలాగే ప్రజలు తిరగబడుతుండటంతో గ్రీసు బూర్జువావర్గం అడకత్తెర విధానాన్ని అమలు చేస్తున్నది.

ఒకవైపున గ్రీసు ప్రజలను మోసగించటానికీ, వారికి ప్రజాస్వామిక ప్రత్యామ్నాయంగా ఒక సోషలు డెమోక్రాటిక్ పార్టీగా సైరిజా పెరగటాన్ని ప్రోత్సహిస్తున్నది. రెండవ వైపున, ఒకవేళ ఈ ఎత్తుగడ విఫలమైతే, అతికొద్దికాలం క్రితం వరకూ ఎలాంటి ప్రాధాన్యతాలేని ఫాసిస్టు పార్టీ అయిన గోల్డెన్ డాన్‌కు పత్రికల్లో కావల్సినంత ప్రచారం కల్పిస్తున్నారు.

గోల్డెన్‌డాన్ పార్టీ అప్రదిష్టకర కార్యక్రమాన్నీ, దాని టెర్రరిస్టు కార్యకలాపాలకు ప్రచారమిచ్చే అవకాశాన్ని దేనినీ పత్రికలు వదలి పెట్టడంలేదు. ప్రజలలో పెల్లుబుకుతున్న ఆగ్రహజ్వాలలు గ్రీసు బూర్జువాలు, అంతర్జాతీయ బూర్జువాలను తాకకుండా, నిస్సహాయ, అమాయక, పైసాలేని ప్రవాస కార్మికుల పైకి మళ్లించే జాతి విద్వేష పూరిత కార్యకలాపాలను రగిల్చే గోల్డెన్ డాన్ "కృషి"ని కూడా ముందుకు తెస్తున్నాయి.

ఇక ఈ సందడిలో "డబ్బు పొదుపుకు" గ్రీస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలెంత "మానవీయంగా" వున్నాయి? నిరుద్యోగులకూ, పేదలకూ వైద్యసేవ తొలగించారు. గత జూలై నాటికి ఒక ఏడాది పాటు నిరుద్యోగులుగా వున్న కార్మికులందరికీ నిరుద్యోగ భృతి, వైద్యం పొందే అర్హత లేకుండా చేశారు. గ్రీసులో వైద్యుల రహస్య ఉద్యమం మొదలైంది. వైద్య బీమా లేని వారందరికీ ఈ వైద్యులు వైద్యం చేస్తున్నారు. ఆస్పత్రులలోని మందులు ఎత్తుకొచ్చి పేదలకిస్తున్నారు. ఒకవేళ పట్టుబడితే వాటి ఖరీదు డాక్టర్లే చెల్లించాలి. ఇలాంటి ఒక రహస్య వైద్య ఉద్యమాన్ని నడుపుతున్న గుండె వ్యాధుల నిపుణుడు డా॥ విఫాస్ "మేము నేటి రాబిన్‌హుడ్‌లము'' అన్నాడు (న్యూయార్క్ టైమ్స్, 25-10-2012)

గ్రీసులో ఒకనాటి తుడిచివేయబడిన మలేరియా వ్యాధి ఈనాడు తిరిగి వ్యాపిస్తున్నది. విదేశాలకు వెళ్లివచ్చేవారి నుండీ, వలసవస్తున్న కార్మికులనుండీ ఇది దేశంలోకి తిరిగి వచ్చింది. పత్రికలు మాత్రం వలస కార్మికుల మీదే నిందమోపుతాయి. అసలు సమస్య దేశంలోకి వచ్చినా (నేడు అలా ఆపటం సాధ్యంకాదు) ఎలా వ్యాప్తిచెందుతున్నాయి? పొదుపు చర్యలపేరిట పారిశుద్ధ్య కార్యక్రమాలన్నింటినీ చాపచుట్టేసి నివాస ప్రాంతాలను మురికికూపాలు చెయ్యటమే కారణం.

ఇన్ని పొదుపు చర్యలు చేపట్టినా గ్రీసు ఆర్థిక పరిస్థితి దిగజారిపోతూనేవుంది. ''ఆర్థిక ఉత్పత్తిలో రుణం అత్యధికంగా 167 శాతానికి చేరుతుందని గత సహాయ కార్యక్రమంలో అంచనావేయగా అదిప్పుడు 189 శాతానికి చేరింది. 2014లో 193 శాతానికి చేరుతుంది" అని గ్రీకు పార్లమెంటు తేల్చింది.

"ఐఎంఎఫ్ తయారుచేసిన మరో అంచనా, అదెంతో ఆశాభావంతో వేసిన అంచనా అయినా, గ్రీసు రుణం 171 శాతానికి చేరుతుంది'' (న్యూయార్క్ టైమ్స్, 1-11-2012)

అప్పుతీర్చేందుకు ద్రవ్య వనరుల సేకరణకు పొదుపు చర్యలపేరిట గ్రీసు ప్రజల ఆదాయాన్ని పిండుకుంటున్నా, రుణమెందుకు పెరిగి పోతూనేవుంది? ఉల్ఫ్‌గాంగ్ మాంఛౌ ఇలా వివరించాడు:

"అధికారిక అంచనాలకు భిన్నంగా గ్రీసుస్థూల జాతీయ ఉత్పత్తి ఎందుకు తగ్గిపోతున్నది? ప్రపంచ ఆర్థిక పరిస్థితి క్షీణత అంటే చాలదు. ప్రతి ఏడాదీ 5 శాతం చొప్పున గ్రీసు ఆర్థికం కుదించుకుపోవటానికి బడ్జెట్టులోటు పూరించటమే పనిగా పెట్టుకోవటమే ప్రధాన కారణం. ఈ లోటు పూరింపు అనుకున్న లక్ష్యానికి చేరకపోతే మరిన్ని పొదుపు చర్యలు తీసుకోవటం. దీనితో ఆర్థిక కార్యకలాపాలు తగ్గి జిడిపి తగ్గిపోతుంది. దీనితో మళ్లీ లోటు పెరుగుతుంది. మరో మాటల్లో చెప్పాలంటే ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, యూరోపియన్ సమితిల త్రయం గ్రీసు ఆర్థికాన్ని మరింత దిగజార్చే విధానపర చర్యలను అమలుజరిపిస్తున్నాయి; ఇది రుణస్థితిని మరింత దిగజారుస్తుంది; మళ్లీ ఈ దిగజార్చిన విధానమే చేపట్టాలి" (ఫైనాన్షియల్ టైమ్స్ 8-10-2012)

### రుణ బకాసురుల కీచులాట

తాను చేసిన అప్పునంతా గ్రీసు తిరిగి తీర్చలేదన్న విషయమూ, కొంత డబ్బు నష్టపోకతప్పదనీ అప్పిచ్చిన వారూ గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడింది. తిరిగి వచ్చే డబ్బులో వీలైనంత ఎక్కువ కాజేయాలన్న ఆతృతతో రుణదాతలు సిగపట్లకు దిగారు.

దీనితో గ్రీసు ఆర్థికాన్ని పర్యవేక్షిస్తున్న (అంటే అప్పులిచ్చిన) త్రయం నవంబరు సమావేశంలో సభ్యుల మధ్య చర్చలు వాడివేడి అందుకున్నాయి. యూరోపు కేంద్రబ్యాంకు, యూరోపు సమితి ఒక ప్రక్కనా, ఐఎంఎఫ్ మరో వైపునా చేరటంతో సమావేశం మెరుపులూ ఉరుములతో సాగింది. సమావేశం నుండి లేచిపోతామని యూరపుబృందం బెదిరిస్తే, గ్రీసుకు ఇకపైన పైసా విదల్చబోనని ఐఎంఎఫ్ అలిగింది. ముక్కుతూ, మూలుగుతూ, చీదుతూ, ఛీత్కరించుకుంటూ చివరి క్షణంలో సర్దుబాటు చేసుకున్నారు.

ఇంతకీ కీచులాట ఏమిటి? అప్పుతీర్చేందుకు గ్రీసుకు మరికొంతసమయమివ్వాలాని యూరపు బృందం, ప్రత్యేకించి జర్మనీ, పట్టుపట్టాయి. అప్పుడు గ్రీసు చెల్లిస్తే తనకు పారుబాకీలుండవని దాని లెక్క. యూరపు డబ్బు సంచులున్నా, ప్రధానంగా అమెరికా పెట్టుబడులే వున్న ఐఎంఎఫ్ పొదుపు కార్యక్రమానికి గ్రీసు ఖచ్చితంగా కట్టుబడి వుండాలని మొండికేసింది. అందువల్ల యూరపు బృందానికి "క్షవరమైనా'' ఒప్పుకోవాల్సిందేనని పట్టుపట్టింది. ఎవరేమైపోయినా తన అప్పు రాబట్టు కోవటమే దాని లక్ష్యం.

అయితే చివరికెలా రాజీపడ్డారు? నానాటికీ జీవన ప్రమాణాలు తరిగిపోతున్నందున కార్మికవర్గమూ, మధ్యతరగతి ప్రజల్లో పెరుగుతున్న అశాంతిపట్ల భయం వారికి రాజీ కుదిర్చింది. "యూరోపు సంస్కరణల కేంద్రం ఇటీవల నిర్వహించిన ఒక సదస్సులో ఈ సమిష్టి పొదుపు చర్యలు స్వీయ వైఫల్యానికి దారితీస్తాయనీ, కొంత వెనుక ముందులుగా రుణగ్రస్త దేశాలలో తలయెత్తే రాజకీయ ప్రతిఘటనతో ఘర్షణ పడాల్సివస్తుందనీ అనేకమంది బలంగా వాదించటాన్ని నేను విన్నాను'' అని ఒక సభ్యుడు సమావేశాన్ని హెచ్చరించారు. (ఫైనాన్షియల్ టైమ్స్ 16-11-2012)

ఈ అశాంతే వారికి భీతిని కల్గిస్తున్నది. స్పెయిన్, పోర్చుగల్, గ్రీసు, ఇటలీలలోనూ, దానికి మద్దతుగా ఇతర యూరపు దేశాలలోనూ నవంబరు 14న జరిగిన ఒకరోజు సార్వత్రిక సమ్మె యూరపు బూర్జువా వర్గానికి కోల్పోయిన ఉత్పత్తి రూపంలోనూ, ఆస్థులకు జరిగిన నష్టం రూపంలోనూ చాలా ఖరీదైనదే. వీటిని మించి ఆగ్రహిస్తున్న ప్రజలను అదుపుచెయ్యటం వారికి పెద్ద సమస్య అయింది.

సార్వత్రిక సమ్మె గురించి రాయిటర్ వార్తసంస్థ కథనం చూడండి: "లిస్బన్‌లో (పోర్చుగల్ రాజధాని) సంక్షోభం మొదలైన తర్వాత ఏనాడూ కనిపించనంత స్థాయి హింసతో ప్రదర్శనలు ముగిసాయి. పోలీసుల లాఠీఛార్జీ, ప్రదర్శకులు రాళ్లు విసరటం మొత్తం 50 మంది గాయపడ్డారు".

"మాడ్రిడ్‌లో(స్పెయిన్ రాజధాని) ప్రదర్శకులు చెత్తకుండీలకు నిప్పంటించారు. రాజవీధి పొగతో నిండిపోయింది. బార్సిలోనాలో పోలీసు కార్లు తగులబెట్టారు... రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. 140 మందిని అరెస్టు చేశారు. వారిలో ఇద్దరివద్ద బాంబులు తయారుచేసే సరంజామా వుందని పోలీసులు చెప్పారు. 70 మంది గాయపడ్డారు".

"రోములో పోలీసులకూ, ప్రదర్శకులకూ మధ్య తోపులాటలు జరిగాయి. రాళ్లు, సీసాలూ, టపాసులూ విసిరారు. 60మంది అరెస్టయ్యారు. పీసా గోపురాన్ని గంటపాటు ఆక్రమించారు. "మీ సంక్షోభానికి మేము మూల్యం చెల్లించము! తిరగబడండి" అన్న బ్యానరును దానికి కట్టారు".

రోజు రోజుకూ తీవ్రమౌతున్న సంక్షోభానికి ధన్యవాదాలు. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సోషలిజమేననీ, కాకలు తీరిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కార్మికవర్గం మాత్రమే పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోయగలదనీ, కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించగలదనీ గుర్తించే ప్రజలు పెరుగుతున్నారు.

**(గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్టు-లెనినిస్టు) పత్రిక "ప్రోలిటేరియన్" సంచిక 51లోని వ్యాసం ఆధారంగా)**

# కా॥ కట్టా గోవిందు సంస్మరణ సభ


సంస్మరణసభలో ప్రసంగిస్తున్న కా॥ భార్గవశ్రీ

**బందరు, 9-12-12:**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥కట్టా గోవిందు సంస్మరణ సభ బందరు మండలం పెదకరగ్రహారం బాబానగర్‌లో కా॥ఫరీద్ అధ్యక్షతన జరిగింది.

సిపిఐ(ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ముప్పాళ్ళ భార్గవశ్రీ ఈ సభలో మాట్లాడుతూ బందరు ప్రాంత రైతుకూలీ ఉద్యమంతో కా॥గోవిందు అనుబంధాన్ని గుర్తుచేశారు. బంజరు భూములను పేదలకు పంచాలని సాగించిన ఆందోళన సందర్భంగా జైలు నిర్బంధానికి గురయ్యాడన్నారు. గ్రామంలో మహిళలను వేధించిన రౌడీలకు బుద్ధిచెప్పినందుకు కా॥గోవిందు రెండు పోలీసు కేసులను ఎదుర్కొన్నాడన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥యద్దనపూడి సోని మాట్లాడుతూ తీరప్రాంత ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై 1997లో నిర్వహించిన రాష్ట్రసదస్సు సందర్భంగా కా॥గోవిందు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. బందరు ప్రాంతంలో దాదాపు 10 సం॥ల కాలం కా॥గోవిందు చురుకైన కార్యకర్తగా కృషిచేశాడని పేర్కొంటూ నివాళులర్పించారు. ఇంకా ఈ సంస్మరణ సభలో కామ్రేడ్స్ అంజమ్మ, జగన్, సుధాకర్, ఉమామహేశ్వరరావు, కె.ఏసు తదితరులు పాల్గొని కా॥గోవిందుకు నివాళులర్పించారు.




# కసబ్‌కు ఉరిశిక్ష టెర్రరిజంపై పోరు పేరిట సాగుతున్న తతంగం

**2008** నవంబరు 20న ముంబాయిపై జరిగిన టెర్రరిస్టు దాడుల్లో 166 మంది అమాయక ప్రజలు బలికావటం దారుణమైనది; అమానవీయమైనది. అంతర్జాతీయ టెర్రరిస్టు మూకల ఈ చర్యలు గర్హనీయమైనవి. ఇలాంటి చర్యలను అదుపుచేయటం, నివారించటం ప్రభుత్వాల బాధ్యత. దోషులను పట్టుకుని విచారించి, నిందితుడని రుజువైతే తగిన శిక్షవేయటమూ జరగాలి. కానీ అసలు నేరస్తులను విడిచిపెట్టి నేరంలో పాత్రలేని వారికి శిక్షవిధించటం భారత శిక్షాస్మృతి అంగీకరించదు. ఈ కేసులో ముద్దాయని చెప్పి అజ్మల్ కసబ్‌ను రహస్యంగా ఉరితీశారు. టెర్రరిస్టు దాడిలో పాల్గొన్న ఆరుగురిలో సజీవుడిగా దొరికిందితనే అని చెప్పారు.

రహస్యంగా ఎందుకు ఉరితీయాల్సి వచ్చిందో ఒక్క కారణాన్ని కూడా ప్రభుత్వం చెప్పలేదు. ఒక "నేరస్థుడి"కి శిక్షనమలు చేసేందుకు సర్వసత్తాక, ప్రజాస్వామిక పాలనలో రహస్యమెందుకు పాటించాల్సి వచ్చిందని ఒక్కరూ అడగలేదు. ఉరి తీసినందుకు అన్నివైపులనుండీ ప్రశంసల వర్షం కురిసింది. కసబ్ - కొంతమంది శత్రుదేశంగా చిత్రిస్తున్న పాకిస్తానుకు చెందినవాడు కావటమే; ముస్లిం, జీహాదీకావటమే కారణంగా వుంది. ఇంకా ఉరితీయబడాల్సిన వారిని కూడా వెంటనే ఉరితీయాలంటూ చర్చలు సాగించారు.

"166 ప్రాణాలను బలిగొన్న ఘటనలో న్యాయంవైపుగా ముందడుగే" ఉరిశిక్ష అమలు అంటూ అమెరికా సామ్రాజ్యవాదం భారత ప్రభుత్వానికి కితాబునిచ్చింది.

ముంబయిపై దాడిలో న్యాయం వైపుగా ఇది అడుగో కాదో చెప్పలేము గానీ ఒక ముస్లిం యువకుడు అన్నట్లుగా మతోన్మాదశక్తులు భారత ముస్లిములపై సాగిస్తున్న నిందా ప్రచారపు శిలువ భారాన్నుండి ఇకనైనా ముస్లింలు తప్పుకునేందుకైనా ఇది తోడ్పడితే బావుండునన్నది సాధ్యమౌతుందా?

టెర్రరిస్టని తాము భావిస్తే ఏవిధంగానైనా చంపే అధికారం తమకుందని బిన్ లాడెన్ విషయంలో అమెరికా చూపిన దారిలోనే భారత పాలకులు నడిచారు.

ఈ టెర్రరిజం విషయంలో సాగుతున్న న్యాయానికి మరో పార్శ్వం వుంది. టెర్రరిజానికి, ప్రత్యేకించి ముస్లిం టెర్రరిజానికి వ్యతిరేకంగా అమెరికా సామ్రాజ్యవాదం సాగిస్తున్న ప్రచారహోరు, పాకిస్తాన్‌ను మన శత్రుదేశంగా చిత్రిస్తూ భారత ప్రభుత్వమూ పాలకవర్గాలూ విడవకుండా సాగిస్తున్న ప్రచారమూ, విదేశీయులుగా, దేశ వ్యతిరేకులుగా ముస్లింలపై హిందుత్వ శక్తులు సాగిస్తున్న ప్రచారమూ, కొన్ని ప్రగతిశీలశక్తులూ, "వామపక్ష" శక్తులూ కూడా జాతీయోన్మాదంలో కొట్టుకుపోవటమూ, తామే నిజమైన ప్రజాభిప్రాయ రూపకర్తలుగా చూపుకుంటూ మధ్యతరగతి మేధావులూ, ఉన్నతశ్రేణివారు ముందుకు తెస్తున్న "పౌరసమాజాన్ని" ఆకాశానికెత్తుతున్న ప్రచారమూ- ఇవన్నీ కలిసి "టెర్రరిస్టుదాడుల" గురించీ, దానికి అసలు కారకులెవరన్నది నిష్పక్షపాతంగా, ఉద్వేగ రహితంగా ఒక్కక్షణం కూడా ఆలోచించుకునే అవకాశం ప్రజలకివ్వకుండా ఊదరపెడుతున్నాయి. అధికారులిస్తున్న సమాచారమూ, దానికి సంచలనాన్ని అద్దుతున్న వార్తాసంస్థల సమాచారంపైనే వారు పూర్తిగా ఆధారపడి నిర్ధారణకు వచ్చేట్లు చేస్తున్నారు. పాలకవర్గాల, పాలకుల అదుపాజ్ఞలలోవున్న పరిశోధనా అధికారులు సమర్పించిన సాక్ష్యాలమీదే ఆధారపడి తీర్పులివ్వాల్సిన పరిస్థితిలో న్యాయవ్యవస్థ వుంది. ఇది కొన్నిసార్లు తప్పుగా శిక్ష విధింపులకు దారితీయవచ్చు.

ఫర్హాన్ అన్సారీ, సలాదీన్ అహ్మద్ అన్న ఇద్దరు భారతీయ ముస్లిములు కసబ్‌తో కలిసి కుట్ర చేశారని పోలీసులు ఆరోపించగా, వారిద్దరిని నిర్దోషులుగా పేర్కొంటూ సుప్రీంకోర్టు విడుదల చేసింది. పరిశోధనాధికారులు కేసు బనాయించారన్న అనుమానమెక్కడ కలుగుతుందోనని ఈ వాస్తవాన్నెవరూ పేర్కొనటంలేదు.

మరొక వాస్తవం-కసబ్‌ను ఉరితీసిన మరునాడే, ఢిల్లీ హైకోర్టు ఒక తీర్పును వెలువరించింది. లజపత్‌నగర్ బాంబు ప్రేలుడు కేసులో క్రింది కోర్టు మరణశిక్ష విధించగా, వాటిని రద్దుచేసింది. వారిలో ఇద్దరిని నిర్దోషులని విడుదల చేసింది. ఢిల్లీ పోలీసుల నేరపరిశోధన అస్తవ్యస్తంగా వుందని వ్యాఖ్యానించింది. ఢిల్లీ-గుర్‌గావ్‌ల దారిలో 2005 జూలై 1-2 తేదీల మధ్య రాత్రి జరిగిన ఎన్‌కౌంటరులో కాల్పుల తర్వాత నేరస్తులను పట్టుకున్నామని ఢిల్లీ పోలీసులు చెప్పారు.

"ఆ రాత్రి ఎన్‌కౌంటరు జరిగిందనటం పూర్తిగా అబద్ధం-కల్పితం" అని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇదీ మన పోలీసు వ్యవస్థ. నేరం జరిగిన వెంటనే ఎవరో ఒకరిని పట్టుకుని, తర్వాత సాక్ష్యాలు కల్పించి కేసు పరిష్కరించామనేట్లుగా వారిపై ఒత్తిడి వుంటున్నది. పాలకుల ఒత్తిడితో పోలీసులు నేరస్తుడెవరో పత్రికలకు చెబుతారు కానీ పట్టుకోరు. పట్టుకున్నా తగిన సాక్ష్యాధారాలు "దొరకవు". టెర్రరిస్టు కేసులలో తరచుగా అమాయక ముస్లిం యువకులను అరెస్టు చేస్తున్నారు, హింసిస్తున్నారు; జైలుకు పంపుతున్నారు. కోర్టుల జోక్యంతోనే వారు విడుదల అవుతున్నారు.

ఈ సందర్భంగా "కర్కరేను చంపిందెవరు?" అన్న తన పుస్తకంలో మహారాష్ట్రలో ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేసిన ఐపిఎస్ అధికారి ఎస్.ఎం.ముష్రిఫ్ చెప్పిన అంశాలను పరిశీలించాలి. 2008లో విటిస్టేషన్‌పై జరిగిన దాడిలో కసబ్ అసలు పాల్గొనలేదని ఆయన వాదించారు. పోలీసు, పరిశోధనాసంస్థల పనితీరు పూర్తిగా తెలిసిన అనుభవం కలిగిన ఆయన-లభ్యమైన సమాచారం, పరిశోధన, పోలీసు, ప్రభుత్వ అధికారులు పత్రికలకు యిచ్చిన సమాచారం ఆధారంగా ఆయన వాదించారు.

ఆయనిలా వాదించారు: విటిస్టేషన్‌లో వున్న 16 టివి కెమెరాల్లో 26/11 రాత్రి ఒక్కటి కూడా పనిచేయలేదు. స్టేషనులోకి వచ్చే పోయే వారిని చూడటానికి లోపలికి, వెలుపలికి గేట్లవద్ద పెట్టిన రెండు కెమెరాలూ వెనక్కు తిప్పివున్నాయి. టెర్రరిస్టుకాల్పులు చేస్తున్నప్పుడు రెండు సెల్‌ఫోనులు వారినుండి జారిక్రింద పడ్డాయి. అవెవరివని సిమ్‌కార్డులు చూడగా, ఒకటి సతారాజిల్లాకు చెందిన అశోక్‌గోరే పేరిట వుంది. రెండవది ఒక మహిళ పేరిట వుంది. ఈ వాస్తవాన్ని రికార్డులలో చేర్చకపోవటం ఆశ్చర్యకరం. విటిస్టేషన్‌నుండి కామా ఆస్పత్రికి వెళ్లిన టెర్రరిస్టులు మరాఠీభాషను ధారాళంగా మాట్లాడుతున్నారని ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. విటిస్టేషన్‌లో మృతిచెందిన వారిలో ఆరుగురు పోలీసులు కాగా మిగిలినవారు పౌరులు. పౌరులలో 22మంది ముస్లిములు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం విటిస్టేషనులో కాల్పులు జరిపిన టెర్రరిస్టుల ముఖాలు పూర్తిగా నల్లగుడ్డతో కప్పుకుని వున్నాయి. ఆ సమయం చాలా సందడిగా వుంది. ఈ కారణాలరీత్యా తినుబండారాలమ్మే షాపు యజమాని ప్రత్యక్ష సాక్షిగా టెర్రరిస్టుల ముఖాలు చూడలేకపోయాడు; వారి మాటలు వినలేకపోయాడు. 2006లో నేపాలు పోలీసుల సాయంతో భారత పోలీసులు కసబ్‌ను అరెస్టుచేసి భారత్‌కు తీసుకువెళ్లారని నేపాలు సుప్రీంకోర్టులో రిట్‌పిటీషన్ వేశారని సి.ఎం.ఫరూక్ అన్న లాయర్ ప్రకటించాడు. దీనిలో ప్రతికక్షిదారుగా నేపాలులో భారత రాయబారిని పేర్కొన్నట్లు చెప్పాడు. ఇంతేకాక పాకిస్తాన్‌నుండి ముంబాయికి చిన్నపడవలో వచ్చి బంద్వార్ పార్క్‌లో ఆరుగురు టెర్రరిస్టులు దిగుతున్నప్పుడు వున్న ఏకైక ప్రత్యక్షసాక్షి అనితా రాజేంద్ర తర్వాత కాల్పులలో చనిపోయిన ఆరుగురు టెర్రరిస్టులను స్పష్టంగా గుర్తించింది. అమెరికా గూఢచారిసంస్థ ఎఫ్‌బిఐ ఈమెను ప్రశ్నించడానికి అమెరికా తీసుకెళ్లింది. ఆ ఆరుగురిలో ఒకడిగా అజ్మల్ కసబ్‌ను గుర్తించడానికి ఆమె నిరాకరించింది. దీనికి ఆమె మీద ఐపిసి సెక్షను 182 క్రింద అధికారులను తప్పుదారిపట్టించే నేరం మోపారు.

ఆశ్చర్యకరంగా 26/11 రాత్రి అసలు పనిచెయ్యని 18 కెమెరాలనుండి పరిశోధనాధికారులు కొంత టేపును సేకరించగలిగారు. వీటిలో ముఖంపై ఎలాంటి నల్లముసుగు లేకుండా అజ్మల్ కసబ్ బింబాలు కనిపించాయి. దానితో అజ్మల్ కసబ్‌ను జీహాదీ టెర్రరిస్టని తేల్చారు. ఈ పరిశోధనలో వున్న అధికారులు సాక్ష్యాలను కల్పించటంలో నేర్పరులన్న గత ఘటనలున్నాయనీ, నేపాలులో అరెస్టుచేసి భారత్‌కు తీసుకురావటం చేసేవారనీ చెబుతూ ఎస్.ఎం.ముష్రిఫ్ 26/11 దాడిలో కసబ్ పాల్గొనే అవకాశమేలేదని వాదించాడు.

అయితే తప్పుడు సాక్ష్యాలతో కోర్టులను తప్పుదారి పట్టించారు. కల్పించిన సాక్ష్యాలతో కసబ్‌కు శిక్షపడేవిధంగా చేశారు. కసబ్ ఉరిపై వ్యాఖ్యానించిన వారందరూ ఈ సాక్ష్యంపైనే ఆధారపడ్డారు. కసబ్‌ను జీహాదీ టెర్రరిస్టని నమ్మారు. సత్యాసత్యాలన్నీ ఇక్కడే దాగివున్నాయి.

కసబ్‌ను ఉరితీయటానికి ఇంతశ్రమపడ్డ భారత పాలకులు అమెరికా పౌరుడు హెడ్లీ విషయంలో మాత్రం చేతులు కట్టుకున్నారు. అమెరికా గూఢచారి సంస్థ సిఐఏతో సంబంధాలున్న వ్యక్తి హెడ్లీ. ముంబాయి వచ్చి అనుపానులన్నీ చూసి వెళ్లి(రెక్కి) ముంబయి దాడులకు పథకాన్ని రచించి, టెర్రరిస్టులకు శిక్షణనిచ్చి, అమలుజరిపింది తానేనని అంగీకరించాడు. అమెరికా పోలీసుల ఆధీనంలో వున్నాడు. దీనికి సంబంధించి తమవద్దనున్న సమాచారాన్ని భారత్‌కు అందించమనీ, హెడ్లీని భారత్‌కు అప్పగించమనీ భారతపాలకులు అమెరికాను అడగలేదు. కాగా హెడ్లీని అప్పగించే ప్రసక్తేలేదని టెర్రరిజంపై పోరు గురించి మాట్లాడే అమెరికా స్పష్టంగా ప్రకటించింది. టెర్రరిస్టులను శిక్షించటంలో దాని న్యాయమిది. కాగా ముంబయి దాడులకు పాకిస్తాన్‌ను మాత్రమే నిందించమనీ, దీనిపై పాకిస్తాన్‌తో తగవుపడమనీ భారత్‌ను రెచ్చగొడుతున్నది.

అసలు ప్రపంచంలోనే అతిపెద్ద టెర్రరిస్టు అమెరికా. పైలెట్టులేని విమాన దాడులతో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో వందలాదిమందిని హత్యచేస్తున్నది. దీనికి శిక్ష విధించాల్సింది అమెరికాకు. దురదృష్టవశాత్తూ నేరస్థుడైన అమెరికానే టెర్రరిజంపై యుద్ధాలు సాగిస్తున్నది. వేలాదిమంది ప్రజలను చంపుతున్నది. తనతో చేయికలిపి ముస్లిం టెర్రరిస్టులపై పోరాడమని పిలుపునిస్తున్నది.

ఇక టెర్రరిజంపై పోరులో భారత పాలకుల వైఖరికూడా నిజాయితీగా లేదు. హత్య జరిగిన 23 ఏళ్ల తర్వాత కూడా రాజీవ్‌గాంధీని హత్యచేసిన వారిని ఉరితీయలేదు. 1995లో ముఖ్యమంత్రి బియాంత్‌సింగ్‌ను హత్యచేసిన రాజ్వంత్‌సింగ్‌ను 27 ఏళ్ల తర్వాత కూడా ఉరితీయలేదు. దగ్గరుండి బాబ్రీమసీదును కూలగొట్టమని ప్రోత్సహించారని వాజపాయి, అద్వానీ, కళ్యాణ్‌సింగ్‌లపై లీబర్‌హన్ కమీషన్ చెప్పినా వారిని స్వేచ్ఛగా తిరగనిస్తున్నారు. వారు తమ మతోన్మాద చర్యలను సాగిస్తున్నారు. శివసేన నాయకుడు బాల్ థాకరే మృతిచెందగా ప్రభుత్వ లాంఛనాలతో సాగనంపారు. ముంబాయిలో ముస్లిం వ్యతిరేక దాడులకూ, ఇతర రాష్ట్రాలవారిపై దాడులకూ కారకుడనీ, హిట్లర్ అభిమానినని చెప్పుకున్న ఆయనకు లోక్‌సభలో సంతాపం తెలిపారు. 2002లో గుజరాత్‌లో ముస్లింల ఊచకోతను సాగించిన వాడిగా ముద్రపడిన నరేంద్రమోడి కాబోయే ప్రధానిగా ఎదుగుతున్నాడు. ఈనాటివరకూ 1984లో ఢిల్లీలో సిక్కులను ఊచకోత కోసిన వారికి శిక్షలు లేకపోగా, దానిని సాగించిన కాంగ్రెసు నాయకులకు పదవులు కట్టబెట్టారు.

పోనీ మతమో, ప్రాంతమో లేని భోపాలుగ్యాసు దుర్ఘటనకు బాధ్యులైన వారికి శిక్షలు లేకపోగా, కంపెనీ అధిపతి వారెన్ ఆండర్సన్‌పై కేసుపెట్టకుండా ప్రభుత్వమే దేశంనుండి సాగనంపింది. కేరళ మత్స్యకారులను భారత్ జలాలలో కాల్చిచంపిన ఇటలీ షిప్పింగ్ కంపెనీ కిరాయి సైనికులను సంసార సుఖం పొందమని బెయిలిచ్చి వారి దేశానికి పంపింది.

2008 సెప్టెంబరులో పూనా బాంబు పేలుళ్లు సాగించిన సాధ్వీ ప్రజ్ఞాసింగ్, పురోహిత్, తొగాడియాలను, సాక్ష్యాలతో నిందితులుగా పేర్కొంటూ హేమంత్‌కర్కరే కేసు పెట్టారు. వారిని అరెస్టుచేసినా ఈనాటికీ విచారణ ముగియలేదు. వారు హిందుత్వ పరివార్ నాయకులైనందున పోలీసు కస్టడీలోకి కూడా వారికి అన్ని సౌకర్యాలు నడచివచ్చాయి.

ఇంతకంటే పెద్ద టెర్రరిస్టు చర్యలుంటాయా? టెర్రరిజంపై పోరులో భారత పాలకుల రికార్డు యిదీ. టెర్రరిస్టు బాధితులకు చేసిన న్యాయమిదీ. దీనిలో భాగమే కసబ్ ఉరితీత. ఇది ముంబయి టెర్రరిస్టు బాధితులకు జరిగిన న్యాయం కాబోదు.

దోపిడీ వర్గాల పాలనతో జీవనమే కష్టభరితమై కునారిల్లుతున్న భారత ప్రజలలో పేరుకుపోతున్న అశాంతిని ప్రక్కదారి పట్టించేందుకు పొరుగు దేశాలతో చిచ్చురగులుతూనే వుండేట్లు చేయటం, మత వైషమ్యాలకు తావు కల్పించటం అన్న కుటిల రాజకీయాలను ఆశ్రయించటం పాలకవర్గాల నీతిగా మారింది. అది మరొకసారి రుజువయింది.

ప్రపంచ వ్యాపితంగా మార్క్సిస్టు-లెనినిస్టులేనాడూ టెర్రరిజాన్ని అంగీకరించలేదు. దురాక్రమణ దాడులనూ, దోపిడీనీ అంగీకరించలేదు. స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం, శాంతికోసం; దోపిడీ వర్గాలనూ, దురాక్రమణ-బెదిరింపు దాడులనూ ఎదుర్కొని ప్రజలను దోపిడీనుంచీ, హింసనుంచీ విముక్తం చేశారు. వారి జీవితంలో శాంతి నెలకొల్పారు.

✱

## అమెరికా టెర్రరిజంపై పోరు వికృత పార్శ్వం

సెప్టెంబరు 11 నాటి ప్రపంచ వాణిజ్య కేంద్ర భవనాలపై టెర్రరిస్టు దాడి జరిగిన నాటినుండీ అమెరికా సామ్రాజ్యవాదం, టెర్రరిజంపై పోరు జపం చేస్తోంది. కాగా ముస్లిములకు వ్యతిరేకంగా ప్రజలలో అసహనాన్ని రెచ్చగొడుతున్నది. ప్రతి ముస్లిముని టెర్రరిస్టుగా చిత్రిస్తున్నది. ముస్లిములపై దాడి చేయమని ప్రజలను రెచ్చగొడుతున్నది. అమెరికా శ్వేతజాతి ప్రజలలో ఈ అసహనం తీవ్రస్థాయికి చేరుతున్నది. శ్వేతేతర జాతులపై దాడులకు పురికొల్పుతున్నది.

డిసెంబరు 27న 31ఏళ్ల ఎరికా మెండెజ్ అన్న మహిళ న్యూయార్క్‌లోని ఒక రైల్వేస్టేషన్‌లో వేచివున్న సునందాసేన్ అన్న భారతీయుడిని వెనుకనుండి పట్టాలపైకి నెట్టింది. రైలు గుద్దుకుని ఆయన మృతిచెందారు.

తర్వాత ఆమెను అరెస్టుచేసి రెండవ డిగ్రీ హత్యానేరాన్ని మోపారు. ఎందుకిలా చేశావని అడిగినప్పుడు, "నేను ఒక ముస్లిమును రైలుపట్టాలపైకి నెట్టాను. "ఎందుకంటే జంట భవనాలను 2001లో కూల్చిననాటినుండీ నేను హిందువులనూ, ముస్లిములనూ ద్వేషిస్తున్నాను", "ఆనాటి నుండీ నేను వారిని కొడుతూనే వున్నాను" అని సమాధానం చెప్పింది.

అమెరికా సామ్రాజ్యవాదం సాగిస్తున్న టెర్రరిజంపై పోరు ప్రచారపు వికృత ఫలితమిది. అది పురికొల్పిన అసహనపు వికృతరూపమిది.

నాగరిక ప్రభుత్వం ఈ చర్యను సహించలేదంటూనే అమెరికా అధికార యంత్రాంగం ఆమె పాతనేరస్తురాలనీ, మానసిక వైకల్యానికి గురైందని చెప్పి ఈ నేరానికి పురికొల్పిన అసహనంలో తన పాత్రను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నది. "ఆమె హిందూ, ముస్లిం మతాలను విడిగా చూడలేకపోయింది" అనటంద్వారా ముస్లిం అయివుంటే ఫర్వాలేదన్నట్లుగా ఆమె నేరతీవ్రతను తగ్గించి చూపే ప్రయత్నానికి దిగింది. మూలకారణాన్ని దాచి పెట్టేందుకు సామ్రాజ్యవాదులు చూపుతున్న తెలివితేటలివి. ఈ విఫలప్రయత్నాలతో అమెరికా శ్వేతజాతి ప్రజల్లో ఇతర మతాల ప్రజలపట్ల అసహనాన్ని పెంచుతున్న తన నేరాన్నుండి అది తప్పించుకోజాలదు.

# పేదలకు నివాస స్థలాలకై ఆందోళన

**రాయదుర్గం, 3-12-12:**

రాయదుర్గం మండలం-ఉడేగోళంలో అర్హులైన 230 మంది నిరుపేదలకు నివాసస్థలాలు వెంటనే ఇవ్వాలని ఏఐఎఫ్‌టియు-న్యూ రాష్ట్ర అధ్యక్షులు కా॥సి. పెద్దన్న డిమాండ్ చేశారు. గత ఆరునెలలుగా వివిధ దఫాలుగా ఇదే సమస్యపై అధికార్లకు విజ్ఞాపన పత్రాలు సమర్పించినా కనీసం స్పందించకపోవటంపట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు.

బడా, బహుళజాతి పరిశ్రమ యజమానులకు వేల, లక్షల ఎకరాలను అప్పనంగా కట్టబెడ్తున్న పాలకులు, నిరుపేదలకు సెంటుకుంట భూమి కల్పించటానికి ఏమాత్రం ముందుకు రావటంలేదంటే, పాలకుల నైజం స్పష్టం అవుతుంది అన్నారు. దీనిపై వెనువెంటనే ఒక నివేదికను రూపొందించవలసిందిగా ఉన్నతాధికారులు స్థానిక వీఆర్‌ఓను ఆదేశించారు. సమస్యను సత్వరం పరిష్కరించకుండా జాప్యం చేసేట్లయితే, సంఘం ఆధ్వర్యంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ తిమ్మారెడ్డి మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని నాయకత్వం వహించారు.

✱

# ట్యునీసియాలో 'పూర్తికాని విప్లవం'

*(ట్యునీషియన్ వర్కర్స్ పార్టీ మిలిటెంట్ అబ్దుల్ జబ్బార్ మదౌరీ 16-11-2012న పీటర్ బోయ్‌లేకిచ్చిన ఇంటర్వ్యూ)*

*(అబ్దుల్ జబ్బార్ మదౌరీ, తన సెంకండరీ విద్యాభ్యాస ప్రారంభకాలం నుండీ ట్యునీసియాలో మిలిటెంట్‌గా వున్నారు. తన చురుకైన రాజకీయ కార్యాచరణ కారణంగా అతను మూడు పర్యాయాలు (1987, 1993 మరియు 2002లో) జైళ్లలో నిర్బంధించబడ్డారు. అరెస్టు కాబడిన ప్రతి సందర్భంలోనూ చిత్రహింసలకు గురిచేయబడుతూ ఆపై 12 సం॥ల కాలం జైలు శిక్షలను అనుభవించారు. బెన్ ఆలీ పాలనాకాలంలో మదౌరీ నాలుగు సం॥ల కాలం అజ్ఞాతంలో ఉన్నారు. అతనికి పనిహక్కు, పాస్‌పోర్టును పొందే హక్కు సైతం నిరాకరించబడ్డాయి.*

*మదౌరీ ఒక నవలాకారుడు కూడా. 'లీగ్ ఆఫ్ ఫ్రీ రైటర్స్'లో ఆయన ఒక సభ్యుడు. నియంతృత్వ పాలకులు ఆయన రచించిన నవలలో కొన్నింటిపై నిషేధం విధించారు. ఈనాడు మదౌరీ 'ట్యునీషియన్ వర్కర్స్ పార్టీ' జాతీయ కమిటీ సభ్యుడు; ఇంకా, ఈ పార్టీ వార్తాపత్రిక 'సావత్ ఇఛాబ్' (ప్రజాగొంతుక)కు సంపాదకుడు కూడా. గ్రీన్ లెఫ్ట్ వారపత్రిక ఇంటర్‌నెట్ ద్వారా మదౌరీ తో ఈ సంభాషణను సాగించింది. -సంపాదకుడు)*

**ప్రశ్న : వీధిలో తోపుడుబండిపై చిన్నవ్యాపారం చేసుకునే ట్యునీసియా యువకుడు మహమ్మద్ బవాజి త్యాగం- అరబ్ దేశాలను దాటి స్పెయిన్ వరకూ ఇంకా చెప్పాలంటే ప్రపంచానికంతకూ 'ఆక్రమణ ఉద్యమం' తరహాలో వ్యాప్తిచెంది ప్రజా తిరుగుబాటుకు ఒక నూతన ఒరవడిని సృష్టించింది. అయితే, ట్యునీసియాలో ఈ తిరుగుబాటు ఎంతవరకు ఫలితాన్నిచ్చింది? ప్రజాస్వామిక వాతావరణం ఇప్పటికైనా ఏర్పడుతున్నదా?**

జవాబు : గత పాలకపార్టీ ప్రభుత్వాన్ని రద్దుచేయగలగటం; (ప్రజలమద్దతులేకున్నా ఇప్పటికీ దానిలోని శక్తులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి) భావ ప్రకటనకు మరియు ప్రచారమాధ్యమాలు స్వేచ్ఛ పొందటం; ప్రజల అసహ్యానికి గురైన రహస్య పోలీసు వ్యవస్థ లాంఛన ప్రాయరూపంలోనైనా రద్దు చేయబడటం వంటి కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను ఈ తిరుగుబాటు సాధించగలిగిందని చెప్పవచ్చు. ఎన్నికల ప్రచారంలో సమానావకాశాలు, పారదర్శకత లోపించటం వంటి కొన్ని వైఫల్యాలున్నప్పటికీ మొదటిసారిగా, ఒక ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలను జరిపించుకోగలటాన్ని ఈ తిరుగుబాటు సాధించింది. చట్టబద్ధమైన శాసనసభకు ఎన్నికలు జరిపించుకోవటమనేది- ప్రజలు పోరాడి సాధించు కోవాలనుకున్న లక్ష్యాలలో ఒకటిగావుంది. దురదృష్టకరమేమంటే, ఇస్లామిక్ ఎన్నాధా సంకీర్ణ పక్షం ఈ తిరుగుబాటు నుపయోగించుకొని ఈ ఎన్నికలలో ఆధిక్యాన్ని పొందింది. తిరుగుబాటును అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న విప్లవ ప్రతీఘాత శక్తుల బలం కారణంగా ఈ తిరుగుబాటు యొక్క అనేకమైన కర్తవ్యాలు పూర్తిగాకుండా మిగిలివున్నాయి. ప్రభుత్వ జవాబుదారీ తనాన్ని పెంపొందించటం; ప్రభుత్వ వ్యవస్థలలో లంచగొండి తనానికి ముగింపు పలకటం మరియు అలాంటి వాటిపై దర్యాప్తు సాగించటం; ప్రజలపై నేరాలకు పాల్పడిన వారిని బాధ్యులుగా చేసే విధంగా ప్రభుత్వ విభాగాలను నిర్దేశించటం – ప్రత్యేకించి ఈ పోరాటంలో అనేకమందిని హత్యలు గావించిన వారిపై విచారణలు సత్వరం పూర్తిచేసి, బాధితులకు ఉపశమనం కలగచేయటం వంటి అనేక కర్తవ్యాలు ఇంకా పూర్తిగాకుండా మిగిలిపోయినవిగా వున్నాయి.

**ప్రశ్న : ఒక సం॥ర కాలపు చట్టబద్ధ శాసనసభ సాధించిదేమిటి? దాని నిర్ణయాలను కార్మికోద్యమ మరియు వామపక్షవిభాగాలు తగిన విధంగా ప్రభావితం చేయగలిగాయా?**

జవాబు : ఎన్నికలనంతరం, ఒక సంవత్సర కాలం తర్వాత, ఈనాటికీ చట్టబద్ధ శాసనసభ, తిరుగుబాటుదారుల డిమాండ్స్‌ను ప్రతిబింబించే చట్టాల ముసాయిదాలను కూడా రూపొందించలేదు. శాసనసభలో తమ సభ్యుల ఆధిక్యం ద్వారా, ఎన్నాధా ప్రభుత్వం తన స్వీయ ప్రయోజనాల మేరకే చట్టాలను ఆమోదించుకుంది. తిరుగుబాటు కర్తవ్యాలు పరిపూర్తికాకుండా పనిచేసే నూతన తరహా నియంతృత్వ ప్రభుత్వం మినహా, ఇది ఒక విప్లవ ప్రభుత్వం కానే కాదని ఈ అనుభవం ప్రజలకు స్పష్టంచేస్తోంది. పెరుగుతున్న ధర్నాలు; ప్రజాకూడళ్ళలో, వీధులలో, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట బైఠాయింపు నిరసనలనేవి–ఈ ప్రభుత్వ పాలనపట్ల ప్రజల వ్యతిరేకతకు అద్దం పడుతున్నాయి. కనుక, విప్లవక్రమం సమానత్వపు పరివర్తనవైపుగా నెమ్మదిగా సాగుతున్నది.

**ప్రశ్న : కొన్ని ప్రజాస్వామీకరణ వ్యతిరేక చర్యలు జరుగుతున్నట్లుగా ఆమ్నెస్టీ అంతర్జాతీయ సంస్థ అంటున్నది. నిరసనకారులు, కార్యకర్తలు, పత్రికారచయితలు దాడులకు గురవుతున్నారు. రాజకీయ భావప్రకటనకు తదనుగుణమైన సంస్థల స్వేచ్ఛకు సంబంధించిన పరిస్థితి ఎలాగుంది?**

జవాబు : ఇస్లామిక్ ఛాందసవాద సాలాఫిస్ట్ సైనిక బలగాలను ఉపయోగించి, ఎన్నాధా ప్రభుత్వం స్వతంత్ర పత్రికారచయితలపై దాడులు సాగిస్తోంది. తద్వారా ప్రభుత్వ ప్రచార సాధనాలపై ఆధిపత్యం పొంది, ప్రచార వ్యవస్థలకు బాధ్యులుగా తన విధేయులైన మద్దతుదారులను నియమిస్తోంది. ప్రచార మాధ్యమాలకు స్వేచ్ఛను గ్యారంటీ చేసే, సమాచార ప్రసారాలకు ఒక స్వతంత్ర కమిషన్‌ను నియమించాలనే చట్టాలను ఆచరణలో పెట్టేందుకు ఈ ప్రభుత్వం నిరాకరిస్తోంది. కావున పత్రికారచయితలు ఇప్పటికీ స్వాతంత్ర్యం, స్వేచ్ఛల కోసం పోరాడుతూనే వున్నారు.

**ప్రశ్న : ట్రేడ్‌యూనియన్ ఉద్యమ పరిస్థితి ఎలావుంది? ట్రేడ్ యూనియన్ రంగంలో మీ పార్టీ ఎంత గట్టిగా వుంది? పెట్టుబడిదారుల పార్టీలు, ప్రభుత్వమూ ట్రేడుయూనియన్ నాయకులను లోబరుచుకోవటం, అవినీతి పాల్జేయటంలతో సమస్యలేవిధంగా ఉన్నాయి?**

జవాబు : 'జనరల్ యూనియన్ ఆఫ్ ట్యునీషియన్ వర్కర్స్' (యుజిటిటి) అనేసంస్థ ట్యునీసియాలో అతిపెద్ద ట్రేడ్ యూనియన్. ఈ సంస్థ 1952లో స్థాపించబడి, ఆనాటి నుండి ప్రభుత్వ విధానాలపై పోరాటంలో చాలా ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. బెన్ అలీ పాలనా కాలంలో– కార్మిక నాయకులను అవినీతిపాలు జేసే చర్యలతో–ఈ సంస్థ ఇబ్బందులనెదుర్కొన్నది. కానీ, తిరుగుబాటు తర్వాత కాలంలో అది తన సమగ్రతను, శక్తిని తిరిగి సంతరించుకొని- మిగతా అనేక ప్రజాసంఘాల సహకారంతో సామాజిక, రాజకీయ పోరాటాలకు నాయకత్వం వహించగలుగుతున్నది. యుజిటిటిలో వర్కర్స్ పార్టీ చాలా బలంగావుంది. యుజిటిటిలో చురుకుగా పాల్గొంటున్న 12 రాజకీయ పార్టీలతో అక్టోబరు (2012)లో నూతనంగా ఏర్పడిన పాపులర్ ఫ్రంట్‌లోనూ ట్రేడ్ యూనియన్ కలిసి పనిచేస్తున్నది. గత నియంతృత్వ పాలనాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురైన, తిరుగుబాటులో పాల్గొన్న వామపక్షపార్టీలు, ప్రగతిశీల జాతీయవాదులు ఈ పాపులర్ ఫ్రంటును స్థాపించిన వారిలో ప్రముఖంగా వున్నారు. ప్రస్తుతం, పాలన సాగిస్తున్న ఎన్నాధాపార్టీ, పాతపాలకులగుర్తుగా మిగిలిన 'ట్యునీసియా అప్పీల్' పార్టీల తర్వాత పాపులర్ ఫ్రంటే అతిపెద్ద రాజకీయ శక్తిగావుంది.

**ప్రశ్న : మత ఛాందసవాదుల నుండి ఏ విధమైన ప్రమాదాన్ని ట్యునీసియా ఎదుర్కోనుంది?**

జవాబు : ట్యునీసియా రాజకీయ వ్యవస్థలో ఇస్లాము మత ఛాందసవాదం ఒక భాగంగా వుంది. అప్పుడప్పుడు ఇది బార్లపై, కళాకారులపై, పోలీసులపై దాడుల రూపంలో తనకు తాను వ్యక్తం చేసుకుంటోంది. పోలీసులతో జరిగిన కొట్లాటలలో కొందరు ఛాందస వాదులు మృతి చెందారు కూడా. కానీ ప్రజల ప్రతిఘటనోద్యం, ఈ మతఛాందసవాదుల ప్రభావాన్ని తగ్గించి, వారిని ఒంటరి చేయగలిగింది. సాలాఫిస్ట్ హింస వంటి ఇటీవలికాలపు వ్యక్తీకరణలన్నీ ఈ ఛాందసవాద సమూహాలతో ప్రభుత్వ రహస్య ఒప్పందాలు, భాగస్వామ్య కారణంగా సాగినవే.

**ప్రశ్న : ట్యునీసియాలో ఇటీవల పేర్కొనదగిన కొన్ని సమ్మెలు జరిగాయి. వీటి గురించి వివరిస్తారా?**

జవాబు : మేము మూడు ప్రధాన అంశాలపై అనేక కార్మిక ప్రచారోద్యమాలు చేపట్టి, నిర్వహిస్తున్నాము. అత్యధికులైన కార్మికులకు అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన దుర్భర పనిపరిస్థితులను నియంత్రించే చట్టాలను రూపొందించి, అమలు చేయాలనేది ఈ ప్రచారంలో మొదటి అంశం. రెండవది- పెరుగుతున్న ధరలకనుగుణంగా, వేతనాల పెంపుదల మరియు మెరుగైన పని పరిస్థితులు; మరీ ముఖ్యంగా పనిగంటలు మరియు వృత్తి పరమైన రక్షణలు. మూడవది–ప్రభుత్వ సంస్థలలో కార్మికుల నియామకం, తొలగింపులపై చట్టం.

**ప్రశ్న : ట్యునీసియాలో ఇటీవల మహిళలు తమ హక్కులకోసం సాగించిన నిరసనల గురించి వివరిస్తారా?**

జవాబు : ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి ముఖ్యంగా- బహుభార్యాత్వం, కనీస వివాహవయసు నియంత్రణ; హక్కులు, బాధ్యతలలో లింగ సమానత్వం మొదలైన మహిళా డిమాండ్స్‌పై వంచనకు గురిచేస్తూ వస్తోంది. కానీ, ప్రజల నుండి ప్రత్యేకించి చాలా గట్టిగా మహిళా సంఘాల నుండి ఎదురైన ప్రతిఘటనతో ఈ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఈనాటికీ ట్యునీసియాలో మహిళా హక్కుల పోరాటం ప్రభుత్వానికి ఒక గట్టి సవాలు విసురుతోంది.

**ప్రశ్న : 2013 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయనే వాగ్దానం ట్యునీసియా ప్రజాభీష్టాన్ని సంతృప్తిపరిచేదిగా వుందా? ఈ ఎన్నికలలో వామపక్షాల పాత్ర ఎలా ఉండబోతోంది? నూతన విప్లవాత్మక తిరుగుబాటుకు సంబంధించి వివరిస్తారా?**

జవాబు : రాబోయే జూన్ ఎన్నికలలో ప్రభావం కలిగించే లక్ష్యంతో విప్లవశక్తులు కృషిచేస్తాయి. ప్రజా తిరుగుబాటు నాటి డిమాండ్ల సాధనకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా ఉపయోగించు కోనున్నాయి. ఉద్యోగ కల్పన, స్వేచ్ఛ; బడాసామ్రాజ్యవాదులకు దేశాన్ని లొంగుబాటు చేయటాన్ని అంతం చేయటమనేవి మా అత్యధిక ప్రాధాన్యతగల లక్ష్యాలు. పాపులర్ ఫ్రంట్ నాయకత్వంలోని వామపక్ష విభాగం ఈ ఎన్నికలలో చురుగ్గా, ప్రభావం కలిగించే వైపుగా పనిచేయటం ఖాయం. గత ఎన్నికల వెనువెంటనే చేపట్టిన అభిప్రాయ సేకరణ ఫలితాలలో వర్కర్స్ పార్టీ ఆరుశాతం ఓట్లతో నాల్గవ స్థానంలో వుంది. కాగా, రాబోయే ఎన్నికలలో పాపులర్ ఫ్రంట్ 15 శాతం ఓట్లను సాధిస్తుందని భావిస్తున్నాం. నానాటికీ దిగజారుతున్న ట్యునీసియా ప్రజల జీవన పరిస్థితులు; ఈ పరిస్థితులను మార్చలేని ప్రభుత్వ అసక్తత–ట్యునీసియాలో మరో తిరుగుబాటుకు కూడా దారితీయవచ్చు. అనివార్యంగా సంభవించే ఈ తిరుగుబాటుకు నాయకత్వ మందించేందుకు, లక్ష్యాలను సాధించేందుకు పాపులర్ ఫ్రంట్ సిద్ధంగావుంది.

**ప్రశ్న : లిబియా, సిరియాలలో పరిణామాలపై మీ పార్టీ అభిప్రాయం ఏమిటి? 'అరబ్బుల తిరుగుబాటు'ను సామ్రాజ్యవాద శక్తులు విజయవంతంగా మోసగించటాన్ని ప్రారంభించారా?**

జవాబు : అరబ్బు ప్రాంతంలో–ప్రత్యేకించి ఖతార్, సౌదీ అరేబియా ప్రాంతాలలోని ప్రతీఘాతుక పాలకులతో ఈ సామ్రాజ్యవాద శక్తులు కుమ్మక్కైవున్నాయి. సిరియాలో పెల్లుబికిన ప్రజా తిరుగుబాటును విధ్వంసకరమైన, నీచమైన పౌరయుద్ధంగా మలచటం ద్వారా దీనిని నాశనం చేయటంలో వారు కృతకృత్యులయ్యారు. లిబియాలో ప్రత్యేకించి- ప్రభుత్వ వ్యవస్థలను లిబియన్లు పునర్నిర్మించుకుంటున్నప్పటినుండి పరిస్థితి కొంత భిన్నంగా కన్పడుతోంది. కానీ లిబియా తిరుగుబాటు– లిబియా ప్రజల డిమాండ్లను సాధించేందుకు మరిన్ని పోరాటాలను సాగించవలసివుంటుంది. 'అరబ్బు తిరుగుబాట్లు' సంభవించిన దేశాలుగా పిలవబడే వానిలో పరిస్థితిని అదుపుజేసేందుకు సామ్రాజ్యవాద శక్తులు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ప్రత్యేకించి, ట్యునీసియా, ఈజిప్టులలో ఇస్లామిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చిన సామ్రాజ్యవాద- జియోనిస్టుల ఎజెండాతో వారు కుమ్మక్కు కావటంతో తమకు ఆయా దేశాలలో సహకరించే నమ్మకమైన సేవకులను వెతుక్కోవటమే లక్ష్యంగా వారువున్నారు. మరోవైపు, ఈ రెండు దేశాలలోనూ ప్రజలకు నాయకత్వం వహిస్తూ విప్లవోద్యమ క్రమం ముందుకు సాగుతోంది. ★

## ఒడిషా...

( 2వ పేజీ తరువాయి)

ఈ ప్రజా ఆందోళనకు ప్రజాస్వామిక సంఘీభావం మరింతగా పెరిగింది. 2012 ఆగస్టు 12న భూమిసమస్యపై ఛాసిమూలియా సంఘం ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో ఒక సదస్సు నిర్వహించారు. ఆగస్టు 12న, పోస్కోప్రతిరోధ్ సంగ్రామ్ సమితికి చెందిన ఇద్దరు నాయకులు ఆందోళన సాగుతున్న ప్రాంతానికి వచ్చి, ప్రజలతో కలసి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. పోస్కో భూముల సేకరణకు వ్యతిరేకంగా తాము సాగించే ఆందోళన అనుభవాలను వారు ప్రజలకు వివరించారు.

ఆగస్టు 20,21 తేదీలలో, సిపాసరుబాలి తాలూకాకు చెందిన ప్రజానీకం పెద్ద సంఖ్యలో కదిలి, తమ స్వాధీనంలోని భూములలో మొక్కలను నాటారు. మొత్తంగా 10వేలకు పైగా మొక్కలను ప్రజలు స్వచ్ఛందంగా కదిలివచ్చి నాటారు. రెండురోజులపాటు కలసికట్టుగా కదలివచ్చి ఆ కృషి సాగించారు. ప్రజలంతా శ్రమదానం చేసి ఆ భూమికి దాపునే ఒక చెరువును తవ్వారు. అది ప్రజల దాహాన్ని తీర్చగలుగుతోంది. ఈ ప్రాంతం నుండి స్మగ్లర్లు యధేచ్ఛగా కలపను నరికి తీసుకెళ్ళటాన్ని ప్రజలు నిరోధించారు.

యుజెజెఎస్‌ఎస్ నాయకత్వం మరిన్ని పరిసర గ్రామాల ప్రజానీకాన్ని ఈ ఉద్యమంలోకి సమీకరించి కృషి చేస్తోంది. ప్రభుత్వం యొక్క ప్రత్యక్ష నిర్బంధం తగ్గినట్లు అన్పించినా, అది పూర్తి వాస్తవం కాదు. అలాగే భూ కబ్జాదారులు కూడా తిరిగి ఆ భూములను తమ స్వంతం చేసుకునే కుట్రలు పన్నుతున్నారు. గ్రామాల్లో తన దళారీలను వీరు ఏర్పరుచుకొని, ప్రజలను చీల్చే పథకాలు వేస్తున్నారు. ప్రజలపై విడివిడిగా వత్తిడి తేవటం, భయపెట్టటం వంటి చర్యలతో ఆపేందుకు ప్రయత్నిస్తున్నారు. సండాపూర్ గ్రామస్తులకు, గోర్వాల్ గ్రామస్థులకు నడుమ 50 ఎకరాల వివాదాన్ని రగిల్చి, పెద్దది చేసే ప్రయత్నం చేశారు. ఆందోళనకారుల నాయకత్వం దీనిపట్ల మెలకువగావుండి, భూకబ్జాదారుల కుట్రలను ఎండగట్టి, ప్రజలను ఐక్యంగా ఉంచే కృషి సాగిస్తోంది.

2012 నవంబర్ 13న యుజెజెఎస్ఎస్, ఛాసీమూలియా సంఘ్ నాయకత్వంలో బ్రహ్మగిరిలో పెద్ద ప్రజా ప్రదర్శన నిర్వహించి, తహశిల్‌దారు కార్యాలయంవద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక భూ మాఫియా ముఠాలు ప్రజలను ఈ కార్యక్రమంలో పాల్గొననీయకుండా బెదిరింపులకు గురిచేశారు. వీటన్నింటినీ అధిగమించి 2వేల మంది ప్రజానీకం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనేకమంది ఇతర ప్రాంతాల ప్రజలు సంఘీభావంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నిరసనసభలో కా॥ బ్రహ్మానంద మలిక్ (సిఎమ్ఎస్ నాయకులు); శ్రీ దీనబంధు దాస్(పూరి–న్యాయవాది); శ్రీఉమాప్రసాద్ మొహంతి (ఒడిషా హైకోర్టు న్యాయవాది); శ్రీ ప్రకాష్‌జెనా, బాబులిరౌట్ (పోస్కో ఉద్యమప్రతినిధులు); ఈశ్వర్ ప్రధాన్ (మాజీ ఎంఎల్ఏ); సుశాంత జెనా (సిఎమ్ఎస్ నాయకులు) భద్రక్, బసు (పివై ఎస్ఎఫ్ నాయకులు); శ్రీదేవిరథ్ (ప్రజాస్వామికవాది) మరియు శ్రీకాంత్ (సిఎమ్ఎస్ కార్యదర్శి) పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ నిర్బంధ విధానాలను, భూమాఫియా దౌర్జన్యాలు, కుట్రలను వీరంతా ఎండగట్టారు. ఎలుగెత్తి ఖండించారు. ప్రజల న్యాయమైన ఆందోళనను ముందుకు సాగించాలని పిలుపునిచ్చారు.

అదేసమయంలో, నవంబర్ 26న భూ మాఫియాకు చెందినవారు కొందరు ప్రజల స్వాధీనంలోని భూములనుండి ఇసుకను తరలించే ప్రయత్నం చేశారు. ప్రజలు మెలకువగా వుండి వారి చర్యలను నిరోధించారు. ఈ సంఘర్షణలో వారు 8 మంది ప్రజలను బలవంతంగా ఎత్తుకెళ్ళి, తమగ్రామాలలో నిర్బంధించి వారిని తీవ్రంగా కొట్టారు. యుజెజెఎస్ఎస్ నాయకత్వం ఈ అంశాన్ని వెనువెంటనే పోలీసు అధికారులకు తెలియజేయటంతోపాటు ప్రజలను సిద్ధంచేసి సంబంధిత గ్రామానికి నడిపించింది. కాగా, పోలీసులు ప్రజల్ని నిర్బంధించిన గ్రామానికి చేరుకొని, భూ మాఫియానుండి లంచాలు తీసుకొని, నిర్బంధించ బడిన వారిపైనే తప్పుడు కేసులు బనాయించారు.

పూరీజిల్లా వ్యాపితంగా పోలీసుల ఈ కుమ్మక్కు చర్యలను తీవ్రంగా నిరసించారు. యుజెజెఎస్ఎస్ నాయకత్వం డిసెంబరు 3న, పూరి జిల్లా ఎస్.పి. కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఈ చర్యను నిరసించింది. సిపిఐ, సిపిఎం, ఫార్వర్డ్‌బ్లాక్, ఈశ్వర్ ప్రధాన్ (మాజీ ఎంఎల్ఏ), మరియు ఇతర ప్రజాస్వామిక వాదులు పోలీసుల చర్యలను ఖండిస్తూ మాట్లాడారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యమ విచ్ఛిన్నం, నిర్బంధం మొదలగు వాటిగుండా సిపాసిరుబాలి ఉద్యమం సాగుతోంది. ప్రజలు భూముల సాధనకు ధృఢనిశ్చయంతో వున్నారు. న్యాయమైన తమ సమస్యలోనూ, ప్రజల ఐక్యతలోనే నిజమైన బలముందని వారు అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈ పోరాటం కఠినతరం, దీర్ఘకాలం సాగేదైనప్పటికీ మెరుగైన జీవితంకోసం నిరుపేదలకు ఇది అనివార్యమైనది. ★

# పర్యావరణంపై దోహా సదస్సు ఫలితాలుండని కుస్తీపట్లు

**కతార్‌లోని** దోహా నగరంలో పర్యావరణ రక్షణపై జరిగిన మరో అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు కాలుష్యకారక వాయువుల విడుదల తగ్గింపుపై కట్టుబడాల్సిన ఒప్పందమేదీ కుదరకుండానే ముగిసింది. ఐ.రా.స. ఆధ్వర్యంలో సాగిన ఈ శిఖరాగ్ర సదస్సు వైఫల్యం ముందుగా వూహించినదే. 2009లో కోపెన్‌హాగెన్ (డెన్మార్క్) సమావేశం క్యోటో ఒడంబడిక ననుసరించి జరగాల్సిన అంగీకారానికీ రాకుండా ముగిసింది. అగ్రదేశాల మధ్య తలెత్తిన విబేధాలే దీనికి కారణం. ఆనాటినుండీ వివిధ దేశాధినేతలు తర్వాత జరిగిన కాన్‌కున్ (మెక్సికో), దర్బాన్(దక్షిణాఫ్రికా). ఇప్పుడు దోహా సదస్సులకు గత మూడేళ్లుగా హాజరు కాకుండా జూనియరు మంత్రులనూ, దౌత్య సిబ్బందినీ పంపటమే దీనికి సూచిక. ఫలితంగా కాలుష్యవాయువుల విడుదలతో సంబంధంలేని అప్రాధాన్య విషయాలను చర్చిస్తూ వచ్చారు. మానవాళి మనుగడకే పొంచివున్న ప్రమాదంపట్ల పెట్టుబడిదారీ దేశాధినేతలకెంత శ్రద్ధవుందో ఇది తెలుపుతుంది.

బొగ్గుపులుసు, తదితర కాలుష్యవాయువుల విడుదల ప్రమాదకర స్థాయికి చేరింది. పర్యావరణ మార్పుపై ఐరాస అంతర్జాతీయ ప్యానెల్ తన పరిశీలనలో చెప్పిన అంచనా ఖచ్చితంగా వుందని నేడు స్పష్టమౌతున్నది. “ఆ అంచనాల ప్రకారమే విడువకుండా వేడిమి పెరిగిపోతూవుండగా, మనం కుర్చీల్లో వెనక్కి వాలి తీరికగా చూస్తూ కూర్చున్నాము. ప్యానల్ అంచనాలు నిజమౌతున్నాయని యిప్పటి విశ్లేషణలు స్పష్ట పరుస్తున్నాయి. కాగా మనం అత్యధిక స్థాయిలో వాయువులు విడుదల చేస్తూ పొద్దు పుచ్చుతున్నామా. ప్యానల్ అంచనాలన్నీ అత్యధిక అంచనాలే. అవే నిజమౌతున్నాయి” అని సౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయపు వాతావరణ మార్పు పరిశోధనా కేంద్రపు శాస్త్రవేత్త మాట్ ఇంగ్లండ్ అన్నారు.

అలాగే ఐరాస పర్యావరణ కార్యక్రమపు నివేదిక, వాయుకాలుష్యంపై తక్షణ చర్య తీసుకోవాలని కోరగా, దానినీ పట్టించుకోలేదు. “వేడిమి పెరుగుదల 2 డిగ్రీల సెల్సియస్‌ను దాటకుండా చూసే దారిలో మనం వుండాలంటే, 2020 నాటికి కాలుష్యవాయువుల విడుదల పెరుగుదల ఆగిపోవాల్సి వుంటంద”ని ఐరాస పర్యావరణ ముఖ్యశాస్త్రవేత్త ప్రొ॥జోసెఫ్ అర్కామో అన్నారు. “ప్రస్తుత ప్రపంచస్థాయి విడుదలను 25శాతానికి 2050 నాటికల్లా తగ్గించాలి. 2050లో మిగిలిన దానిలో సగం తగ్గించాలి. ఇది సాధించాలంటే కఠినతర నిబంధనల అమలుకు 2020వరకూ మనం వేచివుండలేము” అని కూడా హెచ్చరించారు.

అయినప్పటికీ, క్యోటో ఒడంబడిక తర్వాత కాలుష్యకారక వాయువుల విడుదలపై ఒప్పందాన్ని దోహా సదస్సు 2015కు వాయిదా వేసింది. అప్పుడు పారిస్‌లో జరిగే సదస్సు దీనిని ఆమోదిస్తే 2020 నుండీ అమలులోకి వస్తుందట. ఒప్పందానికి రాలేని తన అశక్తతను దాచిపెట్టుకోవటానికి క్యోటో ఒడంబడికను మరో 8 ఏళ్లు పొడిగించగలిగామంటూ దోహాసదస్సు డబ్బా వాయించుకొంది. వాస్తవమేమంటే, అమెరికా, రష్యా, జపాన్, కెనడాలు ఈ ఒప్పందం నుండి ఉపసంహరించుకోవటంతో అది నిరుపయోగంగానే వుంటుంది. యూరోపియన్ యూనియన్ దేశాలూ, కొన్ని ఇయుకు చెందని యూరపు దేశాలూ, ఆస్ట్రేలియా, మూడు మాజీ సోవియటు రిపబ్లిక్కులు మాత్రమే దీనిపై సంతకాలు చేశాయి. ఇవి చేసే కాలుష్యం ప్రపంచ కాలుష్యంలో 15 శాతం మాత్రమే.

దోహా సదస్సుకు భిన్నంగా పారిస్ సదస్సు ముగుస్తుందని ఆశించడానికి ఒక్క కారణమూ కన్పించటంలేదు. ప్రతి సామ్రాజ్యవాద దేశమూ తన బడాకంపెనీల ఆర్థిక ప్రయోజనాలు కాపాడేందుకు పనిచేస్తున్నాయి. కఠినతర కాలుష్యవాయు విడుదల నిబంధనలను తాను అమలుజరపకుండా తప్పించుకుని, తన ప్రత్యర్థులచేత అమలుజరిపించి లబ్ధిపొందాలని చూస్తున్నాయి. చైనా, భారత్, తదితర దేశాలను “అల్పాదాయ” దేశాలుగా క్యోటో ఒడంబడిక వర్గీకరణను అంగీకరించే ఎలాంటి వాతావరణ ఒప్పందాన్నైనా అడ్డుకునేందుకే అమెరికా సామ్రాజ్యవాదం పనిచేస్తున్నది. క్యోటో ఒడంబడిక ప్రకారం అల్పాదాయ దేశాలకు వాయువిడుదల తగ్గింపు లక్ష్యాల అమలు కట్టుబాటుగా వుండదు. “అల్పాదాయ” దేశాలు కూడా లక్ష్యాలకు తప్పనిసరిగా కట్టుబడి వుండాలని అమెరికా వాదిస్తున్నది. అంతేకాక “సమిష్టి అయితే విచక్షణాయుత బాధ్యత” (అన్ని దేశాలదీ సమిష్టిబాధ్యతే అయినా కొన్ని దేశాలకు మినహాయింపు యివ్వటం-సం) అన్న పదజాలాన్నే చర్చల్లో ఉపయోగించరాదని పట్టుపడుతున్నది.

వాటి అభివృద్ధిస్థాయి, అది విడుదల చేసే వాయువుల స్థాయితో సంబంధంలేకుండా అన్ని దేశాలూ సమాన బాధ్యత వహించాలని అమెరికా వాదిస్తున్నది. ప్రస్తుతం పర్యావరణంలోని కాలుష్య వాయువులలో అత్యధికభాగం అమెరికా విడుదల చేసినవే. 1850 నుండి 2007వరకూ అది విడుదలచేసిన కాలుష్య వాయువులు మరేయితర దేశంకన్నా మూడురెట్లు ఎక్కువ. కాగా భారత్, చైనాలలో తలసరి కాలుష్యవాయు విడుదల అమెరికాకన్నా ఎంతో తక్కువ. తాను కల్గించిన హానికి బాధ్యతను ఇతరులకు పంచటం-ఇదీ సమానత్వానికి సామ్రాజ్యవాదుల నిర్వచనం.

పారిశ్రామిక, ద్రవ్య పెట్టుబడి రక్కసుల లాభార్జనా దాహాన్ని తీర్చే అంశం కూడా క్యోటో ఒప్పందపు పొడిగింపులో వుంది. దీనికోసమే ఈ పొడిగింపు యూరపువాయు విడుదల వాణిజ్య పథకాన్ని బలీయంచేస్తుంది.

వాతావరణ మార్పు సమస్యకు “స్వేచ్ఛామార్కెట్టు” వ్యవస్థ ముందుకు తెచ్చిన పరిష్కారమే బొగ్గుపులుసు వాయు వాణిజ్యం. కాలుష్య నివారణ నిబంధనలకు లోబడిన స్థాయికంటే ఎంత తక్కువస్థాయి కాలుష్య వాయువులు విడుదలైతే, ఆ కాలుష్యాన్ని బొగ్గుపులుసు వాయువు కాలుష్యంలోకి మార్చి, దానికి తగిన పాయింట్లు సంపాదించినట్లు ఆ పరిశ్రమకు సర్టిఫికేట్ యిస్తారు. వీటిని పరిశ్రమ వాటాలులాగా అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. అత్యధిక కాలుష్యం విడుదల చేస్తున్న కంపెనీలు వీటిని కొని తాము కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత తీసుకున్నట్లు చూపెట్టి, నిబంధనలు అమలు జరపకుండా మినహాయింపు పొందుతాయి. దీనితో కార్పోరేట్లు, బ్యాంకులు షేరు మార్కెట్టులో జూదమాడగల మరో సరుకుగా ఈ కాగితాలు రూపుదాల్చాయి. ఐరోపా ద్రవ్య పెట్టుబడికిది విపరీత లాభాలు తెచ్చిపెడుతున్నది. ఈ వాణిజ్యానికి కేంద్రం లండన్. ప్రపంచ కార్బన్ వాణిజ్యంలో 80శాతం యిక్కడే జరుగుతుంది. ఏడాదికి 9వేల కోట్ల పౌండ్ల వాణిజ్యముందని అంచనా.

యూరపు ఆర్థిక సంక్షోభంతో యిటీవల పారిశ్రామిక ఉత్పత్తి తగ్గి తత్పర్యవసానంగా కార్బన్ వాణిజ్యం తగ్గింది. కార్బన్ వాణిజ్యానికి వాణిజ్య బ్యాంకులిచ్చే రుణాలు టన్ను కార్బన్‌కూ 2008-9లో 20 డాలర్ల నుండి నేడు 3 డాలర్లకు పడిపోయింది.

క్యోటో ఒడంబడిక లేకపోతే కార్బన్ వాణిజ్య కుప్పకూలిపోతుంది. ఎందుకంటే దీనికవసరమయ్యే శాసనపర చట్రాన్ని ఆ ఒడంబడిక ఏర్పాటు చేసింది. బడా కంపెనీలు ముఖ్యకార్యనిర్వహణాధికారులనుద్దేశించి ప్రసంగిస్తూ ఆస్ట్రేలియా ప్రధాని జూలియా గెల్లార్డ్ ఇలా అన్నారు: “కార్బన్ వాణిజ్యం ఈ ఏడాదు కోట్లాది మంది వినియోగదారులను తన పరిధిలోకి తీసుకువస్తుంది. ఈ అవకాశాన్ని ఆస్ట్రేలియా అంది పుచ్చుకోవాలా వద్దా అని మీబల్లకెదురుగా కూర్చున్న బాంకరును అడిగిచూడండి ఏమంటాడో! తమ వాటా పొందే విధంగా వారికి మేము తప్పకుండా సహాయపడతాము”.

షేరు మార్కెట్టులో జూదమాడే కొద్దిమందికి లాభాలు చేకూర్చటం తప్ప కార్బన్ వాణిజ్యం కాలుష్యవాయు విడుదల తగ్గింపులో పూర్తిగా విఫలమైంది. అది పెట్టుబడిదారీ విధాన వైఫల్యాన్ని కూడా ఎత్తి చూపింది.

పెట్టుబడిదారీ విధానం క్రింద బడాబూర్జువాలూ, సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత వైరుధ్యాలూ పర్యావరణ వినాశనాన్ని నివారించే విధంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించే ప్రయత్నాలను తొలచివేస్తాయి. అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యుత్తు (శక్తి) ఉత్పత్తి, పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తి, రవాణా సదుపాయాలను పునర్నిర్మించి వాతావరణానికి కలగబోతున్న తీవ్ర ప్రమాదాన్ని తొలగించడమూ, అదే సమయంలో ప్రపంచమంతటా ప్రజల జీవన ప్రమాణాలను పెంచగలగటమూ సాధ్యమే. అయితే దానికి హేతుబద్ధంగా, కేంద్రీకృత ప్రణాళికా విధానాన్ని అమలుజరపాలి. అది సోషలిస్టు వ్యవస్థలోనే సాధ్యమౌతుంది. ✡

# ఉద్యోగుల భవిష్యనిధి కార్మికుల జేబుకు చిల్లు

**అధికారిక** లెక్కల ప్రకారం 2010-11లో 6.5 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులు తమ నెలవారీ వేతనంలో కొంతభాగాన్ని ఉద్యోగుల భవిష్యనిధి(పిఎఫ్) ఖాతాలో జమ చేస్తున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత మొత్తం వారికి 8.5 శాతం వడ్డీతో తిరిగి యివ్వాలి. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపిఎఫ్ఓ) ఈ నిధులపై యాజమాన్యం, పర్యవేక్షణ కలిగివుంది. రూ.5,80,247 కోట్ల సంచిత నిధులతో ఇది నడుస్తున్నది. ఇది చాలా పెద్ద మొత్తం. చందాదారులకు వడ్డీ చెల్లిస్తూ ఈ నిధులను ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యకలాపాలకు వాడుతున్నది.

ప్రపంచీకరణ విధానాల అమలుతో, బడా బూర్జువాల కన్ను ఈ నిధులపై పడింది. ఈ నిధులను తమ పరం చేయవల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. దీనికోసం భవిష్యనిధి సంస్థను రద్దుచేసి, దాని నిధులు కొత్తపెన్షను పథకానికి తరలించమనీ, అందువల్ల కార్మికులకు ఎక్కువ సొమ్ము అందుతుందనీ వాదిస్తున్నారు. భవిష్యనిధి సంస్థ నిర్వహణా లోపాలను చూపి బూర్జువావర్గ పత్రికలు కార్మికుల ప్రయోజనాలకు వకాల్తా పుచ్చుకున్నట్లు వాదిస్తూ ప్రైవేటీకరణ చేయమని సూచిస్తున్నాయి.

భారత ఆర్థిక సమస్యలన్నింటికీ సర్వరోగ నివారిణిగా ప్రైవేటీకరణ జపం చేస్తున్న కేంద్రప్రభుత్వం, ఈ రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు పూనుకుంది. అయినా ఇపిఎఫ్ఓలో వున్న కార్మిక ప్రతినిధులు వ్యతిరేకిస్తూండటంతో అమలుచేయలేకపోతున్నది. ఇతర ప్రభుత్వరంగ సంస్థలపట్ల అనుసరించిన విధంగానే మోసపు పద్ధతులను చేపట్టింది. సంస్థ పనితీరులో సామర్థ్యం, పారదర్శకత, జవాబుదారీతనం పెంచటం ద్వారా కార్మికులకు లబ్ధిచేకూరుతుందని ప్రచారానికి పూనుకుంది. దీనికోసం ఉన్నతాధికారులను ఉపయోగిస్తున్నది.

భవిష్యనిధి కేంద్ర కమీషనర్ ఆర్.సి. మిశ్రా తాను ఉద్యోగ విరమణ చేస్తున్నరోజు 2012 నవంబరు 30న ఒక సర్క్యులర్ జారీచేశాడు. దానిలో భవిష్యనిధి జమలో బకాయిపడ్డ కంపెనీలపై, దానివల్ల నష్టపోయిన కార్మికులెవరో పేరు పేరునా గుర్తించేవరకూ చర్యలు తీసుకోరాదని ఆజ్ఞాపించాడు. “అవసరమైన వివరాలందజేయనందుకూ, అందజేయలేనందుకూ యజమానులను శిక్షించరాద”ని కూడా పేర్కొన్నాడు. బకాయిలుపడ్డ కేసుల విచారణకు ఏడేళ్లకాల వ్యవధిని కూడా నిర్దేశించాడు.

ఇంతేగాక, భవిష్యనిధికి చెల్లింపుకోసం తమవేతనం నుండి యజమాని సొమ్మును తీసివుంచాడని నిరూపించుకోవాల్సిన బాధ్యత కార్మికులదేనని పేర్కొన్నాడు.

అంతేగాక, వేతనంనుండి భవిష్యనిధి చెల్లింపును నిర్ణయించేటప్పుడు ఇంటి అద్దె, కాంటీను, వైద్య అలవెన్సులను కూడా వేతనంలో కలిపి లెక్కించాలనీ కూడా ఆదేశించాడు.

ఆరకంగా, ఉద్యోగులు తమవేతనం నుండి ఎక్కువ కోల్పోయేవిధంగానూ, వాటిని నిధికి చెల్లించకుండా బకాయిలు పెట్టిన యాజమాన్యంపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండానూ ఉండే ఆజ్ఞలను కమీషనర్ విడుదల చేసి గందరగోళ పరిస్థితిని కల్పించాడు. పైగా తన ఆదేశాలు కార్మికుల సంక్షేమాన్ని కాపాడేందుకే తోడ్పడతాయని చెప్పుకున్నాడు.

కార్మికుల వేతనాలనుండి తీసిపెట్టిన డబ్బును, నిధిలోని కార్మికుల ఖాతాలోకి జమచేయకుండా యాజమాన్యాలు బకాయీలు పెట్టడం సరళీకరణ ముందునాటి కంటే బాగా పెరిగిపోయింది. చాలా కంపెనీలు అసలు భవిష్యనిధినే చెల్లించటంలేదు. కొన్ని బహుళజాతి కంపెనీలు ప్రత్యేకించి ఐటి కంపెనీలు భవిష్యనిధికి తమ వాటానుకూడా ఉద్యోగుల వేతనాల నుండే తగ్గిస్తున్నాయి. సరళీకరణ తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ముందుకొచ్చిన లేబరు కంట్రాక్టర్లు భవిష్యనిధిని కొల్లగొడుతున్నారు. కాగా, పనిచేయించు కుంటున్న కంపెనీ తన బాధ్యత కాదని తప్పుకుంటున్నది. అధికారుల కళ్లముందే అక్రమాలు సాగుతున్నాయి.

ఇటీవల (2012 డిసెంబరులో) ఇకనామిక్ టైమ్స్ పత్రిక బిఎల్ కాశ్యప్ అండ్ సన్స్ అన్న కంపెనీ భవిష్యనిధికి రూ॥593 కోట్లూ, ఆహ్లువాలియా కంట్రాక్టర్సు ఇండియా లిమిటెడ్ రూ॥70 కోట్లూ బకాయిలు పెట్టాయని తెలిపింది. భవిష్యనిధికి బకాయిలు పెట్టి కంపెనీలు ఎలా దిగమింగుతున్నాయో ఈ ఉదాహరణలు తెలుపుతున్నాయి. అందుబాటులో వున్న అధికారిక సమాచారం ప్రకారం ఇప్పటివరకూ రూ॥3016 కోట్లు బకాయీలున్నాయి. గత ఏడాది వరకూ బకాయిలు రూ॥2383 కోట్లు పేరుకుపోగా, దానిలో ఇపిఎఫ్ఓ రూ॥1650 కోట్లు మాత్రమే వసూలుచేసింది. బకాయీలు పెట్టిన కంపెనీలు 59,761 అని గుర్తించగా, వాటిలో 7216పై మాత్రమే చర్యలకు పూనుకున్నారు. బకాయీలు పెట్టినా, ఇంకా గుర్తించకుండా వున్న కంపెనీలు ఇంతకంటే ఎక్కువగానే వున్నాయి.

వాస్తవ పరిస్థితి యిది కాగా, అక్రమంగా కార్మికుల భవిష్యనిధిని కాజేస్తున్న యాజమాన్యాలపై తన అధికార కొరడాను ఝుళిపించవలసిందిపోయి, వారిపై కేసులు పెట్టవలసిందిపోయి, కార్మిక హక్కుల ఉద్దేశపూరిత ఉల్లంఘనకు పాల్పడ్డ కంపెనీలను చూసీ చూడనట్లు వదలివేయమని కేంద్ర కమీషనర్ తన క్రింది అధికారులకు ఆదేశాలిచ్చాడు.

ఈనాటికీ కూడా చాలా కంపెనీలు తమ కార్మికులకు వేతన వివరాలను తెలిపే స్లిప్పులు యివ్వవు. కార్మికులు అడిగితే వేధింపులకు పూనుకుంటాయి. భవిష్యనిధికి వేతనంనుండి తీసిపెట్టి, ఖాతాకు జమచేసే బాధ్యతను ప్రభుత్వమే యాజమాన్యాలపై ఉంచింది. కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యాలను నిలదీయగల స్థితేఉండదు. యాజమాన్యాలు వివరాలివ్వనందువల్ల, ఉద్యోగం మాని మరోచోట చేరినప్పుడు, తమ సొమ్మును యిమ్మని భవిష్యనిధిని అడగటం కార్మికులకు సాధ్యం కాదు. ఇందువల్ల ఇది మా ఖాతా సొమ్మని ఎవరూ అడగని ధనం భవిష్యనిధివద్ద పేరుకుపోతున్నది. ఈ పరిస్థితిలో భవిష్య నిధికి చెల్లింపుల బాధ్యతను మొత్తం యాజమాన్యాలపై వుంచాలి. కాగా కార్మికులనే నిరూపించుకొమ్మనటంద్వారా, చట్టావిహిత బాధ్యతనుండి యాజమాన్యాలు తప్పుకునేందుకు కల్పించిన సౌకర్యమే అవుతుంది. ఇది కార్మిక వ్యతిరేక చర్య.

ఇకపోతే భవిష్యనిధికి చెల్లింపు ఎంతో నిర్ణయించటానికి అలవెన్సులన్నీ కలిపి వేతనంగా తీసుకుని లెక్కించాలన్న ఆదేశం ఒక గందరగోళ పరిస్థితిని సృష్టించాలన్న దురుద్దేశ్యంతో చేసింది. ఆవిధంగా ఈ పిఎఫ్ఓ అసమర్థపూరితమన్న సాకుచూపి ప్రైవేటీకరణకు దారివేసేందుకుద్దేశించినది. అనేక కంపెనీలు తమ పెద్ద ఉద్యోగులకు మూలవేతనాన్ని తక్కువ చూపించి, అలవెన్సులు ఎక్కువ చూపుతాయన్నది బహిరంగ రహస్యమే. ఇందువల్ల భవిష్యనిధికి చెల్లింపులుతగ్గి, కార్మికులు నష్టపోతున్నారని కమీషనర్ అన్నది వాస్తవమే. దీనిని సరిచేస్తానని చెప్పుకున్నాడు. అలా చేయాలంటే, అలవెన్సులకు ఒక పరిమితిని నిర్దేశించి దానిని లెక్కించితే సరిపోయేది. కానీ సామాన్య ఉద్యోగులూ, కార్మికులూ ఎక్కువ కోల్పోయే విధపు ఆదేశాలిచ్చాడు.

కమీషనర్ చెప్పుకున్నట్లు ఇది కార్మికులకోసం చేసింది కాదు. ఇటీవలి కాలంలో ఉద్యోగుల, కార్మికుల వేతనాలనుండి ఎక్కువగా తగ్గింపులు చేసే ప్రయత్నాలు అనేక విధాలుగా సాగుతున్నాయి. ఇది ఒకరకంగా ప్రజలనుండి బలవంతంగా ప్రభుత్వం అప్పు తీసుకోవటమే. 8.5 శాతం తక్కువ వడ్డీ యిస్తున్నది. కార్మికులనుండి ఈ బలవంతపు వసూళ్లతో నిధి పెరిగే కొద్దీ దాన్ని తమ కప్పగించమన్న, ప్రైవేటీకరించమన్న వత్తిడి పెరుగుతోంది.

సహజంగానే దీనిపై కార్మికులనుండీ, ట్రేడు యూనియన్ల నుండీ వ్యతిరేకత వచ్చింది. దీనితో కేంద్రమంత్రి మల్లికార్జున ఖర్గే కమీషనర్ జారీచేసిన అలవెన్సులను వేతనంలో కలపాలన్న ఆదేశాన్ని అమలు చెయ్యకుండా ఆపుతున్నానని ప్రకటించాడు. మిగిలిన వాటిగురించి మాట్లాడలేదు. ఎక్కువ మొత్తంలో భవిష్యనిధి చెల్లింపులు యాజమాన్యాలకు ఇష్టంకాదు కనుక దానిని ఆపాడుతప్ప కార్మికులకోసం కాదు.

కార్మికులు, కార్మిక నాయకులూ ఈ మోసాన్ని అర్థంచేసుకోవాలి. ప్రభుత్వమూ, బూర్జువాలూ కార్మికుల ప్రయోజనాలకు కల్గిస్తున్న హానిని అర్థంచేసుకోవాలి. ఈ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంకావాలి. ✡

# కార్మిక వర్గానికి ఉమ్మడి పిలుపు

## ఫిబ్రవరి 20,21 తేదీల్లో సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి!

## యుపిఎ ప్రభుత్వం యొక్క సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి!!

**బలమైన** వ్యతిరేకత వ్యక్తమయినప్పటికీ, రిటైల్‌రంగాన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తెరవటం వలన, కేంద్రంలో వున్న యు.పి.ఏ. ప్రభుత్వం ముఖ్యంగా దేశంలోని బడా కార్పొరేట్ సంస్థలకూ, సామ్రాజ్యవాద పెట్టుబడికీ అనుకూలమైన ఆర్థిక విధానాలను చేబడుతోందని మరోసారి రుజువయింది. సంస్కరణల ప్రక్రియ కొనసాగుతూనే వుంటుందని ప్రధానమంత్రి చెప్పటం అన్నది -విదేశీ పెట్టుబడికి లాభదాయకమైన విధంగా మరింతగా విధానాలు కొనసాగబడతాయనే సూచన వెల్లడవుతోంది. ఇదే విధంగా, యింతకుముందు కాలంలోని యు.పి.ఏ., ఎన్.డి.ఏ. ప్రభుత్వాలుకూడా యిదే విధమైన సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలు జరిపాయన్నది కూడా వాస్తవమే.

గత 21 సంవత్సరాల అనుభవం, మనదేశంలోని పాలకవర్గాలు అమలు పరిచిన సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలు యొక్క దుష్ఫలితాలను, హానికరమైన ఫలితాలను చాలా వివరంగా వెల్లడించాయి. ఈ విధానాలు వ్యవసాయరంగాన్ని సంక్షోభస్థితికి తీసుకెళ్ళాయి. ఫలితంగా రైతులు ఆత్మహత్యల పాలయ్యారు. ఆర్థిక పరిస్థితికి చెందిన పారిశ్రామిక, సేవారంగాల్లో, ఉద్యోగిత యొక్క వ్యవస్థలో కార్మికుల కాంట్రాక్టీకరణ-క్యాజువలీకరణలవలన తీవ్రమయిన మార్పులు సంభవించాయి. ప్రభుత్వ, ప్రయివేటురంగాల్లో రెగ్యులర్ కార్మికుల సంఖ్యకన్నా, తాత్కాలిక కార్మికుల సంఖ్య చాలా ఎక్కువయింది. ఇటివంటి ఉద్యోగిత వ్యవస్థ, యజమానులు కార్మికుల వేతనాలను తగ్గించటానికీ, కార్మికులను అసంఘటితపరచటానికీ సాధ్యం చేస్తుందన్న విషయాన్ని గుర్తించాలి. నూతన ఆర్థిక విధానాల అమలు వలన, బలీయంగా వచ్చిన మరొక లక్షణం ఔట్‌సోర్సింగ్ విధానం. ఈ విధానం కార్మికుల శ్రమశక్తి ఖరీదును తగ్గించటానికి ఒక సాధనంగా యజమానుల చేతిలో వుంది. వేతన కత్తిరింపులు, డి.ఎ. ఘనీభవింపు, రిట్రెంచ్‌మెంట్లు, కంపెనీల మూతలు, లేఆఫ్‌లు-అనే కార్మికవ్యతిరేక చర్యలు-యీ కాలంలో గణనీయంగా పెరిగిపోయాయి. మరోవైపు కనరాని విధంగా, సామాజిక భద్రతా వ్యవస్థ ఉపసంహరింపబడింది. యూనియన్ ఏర్పాటు చేసుకొనే, యూనియన్‌లో సభ్యులుగాచేరే హక్కుపై హోండా, తదితర యూనియన్లలో జరిగినట్లు తీవ్రమయిన దాడిజరుగుతోంది.

సరళీకరణ, ప్రవేటీకరణ, గ్లోబలీకరణ విధానాలన్నవి, మనదేశంయొక్క ఆర్థికాభివృద్ధికి దారులు అన్నట్లుగా పాలకులచేత కీర్తించబడ్డాయి. ఈ అభివృద్ధి అనే దానికి సూచికలుగా వృద్ధిరేటు చూపించబడ్డాయి. అయితే యీ వృద్ధి అనేది ప్రాథమికంగా విదేశీ పెట్టుబడులు మనదేశంలోకి ప్రవహించటంవలన, అదికూడా జూదపెట్టుబడి చేత, షేర్ మార్కెట్లలో సృష్టింపబడిన బుడగలు (వృద్ధి) ఫలితమేనని చెప్పనవసరం లేదు. సామ్రాజ్యవాదం యొక్క-ప్రత్యేకించి అమెరికన్ సామ్రాద్యవాదం యొక్క బంధనాలకు, భారత దేశ ఆర్థిక వ్యవస్థ కట్టుబడి పోయింది. ఈ రకంగా సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదానికి కట్టుబడి పోయినందువలన, ఎప్పుడైతే అమెరికాలో బుడగలు (ఆర్థిక) పగిలిపోతాయో, అప్పుడు దాని దుష్ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై పడి, అది పతనమవుతూ, వేలాది మంది కార్మికులను, ప్రత్యేకించి ఎగుమతి ఆధారిత పరిశ్రమలలోని కార్మికులను - ఉద్యోగాల నుండి తొలగించుతోంది.

తమ ఆర్థిక వ్యవస్థలను చుట్టుముట్టిన వినాశపూరిత సంక్షోభాన్నుండి బయటపడి తమను తాము రక్షించు కోవటానికి సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ విధానాలలో భాగంగా, మనదేశంలో ప్రభుత్వాలు-మనదేశంలోని సహజవనరులను, ఖనిజాలనూ బడాకార్పొరేట్లకూ, బహుళజాతి కంపెనీలకూ దోచిపెట్టే విధానాలను ముమ్మరం చేశాయి. ఈ విధానాల ఫలితంగా రైతాంగమూ, ఆదివాసీలు భారీఎత్తున విస్థాపనకు గురయ్యారు. (తమ ప్రాంతాల నుండి తరిమి వేయబడ్డారు) అత్యంత విలువైన ఖనిజవనరులను కలిగివున్న పెద్దపెద్ద భూ ఖండాలను, పళ్ళెంలో పెట్టి కార్పొరేట్ సంస్థలకూ, బహుళజాతి కంపెనీలకూ అప్పగించారు. ఈ రకంగా ప్రజల సమిష్టి ఆస్తి వారి చేతికి దఖలు చేశారు.

ఈ నేపథ్యంలో సంభవిస్తున్న నిరంతరం పెరిగిపోతున్న ఉద్యోగాల నష్టాలు, వేతనాల కోతలు, యితర సదుపాయాల్లో కోతలు, భరించి కార్మిక సంఘహక్కులపై దాడులు మొదలైన చర్యలను కార్మికులు మవునంగా అంగీకరించటల్లేదు. హోండా, గ్రెజినో, మారుతీ తదితర కంపెనీలలో మాదిరిగా గట్టి ప్రతిఘటనను యిస్తున్నారు. ఆదివాసీలు, రైతులూ కూడా తమ భూమిని పరిరక్షించుకోవటానికి పోరాడుతున్నారు. వాస్తవానికి, మన పాలకులు అవలంబిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాల వ్యతిరేక పోరాటంలో, ఆ ఆదివాసీల, రైతుల మిలిటెంట్ పోరాటాలే, గణనీయమైన ప్రాధాన్యతను వహిస్తాయి.

ఇటువంటి పరిస్థితుల్లో ఫిబ్రవరి 20,21 తేదీలలో-కొనసాగుతున్న పాలకవర్గాల దాడులకు ప్రతిఘటనగా జరిగే సమ్మెకు మద్దతుగా అన్నిరకాల, సెక్టర్లకు చెందిన కార్మికులూ ఐక్యమై, కార్యాచరణకు పూనుకోవాలి. వివిధ కార్మికసంఘ కేంద్రాలు-పాలక పార్టీల అనుబంధ కార్మిక సంఘ కేంద్రాలతో సహా కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై సమ్మెకు ఉమ్మడి లేదా సంయుక్త పిలుపులు యివ్వటం అన్నది, ఈ (ఐక్యమై, సమ్మెలో పాల్గొనే) ఆవశ్యకతను మరింతగా స్పష్టం చేస్తోంది.

ప్రభుత్వం యొక్క విధానాలను ఓడించాలంటే, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, ఒక నిరంతరాయమైన పోరాటాన్ని నిర్మించాల్సివుంది. చాలా కార్మిక సంఘ కేంద్రాలుఈ సామ్రాజ్యవాద, నయాఉదారవాద విధానాలను అమలు జరిపే పార్టీలతో సన్నిహితంగా వున్నాయి. కార్మిక సంఘాల ఉద్యమం తక్షణ ఆర్థిక కోర్కెల సాధనకోసమే గాక, ఈ సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా కూడా పోరాడాలి. అందువలన మేము, 'సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే' యూనియన్లన్నింటినీ, దగ్గరై, ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాల్సిందిగా పిలుపు ఇస్తున్నాము.

కార్మిక వర్గం యొక్క తీవ్రమయిన ఒత్తిడిలోనూ, నిరంతరం పెరిగిపోతున్న కార్మిక వర్గపు అసంతృప్తిలోనూ, జాతీయస్థాయిలో ఐక్యతపట్టుకు రావటానికి అవకాశం ఏర్పడుతుంది. అటువంటి జాతీయస్థాయి ఐక్యత, క్షేత్రస్థాయిలో పోరాడటానికి అవకాశం కల్పిస్తుంది. ఈ విధమయిన భావాత్మక స్థితిని, స్థానికస్థాయిలో పోరాడటానికీ, ప్రతిఘటించటానికీ అవుసరమయిన ఐక్యతను నిర్మించాలి. విస్తృతమైన కార్మికవర్గ సెక్షన్లను ఐక్యపరిచేందుకూ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ క్రింద కార్మికవర్గ పోరాటపు అవగాహనను మరింతలోతుగా అర్థంచేసుకొనేటట్లు చేయటానికీ ఉమ్మడి కార్యక్రమంలో చురుకుదనాన్ని ప్రదర్శింప చేసేందుకూ, సార్వత్రికసమ్మెను ఉధృతపరచి, కొనసాగించేందుకూ మనం ఉమ్మడి కార్యక్రమాలను ప్రారంభించాలి, చొరవతీసుకోవాలి.

**డిమాండ్లు :**

1. ధరల పెరుగుదలను నివారించటానికి నికరమైన నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. అందరికీ ఆహారభద్రత, ప్రతి కుటుంబానికీ 50కిలోల ఆహార ధాన్యాలతో బాటు తగినంత పప్పుదినుసులు, వంటనూనె అందించాలి.
2. ఉద్యోగాల సృష్టికి నికరమైన నిర్దిష్ట చర్యలు చేపట్టాలి.
3. కార్మిక సంక్షేమ చట్టాలను గట్టిగా అమలు చేయాలి. చట్టాలను అమలు జరపని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.
4. సంఘటిత, అసంఘటిత రంగాలలోని కార్మికులందరికీ సామాజిక భద్రత కల్పించాలి.
5. ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణలను నిలుపుదల చేయాలి.
6. శాశ్వత స్వభావం గల ఉద్యోగాలన్నింటిలోనూ కాంట్రాక్టు కార్మిక విధానం ఆపాలి. శాశ్వత, నియత కార్మికులతో సమానంగా, అనియత, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి.
7. 1957లో భారత కార్మిక మహాసభ నిర్ణయించిన సూత్ర ప్రాతిపదికపై, అంతకు తగ్గని కనీస వేతనాన్ని ఖచ్చితంగా యిచ్చేటట్లు ఖాయం చేయాలి.
8. బోనస్, పి.ఎఫ్. అర్హత చెల్లింపులపై గరిష్ఠ పరిమితిని రద్దుచేయాలి. పి.ఎఫ్. యితర పొదుపు పథకాలలో వడ్డీ కనీసం 12% వుండాలి.
9. కనీస వేతన మొత్తానికి తగ్గకుండా అందరికీ పెన్షన్ చెల్లించాలి.
10. 45 రోజుల్లో తప్పనిసరిగా కార్మిక సంఘాలను రిజిష్టర్ చేయాలి.
11. సమాన పనికి, మహిళా కార్మికులతో సహ అందరికీ సమాన వేతనం యివ్వాలి.
12. మహిళా కార్మికుల, ప్రత్యేకించి రాత్రిపూట పని చేసే మహిళా కార్మికుల రక్షణకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
13. రైతుల, ఆదివాసీల, దళితుల భూములను, సహజవనరులను దురాక్రమించటం ఆపాలి. పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలి.
14. ఆదివాసీల, దళితుల, మహిళల, మైనార్టీలపై జరిపే వివక్షతను ఆపాలి-యధార్థమైన సమానత్వాన్ని స్థాపించాలి.

✤ ఫిబ్రవరి 20,21న సమ్మె చేయటంకోసం ఐక్యంకండి!

✤ కార్మికవర్గ ఐక్యతను పెంపొందించండి!

✤ సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ప్రతిఘటనను నిర్మించండి!!

విప్లవాభినందనలతో...

**ఎ.ఐ.ఎఫ్.టి.యు(న్యూ), ఐ.ఎఫ్.టి.యు., ఎన్.టి.యు.ఐ., టి.యు.సి.ఐ., ఐ.ఎఫ్.టి.యు., పి.కె.ఎస్.**

# భోపాల్ విషవాయు బాధితులను పట్టించుకోనని పాలకులు

**28** ఏళ్ల క్రితం 1984 డిసెంబరు 4న బహుళజాతి కంపెనీ యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ భోపాలు ప్లాంటులో మిక్ విషవాయువు వెలువడి 15 వేల మంది దుర్మరణం పాలుకాగా, 50వేలమందికి పైగా విషప్రభావానికి లోనై అంగ, మానసికవైకల్యాలకు గురయ్యారు. తల్లికడుపులో వసిగుడ్డులుకూడా విషప్రభావానికి లోనయ్యారు. దీని ప్రభావం రాబోయే అనేక తరాల వరకూ ఉంటుంది. అత్యంత ఘోర పారిశ్రామిక ప్రమాదమిది.

20 ఏళ్ల తర్వాత కూడా, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అనేక ప్రభుత్వాలు మారినప్పటికీ బాధితుల కష్టాలకు సహాయమందించటం, నేరస్థులను శిక్షించటమన్న అంశాలలో ఎలాంటి చెప్పుకోదగ్గ చర్యలూ అమలు జరగలేదు.

ప్రజల కోసమే పనిచేసే ప్రజాస్వామిక పాలనంటూ బాకాలూదుకునే ప్రభుత్వాలు, భోపాలు విషవాయు బాధితుల సంక్షేమం కొరకు పనిచేయకపోగా, ప్రమాదానికి కారణమైన యూనియను కార్బైడ్ కంపెనీ ప్రయోజనాలను రక్షించేందుకు మాత్రం ముందు కొస్తున్నాయి. ఆనాటి కంపెనీ అధిపతి వారన్ ఆండర్సన్‌ను సకల రాచమర్యాదలతో దేశం నుండి సాగనంపారు. కోర్టులో విచారణ కొరకు ఈనాటికీ తిరిగి తీసుకురాలేదు.

ఆనాడు విషవాయువుకు గురైనవారు ఈనాటికీ దాని తీవ్ర దుష్ప్రభావాలతో బాధించబడుతూనే వున్నారు. వారికి తగిన వైద్య, ఆరోగ్యసేవలు ఈనాటికీ అందించటంలేదు.

భోపాలు ఫ్యాక్టరీలో ప్రాణాలకూ, పర్యావరణానికీ తీవ్రహానికరమైన విష్యర్థాలు పేరుకుపోయి వున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, ఫ్యాక్టరీ యాజమాన్యంగానీ, యూనియన్ కార్బైడ్‌ను కొన్న డౌ కంపెనీగానీ వాటిని ఈనాటికీ తొలగించలేదు.

వీటిని తొలగించే బాధ్యతను డౌ కంపెనీ చేపట్టే విధంగా ఈ "సర్వసత్తాక", "స్వతంత్ర" ప్రభుత్వమేదీ చేయలేకపోయింది. బాధితులకు నష్టపరిహారాన్ని చెల్లించవలసిన బాధ్యతను కూడా డౌ కంపెనీపై పెట్టలేకపోయింది. దీనికి భిన్నంగా దేశానికి వస్తున్న డౌ కంపెనీ అధిపతులకు ఎర్రతివాచీపరచి స్వాగతం పలుకుతున్నది. ఆ విధంగా కాంగ్రెసు, బిజెపి ఎవరు అధికారంలోవున్నా సామ్రాజ్యవాదులకు నమ్మినబంట్లమని చూపుకున్నారు.

స్వతంత్ర వ్యవస్థగా చెబుతున్న మన దేశ న్యాయవ్యవస్థ కూడా బాధితులకు ఆసరాగా నిలబడలేక పోయింది. వారికి న్యాయాన్ని అందించేబదులు చట్టపర చిక్కులపై పండిత చర్చల్లో మునిగితేలుతున్నది.

భారత సముద్ర జలాల్లో భారత మత్స్యకారులను హత్యచేసిన ఇటలీ కిరాయి సైనికులను క్రిస్మస్ పండుగ సందర్భంగా వారి దేశానికి వెళ్లేందుకు బెయిలిచ్చిన న్యాయవ్యవస్థ విశాల హృదయానికి కారణం, వారు సోనియాగాంధీ పుట్టిన దేశమైన ఇటలీకి చెందిన వారవటమన్నది బహిరంగ రహస్యమే. కానీ అదే ఉదారత్వాన్ని భోపాలు విషవాయు బాధితులకు న్యాయమందించటంలో మాత్రం చూపలేకపోయింది. తెల్లతోలు పట్ల గౌరవం చూపే వలస బానిసత్వ ప్రభావం నుండి బయటపడలేదని స్పష్టమౌతోంది.

"ఆదర్శప్రాయ" మనే అమెరికా న్యాయవ్యవస్థ కూడా బాధితులకు న్యాయాన్నందించలేదు. వాస్తవానికి నష్టపరిహారం పేరిట తమని దోచుకుంటారన్న భావనతోనే అది పనిచేసింది.

భోపాల్ ఫ్యాక్టరీలో పేరుకు పోయివున్న విష్యర్థాలు ఈనాటికీ భూగర్భజలాలను కలుషితం చేస్తున్నాయి. ప్రాణాలకు హాని కలిగిస్తున్నాయి. గర్భస్థ శిశువులపై దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. పలువురు అంగవైకల్యంతోనే పుడుతున్నారు.

ఇన్నేళ్లుగా బాధితులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా, నిరసన ప్రదర్శలు చేసినా పాలకులకు చీమకుట్టినట్లుగా కూడాలేదు. ఈ వినాశకర సమస్యపట్ల పాలకులు ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యాన్నే చూపుతూవస్తున్నారు. యూనియన్‌కార్బైడ్, డౌ కంపెనీలకు ప్రయోజనకరంగా భోపాల్ విషవాయు బాధితుల సమస్యను పాలకులు పట్టించుకోవటం మానివేశారు. వాటిపై చర్యతీసుకుంటే, సామ్రాజ్యవాద దేశాల నుండి పెట్టుబడులు ఆపివేస్తామన్న బెదిరింపులకు నిలువెల్లా వణికిపోతున్నారు.

ఇలాంటి వెన్నెముకలేని పాలకుల నుండి న్యాయమైన పరిహారాన్నీ, విషవ్యర్థాల తొలగింపును ఆశించటం ఎండమావులవెనుక పరుగులు తీయటమే అవుతుంది. ఈ దోపిడీసామాజిక వ్యవస్థ అలాంటి న్యాయాన్ని అందిస్తుందని ఆశించలేము.

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని తీవ్రపరిచినప్పుడే ప్రజల ప్రయోజనాలు కాపాడ బడతాయి. నానాటికీ పెరుగుతున్న పారిశ్రామిక ప్రమాదాలు నివారించబడతాయి. ప్రజల ప్రాణాలకు నిజమైన భద్రత ఏర్పడుతుంది.

# పంటకు నష్టపరిహారం, సాగు నమోదుకోసం ఆందోళన

**పోలవరం, 4-12-12:**

నీలం తుపాను కారణంగా ఏజెన్సీలో పంటలన్నీ నష్టపోయాయి. జిల్లాలో వ్యవసాయరంగం అతలాకుతలమైంది. వడ్డీవ్యాపారస్తుల, దళారుల చేతుల్లో చిక్కిఅల్లాడుతున్న పేద రైతాంగం నీలం తుపాను తాకిడితో దిక్కుతోచని స్థితికి నెట్టబడ్డారు. పంట నష్టం జరిగిన వాస్తవాన్ని నమోదుచేయకుండా స్థానిక విఆర్వో, ఇతర అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. 150మందిపైగా ప్రజానీకం తహసిలుదారు ఆఫీసులో సమావేశంకోసమని వచ్చిన కలెక్టరు, ఆర్‌డిఓ తదితర అధికారులను దిగ్బంధనం చేశారు. పంటనష్టం నమోదుచేసి, పరిహారం చెల్లించాలని; సాగు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు.

దీనితో జాయింటు కలెక్టరు ప్రజల ముందుకువచ్చి పంటనష్టం నమోదుచేసి, పరిహారం చెల్లించేందుకు; సాగు వివరాలు అడంగల్‌లో నమోదు చేసేందుకు అధికారులను ఆదేశించారు. గిరిజనుల సాగులోని అన్నిపంటలను, సాగును ప్రభుత్వాధికారులు ప్రస్తుతం నమోదు చేస్తున్నారు.

# బాబ్రీ మసీదు కూల్చివేతకు 20 ఏళ్ళు — ఈనాటికీ మాసిపోని దుష్పరిణామాలు

20 ఏళ్ళ క్రితం 1992 డిసెంబరు 6న హిందూమతోన్మాద శక్తులు బిజెపి, ఆర్ఎస్ఎస్ల నాయకత్వంలో కాంగ్రెసు పార్టీ ప్రభుత్వ సమ్మతితో 500ఏళ్ళ నాటి బాబ్రీ మసీదును కూల్చి వేశాయి. దానికి రామజన్మభూమిని రక్షించుకుంటున్నామన్న సాకుని చూపాయి. ఇది-దేశంలో వున్నది ప్రజాస్వామిక, లౌకిక వ్యవస్థ అన్న నమ్మకాన్నే వమ్ము చేసింది.

లౌకికతత్వ పార్టీనని చెప్పుకునే, అధికారంలో వున్న కాంగ్రెసుపార్టీగానీ, స్వతంత్ర ప్రతిపత్తి వుందనే న్యాయవ్యవస్థగానీ ఈ దుర్మార్గ చర్యకు నేరస్తుడిగా ఒక్క వ్యక్తినికూడా గుర్తించలేదు. శిక్షించటం సంగతి అసలు చెప్పనవసరంలేదు. కాగా ఈ నేరానికి పాల్పడినవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఈ నేరాన్ని ప్రోత్సహించిన, మద్దతు యిచ్చిన బిజెపి అధికారంలోకి ఎగబాకగలిగింది.

ఈ కేసు విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు బిజెపి నాయకుడు అద్వానీ తదితర 19 మందిపై మోపిన నేరపూరిత కుట్ర ఆరోపణను ఉపసంహరించుకొమ్మని సిబిఐని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని అర్థం చేసుకున్న సిబిఐ అధికారులూ, అదనపు సొలిసిటర్ జనరల్ ఎ.ఎస్. చంద్రలోక్ ఈ కోర్టు విచారణకు హాజరు కావటం మానివేశారు. ఆ విధంగా ఈ కేసు "సహజ" మరణం పొందేట్లు చేస్తున్నారు.

నేరాన్ని నిరూపించగల సాక్ష్యాధారాలన్నీ వుండి కూడా నేర విచారణ సాగకుండా చేసి నేరస్తులను శిక్షనుండి తప్పించే ప్రయత్నం బహిర్గతమౌతున్నది.

బాబ్రీమసీదు కూల్చివేత గతించిపోయిన అంశమనీ, నేటి భారత రాజకీయాలలో అప్రాధాన్య అంశమనీ నేడు కొందరు వాదిస్తున్నారు. దీనిని ఈనాడు ఎలాంటి పర్యవసానాలూ లేని గతించిపోయిన అంశంగా బిజెపికూడా నటిస్తున్నది. నేటి ప్రధాన సమస్యలు ఆర్థిక జాతీయవాదం, జాతీయ భద్రతలని వల్లిస్తున్నది. ఆ విధంగా బాబ్రీమసీదు విధ్వంసాన్ని ప్రజల జ్ఞాపకాలనుండి మరుగు పర్చే అన్ని రకాల ప్రయత్నాలను చేస్తున్నది.

భారత దేశంలో మిగిలిన అందరిలాగే ముస్లిములు కూడా జీవించవచ్చునని దేశవిభజన సమయంలో హామీ యిచ్చారు. కానీ అది శుష్కవాగ్దానంగానే మిగిలిపోయింది.

ఆర్ఎస్ఎస్, బిజెపి వాటి అనుబంధ సంస్థలేనాడూ లౌకిక విధానాన్ని అంగీకరించలేదు. కాగా "హిందూ జాతీయవాద" విధానాన్ని చేపట్టి అధికారగద్దెనెక్కి "హిందూరాజ్యా"న్ని స్థాపించాలన్న విధానాన్ని ప్రకటించాయి. ఆ విధంగా హిందూ ఓటర్లను తమ వెనుక సమీకరించుకునే ఎత్తుగడను అనుసరించాయి.

లౌకిక వాదిగా చెప్పుకునే కాంగ్రెసు పార్టీ కూడా బిజెపికి భిన్నంగాలేదు. వాస్తవానికి అది లౌకికవాదం పేరిట ముస్లింల ఓట్లను ఆకర్షిస్తూ మరోప్రక్క నాజూకైన పద్ధతుల్లో హిందూ మతోన్మాదాన్ని పెంచుతున్నది. ఆ విధంగా హిందూ, ముస్లిం ఓట్లతో అధికారాన్ని నిలుపుకునే విధానాన్ని అనుసరిస్తున్నది. కాగా, హిందూమతోన్మాద శక్తులు ముస్లిములపై పాశవిక దాడులు సాగించినపుడు, కాంగ్రెసు పార్టీ వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా తప్పించుకోవటానికి చట్టం తనపని తాను చేసుకు పోతుందన్న వాదనను ముందుకు తెస్తున్నది. బాబ్రీ మసీదు కూల్చివేతలో కూడా ఇదే జరిగింది.

దేశ రాజకీయాలలో నెలకొన్న ఈ పరిస్థితులవల్లనే హిందూమతోన్మాద శక్తులు పెచ్చరిల్లిపోయాయి. అధికారంలోకి వచ్చాయి. గుజరాత్ ముస్లింల ఊచకోతను సాగించాయి. అయినా ఆ రాష్ట్రంలో అధికారంలోనే వుండగలిగాయి.

భారత ఉపఖండంలో బ్రిటిషు వలసపాలనకు పూర్వం వివిధ మతస్థుల మధ్య స్పర్ధలు పెద్దగాలేవు. మతఘర్షణలు అసలు లేవు. బ్రిటిషు పాలకులే "విభజించి పాలించు" సూత్రంతో మత విద్వేషాలను రగిల్చారు. తాము పాలనను వదులుకొని పోవాల్సి వచ్చినా, ఉపఖండంపై ఆధిపత్యం కొరకు దేశ విభజన సాగించారు. ఆ విధంగా "ముస్లిం పాకిస్తాన్" ఏర్పడగా, దేశంలో మతస్తుల మధ్య విభజన దూరం పెరిగింది. బిజెపి తదితర శక్తులు హిందూ జాతీయవాదాన్ని ప్రధాన సాధనంగా చేసుకున్నాయి.

మత విశ్వాసాల రంగంలో ఈ విధంగా పెంచిన వలసపాలకులు వదలిన చెప్పుల్లో కాళ్లుదూర్చిన భారత పాలకవర్గాలు, అన్నివర్గాల ప్రజల మధ్య ఆర్థిక సమానత్వాన్ని తెచ్చేందుకు, సమాన అవకాశాలను కల్పించే విధానాన్ని ఏనాడూ పాటించలేదు. ఫలితంగా దేశ ప్రజలలో దారిద్ర్యం, నిరుద్యోగం పెరిగిపోయాయి. వీటి దుష్ప్రభావం మైనారిటీలపైనా ఎక్కువగా పడింది. ఇది బిజెపి తదితర శక్తులు మతోన్మాదాన్ని వ్యాప్తి చేసేందుకు, అలాగే మతోన్మాదభావజాలానికి ముస్లింలుకూడా లోనయ్యేటట్లు ఈ పరిస్థితి చేసింది.

సామాజికశాస్త్ర పరిశోధకులు చేసిన అనేక అధ్యయనాలు ఒక విషయాన్ని కరాఖండిగా తెలిపాయి. ముస్లిము వృత్తిదారులు ధనికులైనప్పుడూ, ఈ ముస్లిములు వాణిజ్యరంగంలోకి ప్రవేశించే ప్రయత్నాలు అప్పటి వరకూ ఆ రంగంలో వున్న హిందూ వ్యాపార వర్గాలు తమకు ప్రమాదమని భావించినప్పుడూ, ముస్లింలకు వ్యతిరేకంగా మత ఘర్షణలు చెలరేగాయని తెల్పాయి.

భారత్లో ముస్లిములు ఎక్కువగా పట్టణీకరణ చెందినవారు. బాబ్రీమసీదు విధ్వంసం తర్వాత ఈ పట్టణీకరణ తగ్గింది. 1990ల తర్వాత పట్టణాలలో నివశించే ముస్లింల శాతం అలాగే వుండిపోగా, మిగిలిన మతస్తులందరిలో పట్టణవలసశాతం పెరిగిందని, ఇది ముస్లిములలో కొత్తగా ఏర్పడిన అభద్రతాభావానికి ప్రతిబింబమనీ మరో అధ్యయనం తెలిపింది.

అలాగే ఒకే అర్హతలు కలిగివున్నప్పటికీ ఉద్యోగం ఇచ్చే అవకాశాలు హిందువులతో పోల్చినప్పుడు మూడవవంతు మాత్రమే వున్నాయని మరో అధ్యయనం తెలిపింది. ఇది సామ్రాజ్యవాదం రుద్దిన నూతన ఆర్థిక విధానాల పర్యవసానమే. ఈ విధంగా గుర్తింపు (ఐడెంటిటీ) రాజకీయాలూ, విభజనను వ్యాప్తిచేశాయి.

సచార్ కమిటీ నివేదిక వివిధ అభివృద్ధి సూచికల ఆధారంగా ముస్లింల వెనుకబాటుతనాన్ని ఎత్తిచూపింది.

సామ్రాజ్యవాదుల ఆజ్ఞలతో అమలు జరిగిన ఆర్థిక విధానాలతో పాటుగా, బాబ్రీమసీదు విధ్వంసంతో మతోన్మాదం పెరగటం కూడా ఏకకాలంలోనే సంభవించాయి. ఇది ముస్లిముల ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితిని ఎక్కువగా దిగజార్చింది. తాము దేశ ప్రధానస్రవంతికి దూరం చెయ్యబడ్డామన్న భావనను వారిలో పెంచింది.

ఆనాటి నుండీ దేశంలో సాగుతున్న మత ఘర్షణలనేవి పాలక వర్గాలు సృష్టించినవే. గుజరాత్లో 2002లో ముస్లిముల ఊచకోత, బాబ్రీమసీదు పర్యవసానమే. హిందూ మతోన్మాదశక్తులు సాధ్విప్రజ్ఞ సింగ్ ఆధ్వర్యంలో బాంబులు పేల్చి ముస్లింలకు దానిని అంటగట్టి ఘర్షణలురెచ్చగొట్టారు. అయినా ఈ నేరస్తులెవరికీ శిక్షలు పడలేదు. కాగా ముస్లిము యువకులను అరెస్టు చేసి విచారణ లేకుండా జైళ్లలో కుక్కటం సాగుతున్నది. వీరు నేరస్తులు కాదని కోర్టులో వారిని విడుదల చేసిన సందర్భాలే, పాలకవర్గాల కుతంత్రాన్ని తెలుపుతున్నాయి.

కనుక బాబ్రీమసీదు విధ్వంసం గతించి పోయిన అంశంకాదు. భారత రాజకీయాలలో అప్రాధాన్యఅంశంగా లేదు. అది భారత సామాజిక వ్యవస్థపై మాయని మచ్చ వేసింది. భారత రాజకీయ వ్యవస్థ గొప్పదనంగా చెప్పుకొనే ప్రజాస్వామ్యం, లౌకికత్వాల డొల్లతనాన్ని బయటపెట్టింది. భారత పాలకవర్గాల రాజకీయదివాళాకోరుతనాన్ని బయట పెట్టింది. ★

# గల్ఫ్లో కార్మికులపట్ల రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

**గత** పాతిక సంవత్సరాలుగా విదేశీ చెల్లింపులలో సంక్షోభం రాకుండా భారత ప్రభుత్వాన్ని గట్టెక్కిస్తున్నది, గల్ఫ్ దేశాలలోని భారత కార్మికులు తమ కుటుంబాలకు పంపుతున్న విదేశీ మారక ద్రవ్యమే. అయినా ప్రభుత్వం ఘనంగా ప్రతియేడూ జరిపే ప్రవాసీ దివస్లో వారికి చోటు వుండదు. ఇటీవల భారత కార్మికుల గురించి చర్చ జరిగినా శుష్కవాగ్దానాలే తప్ప ఆచరణ శూన్యం.

70 నుండి 80లక్షల మంది భారత కార్మికులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లినట్లు అంచనా. వీరిలో సరైన విద్యార్హతలూ, నైపుణ్యమూ లేనివారు పని మనుషులుగా, డ్రైవర్లుగా, నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. వారు దుర్భర పరిస్థితుల్లో దోపిడీకీ, అణచివేతకూ గురౌతున్నారు. రోజుకు 12 గంటలు పనిచేయాల్సి వస్తున్నది. కనీస సౌకర్యాలు లేక కిక్కిరిసి వుండే శిబిరాలలో వుంటున్నారు. ఎక్కువ వేతనమిస్తారని చెప్పి ఏజంట్లు మోసగించి పంపుతుండగా, వీసాను కంపెనీయే సర్దిపైచేయటం వంటి పద్ధతులవల్ల తమ హక్కులను అడగలేని దుస్థితిలో వుంటున్నారు. జీతాలు కూడా సక్రమంగా చెల్లించకుండా నెలల తరబడి బకాయిలు పెడుతున్నారు.

తమ హక్కులను కోరే ఏ నిరసన తెలిపినా తీవ్ర నిర్బంధానికి గురిచేస్తున్నారు. శిక్షలకు కూడా గురిచేస్తున్నారు. అక్రమ ప్రవేశదారులుగా పరిగణించి జైలుకు పంపుతున్నారు. వేలాది మంది వీధులలో వుంటున్నారు. ఏళ్లపాటు జైళ్లలో మ్రగ్గి పోతున్నారు.

ఘనమైన ప్రకటనలు తప్ప కేంద్రప్రభుత్వం వీరిపట్ల తన బాధ్యతను నెరవేర్చేందుకు ఏనాడూ ప్రయత్నించలేదు. వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా, అది రాష్ట్రప్రభుత్వాల బాధ్యతని తప్పుకుంటున్నది.

కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికుల కొరకు నిధులు కేటాయించి వారిని రక్షించే చర్యలు తీసుకుంటున్నాయి. కాగా ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్ర ప్రభుత్వాలు పెదవులనుండి సానుభూతి వచనాలు తప్ప, ఎలాంటి సంక్షేమ చర్యలూ తీసుకోవటం లేదు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమ పరిమితి మేరకు కొంత సహాయమందిస్తున్నాయి.

ప్రస్తుతం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్లో 45 వేలమంది భారత కార్మికులను అక్రమ ప్రవేశదారులుగా అక్కడి ప్రభుత్వం గుర్తించింది. వీరిలో 18 వేల మంది ఆంధ్రప్రదేశ్కు చెందినవారు. వీరు తిరిగి భారతదేశానికి వెళ్లకపోతే జైల్లో పెడతారు. అక్కడి ప్రభుత్వం డిసెంబరు 4 నుండి రెండు నెలలపాటు తిరిగి వెళ్లేందుకు అనుమతించింది. ఆ గడువుదాటితే జైల్లో పెడతారు.

కానీ ఈ వలస కార్మికులకు అత్యవసర ప్రయాణ వసతులను పొందేందుకు గానీ, ప్రయాణఖర్చులు పెట్టుకునేందుకుగానీ తగిన ఆర్థిక స్థోమత లేదు.వారు దిక్కుతోచని స్థితిలో వున్నారు. ఇలాంటి వారిని తిరిగి దేశానికి తీసుకువచ్చేందుకూ ఇతర సంక్షేమ చర్యలకు కేరళ ప్రభుత్వం రూ॥ 100 కోట్లు సాలీనా ఖర్చు పెడుతున్నది. కాగా ఆంధ్రప్రదేశ్ నుండి, ప్రధానంగా అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, కడప, ఉభయగోదావరి జిల్లాలనుండి, గల్ఫ్ వెళ్లిన కార్మికుల సంక్షేమానికి పూనుకోవటంలేదు.

భారత ప్రభుత్వం వీరికి ఆర్థిక సహాయమందిస్తానని ఘనంగా ప్రకటించింది. అత్యవసర ప్రయాణ పత్రాలకు చెల్లించే రుసుముల్లోని 40 దీర్హాంలను, భారతీయుల సంక్షేమ నిధికి చెల్లించే 10 దీర్హాములను , మొత్తం 50 దీర్హాంలను (రూ॥ 600) మాత్రమే రాయితీగా ప్రకటించింది. మిగిలిన రుసుములు చెల్లించాలి. దీనితో కేంద్రం తన చేతులు దులుపుకుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం గతకీర్తిని ఘనంగా స్తుతిస్తూ ప్రపంచ తెలుగు మహాసభలు ఆర్భాటంగా నిర్వహించే పనుల్లో మునిగిపోయింది. గల్ఫ్లోని తెలుగు కార్మికులను వెనక్కు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకునే తీరిక దానికిలేదు. అధికారగద్దెల కొరకు ముఠా తగవులలో కూరుకుపోయివుంది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్లో దిక్కుతోచని స్థితిలో వుండిపోయిన భారత కార్మికులందరినీ వెనక్కు తీసుకువచ్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని "జనశక్తి" డిమాండు చేస్తున్నది. ★

అరబ్ దేశాల్లో ప్రజా ఉద్యమాలు
సామ్రాజ్యవాదుల కుట్రలు
వెల: 15/-
కాపీలకు :
మైత్రి బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్మార్క్స్ రోడ్, విజయవాడ-2

# 'రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి'

## నర్సంపేటలో రైతు-కూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ధర్నా

**నర్సంపేట, 10-12-12:**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో వరంగల్జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్యార్డులో రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించాలని డిమాండ్చేస్తూ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ ఎం.డి. యాకూబ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్ ప్రారంభంనుండి విత్తనాలను, ఎరువులను రైతాంగం బ్లాక్లో కొనుగోలుచేసి వ్యవసాయాన్ని ప్రారంభించా రన్నారు. గత సంవత్సరం కరువు ఏర్పడింది. ఈ సంవత్సరం పంటవేసిన మొదలు పంట చేతికి వచ్చే సమయం వరకు నిరంతరం కురిసిన వర్షాలతో, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, తదితర పంటలు మొత్తం జాలువారిపోయి 75% పంట దెబ్బతిన్నది. మిగిలిన 25% పంట చేతికివచ్చే సమయంలో నీలం తుఫాన్ దెబ్బతో రైతుల గుండెలు పగిలిపోయి పూర్తిగా పంటలు నష్టపోయినారు. ఇన్ని రకాలుగా నష్టపోయికూడా చేతికి దక్కిన కొద్ది పంటను మార్కెట్ యార్డుకు తీసుకువస్తే మార్కెట్టులోని దళారులు తమ మాయాజాలంతో రైతుల పంటలకు అనేక కుంటిసాకులు చూపెడుతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. దీనికి తోడు మార్కెట్లో అడితీ కమీషన్ పేరుతో వందకు 5 రూ॥ల చొప్పున రైతుల రక్తమాంసాలను పిండుకు తింటున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ, మార్కెట్ పాలకపక్షం కాని, అధికారులుకాని దళారీలు వేసే ఎంగిలి మెతుకులకు ఆశపడి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని, ఫలితంగా రైతులు పాల్పడుతున్న బలవన్మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

రైతులంతా సంఘటితమై గిట్టుబాటు ధరలు దక్కేవరకు పోరాటం చేయాలని; పత్తికి క్వింటాకు 8వేలు, మిర్చి క్వింటాలుకు 15 వేలు, వరికి 2 వేలు గిట్టుబాటు ధర చెల్లించాలని, పెంచిన ఎరువులు, విత్తనాల ధరలను ప్రభుత్వం తగ్గించి రైతులకు సరిపడా అందించాలని, ఆందోళన సాగించాలని కా॥యాకూబ్ పిలుపు నిచ్చారు. ఈ ధర్నాలో కా॥ఈర్ల పైడి, జక్కుల తిరుపతి, విజయ్, భూమఅశోక్, పాపన్న, చందర్ తదితరులు పాల్గొన్నారు. ★

# చిల్లర వ్యాపారంలో ఎఫ్డిఐలను వ్యతిరేకిస్తూ ధర్నా

**అనంతపురం, 8-12-12:**

చిల్లర వర్తకరంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరవటాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ(ఎం.ఎల్) జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక తహశీలుదారు కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥సి. పెద్దన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకవర్గ పార్టీలు సామ్రాజ్యవాద దేశాలకు ఊడిగం చేస్తున్నాయని, సామ్రాజ్యవాద దోపిడీని మరింతగా పెంచివేసే విధానాలకు గేట్లు బార్లా తెరుస్తున్నాయని, అందులో భాగంగానే కోట్లాదిమంది ఉపాధిని దెబ్బతీసే; రైతాంగపు, వినియోగదారుల ప్రయోజనాలను దెబ్బతీసే-సామ్రాజ్యవాద బడా గుత్తసంస్థలను మనదేశ రిటైల్ రంగంలో జొరబెట్టటానికి భారత పాలకులు పూనుకోవటం సిగ్గుచేటైన విషయమని పేర్కొన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) అనంతపురం జిల్లా కార్యదర్శి కా॥బి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ మన దేశ పాలకులు క్రమంగా ప్రజాపంపిణీ వ్యవస్థను దెబ్బతీశారని, సబ్సిడీలన్నింటినీ ఎత్తివేస్తున్నారని, ఫార్వర్డ్, ఫ్యూచర్ ట్రేడింగ్ల పేరిట చట్టబద్ధ చీకటి వ్యాపారానికి అనుమతులిచ్చి, కార్పొరేటు, కాంట్రాక్టు సాగులను ప్రోత్సహిస్తూ ఒకవైపున రైతాంగాన్ని దివాలా తీయిస్తూ, మరోవైపు పెద్దఎత్తున ధరల పెరుగుదలకు కారణ మయ్యారని, ప్రస్తుతం రిటైల్రంగంలో వాల్మార్ట్వంటి విదేశీ గుత్తసంస్థలకు అనుమతినివ్వటం-పరిస్థితిని మరింత ఘోరంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

ఇంకా, ఈ ధర్నాలో ఏఐఎఫ్టియు-న్యూ నాయకులు కా॥సి.ఆర్.ఖాన్, కా॥చంద్రశేఖర్; ఓపిడిఆర్ నాయకులు కా॥శంకర్లు పాల్గొని ప్రసంగించారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల చొరబాటును వ్యతిరేకిస్తూ స్థానిక ఎన్జిఓ హోమ్నుండి క్రిష్ణకళామందిర్, టవర్క్లాక్ మీదుగా తహశీల్దార్ కార్యాలయంవరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు కా॥బాలు, ఈశ్వరయ్య, అజయ్లు నాయకత్వం వహించారు. ★

# లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ నాయకత్వంలో హైద్రాబాద్‌లో విజయవంతంగా జరిగిన మహాధర్నా



ధర్నాలో వేదికపై సంఘీభావ కమిటి నాయకులు



మహాధర్నాకు హాజరైన ప్రజానీకం



మహాధర్నావద్ద ప్రజాకళాకారుల నృత్యాలు

**హైద్రాబాద్, 20-12-12:**

2012 జూన్ 12న లక్షింపేట దళితులపై దమనకాండ జరిగిన తదనంతరం ఏర్పడిన 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ' నాయకత్వంలో హత్యకు గురైన దళితులకు న్యాయం చేయాలంటూ రాష్ట్రవ్యాపితంగా వివిధ ప్రాంతాలలో ఆందోళనలు జరుగుతూ వస్తున్నాయి.

దీని కొనసాగింపుగానే 'సంఘీభావ కమిటీ' పిలుపు మేరకు రాష్ట్రంలోని 23 జిల్లాల్లోని దళితులు, రైతుకూలీలు, గిరిజనులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువతీ యువకులు, కళాకారులు, మేధావులు, ప్రజాతంత్రవాదులు; వివిధ దళిత, విప్లవ, ప్రజాసంఘ నాయకులు వేలాదిమంది డిసెంబరు 12వ తేదీ ఉ॥10గంటలకే హైద్రాబాద్ చేరుకొన్నారు. అనంతరం ప్రదర్శనగా బయలుదేరి కాచిగూడ తుల్జాభవన్, సుందరయ్యాపార్కు మీదుగా ఇందిరాపార్కు వద్దకు తరలివచ్చారు. లక్షింపేటలో 5 గురిని హత్యచేసిన అగ్రకుల పెత్తందారీ హంతక ముఠాని శిక్షించాలని; ప్రత్యేక కోర్టుని లక్షింపేటలోనే ఏర్పాటుచేయాలని; మడ్డువలస రిజర్వాయరులో మునకకు గురికాని 250 ఎకరాల భూమిని దళితులకే పంచాలని; దళితులపై హంతకదాడులను నిలిపివేయాలనే నినాదాలతో ధర్నా ప్రాంగణమంతా మారుమ్రోగింది.

మహాధర్నాకు 'సంఘీభావ కమిటీ' కన్వీనర్ కా॥బొజ్జా తారకం అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ, దళితుల, పేదప్రజల ఉద్ధరణకే తాము పనిచేస్తున్నామంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కనీసం చట్టపరిధిలోని అంశాలను కూడా నెరవేర్చకుండా నిమ్మకు నీరెత్తినట్లుండటంపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. జులై 4న జిల్లా కేంద్రాలలో ధర్నాలు; జులై 21న చలో తిరుపతి; జులై 28న చలో విశాఖ; ఆగస్టు 6న చలో విజయవాడ; సెప్టెంబరు 2న చలో వరంగల్; సెప్టెంబర్ 6న చలో ఢిల్లీ; అక్టోబర్ 13-16 వరకు పాదయాత్ర; ఈరోజు చలో హైదరాబాద్ కార్యక్రమాలను నిర్వహించామని ఆయన వివరించారు. అనంతరం కో-కన్వీనర్లు డి.ప్రభాకర్, జి.ఝాన్సి, మరియు వివిధ దళిత సంఘాల, విప్లవ ప్రజాసంఘాల నాయకులు ధర్నానుద్దేశించి ప్రసంగించారు. పోరాట సంఘీభావ కమిటీ కో కన్వీనర్ మరియు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥యస్.ఝాన్సి మాట్లాడుతూ లక్షింపేట దళితుల భూమి సమస్యను ప్రధానంగా పేర్కొన్నారు. భూమిసమస్య పరిష్కారానికి మరింత తీవ్రమైన ఆందోళనకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాపితంగా దళితులు, మహిళలు, మత మైనారిటీలు, ఆదివాసులు తదితర బలహీనవర్గాలపై అగ్రకుల, మెజారిటీ హిందూమతోన్మాద, భూస్వామ్య పెత్తందారీ శక్తులు సాగిస్తున్న దోపిడీ, అణచివేత, వివక్ష, దౌర్జన్యాలు, దాడులు పెరుగుతుండటాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ, వీటికి వ్యతిరేకంగా రాష్ట్రంలో దళిత, వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక, దేశభక్తియుత, ప్రగతిశీల శక్తులంతా ఐక్యంగా మరింత బలంగా ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళాల్సిన ఆవశ్యకతను పేర్కొన్నారు. శ్రీకాకుళంజిల్లా పాలకొండ మొదలు, అనేక లక్షింపేటలు జరిగే అవకాశాలున్న రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో రెడుగ్లాసుల విధానం, అంటరానితనం, వివిధ రూపాలలో వెట్టిచాకిరీవంటి అన్ని ఫ్యూడల్ అణచివేతలకు వ్యతిరేకంగా ఆధిపత్య కుల దురహంకారుల నుండి విడగొట్టుకొని అన్ని కులాల్లోని పీడితులు, శ్రమజీవులైన పేదలు, కుల ద్వేషాలకు గురికాకుండా దళిత శక్తులతో కలగలిపి ఐక్య ఉద్యమాలు నిర్మించాలని కా॥ ఝాన్సి పిలుపునిచ్చారు. భీమ్రేడ్ శేషు ఉత్తేజపూరితమైన సందేశంతో ధర్నా కార్యక్రమాన్ని ముగించారు. దళిత ప్రజల పోరాట పాటలు మరియు దోపిడీకి గురౌతున్న పీడిత ప్రజల సమస్యలపై చైతన్యం కలిగించే విధంగా ప్రజాకళాకారుల పాటలు ఉత్తేజాన్నిచ్చాయి. ✡

# పాలకులు మోపుతున్న విద్యుత్తు ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా తీవ్రమౌతున్న ప్రజానిరసనలు

*(రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్తు కొరత, ప్రజలపై మోపుతున్న ఇంధన సర్దుబాటు ఛార్జీల (ఎఫ్ఎస్ఏ) భారాలకు వ్యతిరేకంగా గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిలలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేందుకు ప్రచార ఆందోళనా కార్యక్రమాల్ని చేపట్టవలసిందిగా రాష్ట్రస్థాయిలో సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసి, ఎంసిపిఐ(యు), సిపిఐ(ఎం-ఎల్), ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్‌బ్లాక్, ఎస్‌యుసిఐ, సిపిఐ(ఎం-ఎల్), సిపిఐ(ఎం-ఎల్) లిబరేషన్ పార్టీలు నిర్ణయించాయి. ఈ పిలుపులో భాగంగా రాష్ట్రంలో విస్తృత ప్రచార క్యాంపైన్, ఆందోళనా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రిపోర్టులు అందిన మేరకు ఈ సంచికలో ప్రచురిస్తున్నాం- సంపాదకుడు)*

16-11-12న 'విద్యుత్ సంస్కరణలు-పాలకుల నాటకం' అనే అంశంపై సిపిఐ(ఎం-ఎల్), సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నం మహతి కళాశాల వేదిక హాలులో సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిపిఐ (ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ఎం. భార్గవశ్రీ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్. రఘు, సిపిఐ జిల్లా కార్యదర్శి కా॥ అక్కినేని వనజ పాల్గొని విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రభుత్వం మోపుతున్న భారాల గురించి వివరించారు.

21-11-12న విజయనగరం ఎన్‌జిజివో హోమ్‌లో పది పార్టీల పిలుపులో భాగంగా ప్రజలపై మోపుతున్న భారాల్ని ఉపసంహరించాలని డిమాండ్‌చేస్తూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో కా॥ శంకర్రావు (సిపిఐ ఎం-ఎల్), కా॥ కామేశ్వరరావు (సిపిఐ), కా॥ ఎం. కృష్ణమూర్తి (సిపిఎం), కా॥ పి. ఈశ్వరరావు (సిపిఐ ఎంఎల్- ఎన్‌డి) పాల్గొని బలమైన ఐక్య ప్రజాఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

22-11-12న విజయనగరం జిల్లా నెల్లిమర్లలో జూటుమిల్లు కార్మిక సంఘం కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బి. శంకర్రావు (సిపిఐ ఎం-ఎల్), కె.సన్యాసిరావు (సిపిఐ ఎం-ఎల్-ఎన్‌డి), బి. సూరిబాబు (సిపిఐ), ఆర్. శంకర్రావు (సిపిఎం) వక్తలుగా ప్రసంగించారు.

2-12-12న అనంతపురం జిల్లా రాయదుర్గంలో వామపక్షాల పిలుపు మేరకు ప్రజాచైతన్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిపిఐ (ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి, కా॥ సి. పెద్దన్న; సిపిఐ జిల్లా కార్యదర్శి కా॥ జగదీష్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కా॥ ప్రభాకరరెడ్డి, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి కా॥ అమరనాథ్, సిపిఎం జిల్లా నాయకులు కా॥ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొని ప్రజలపై భారాలు ఉపసంహరించుకునేంత దాకా ఐక్యపోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు.

6-12-12న గుంటూరు జిల్లా మంగళగిరి లోని శ్రీవాసవీ కళ్యాణమండపంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎం-ఎల్) పార్టీల ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సభ జరిగంది. 2000 సం॥లో బషీర్‌బాగ్ కాల్పులలో మృతిచెందిన అమరులకు తొలుత సభ రెండునిమిషాలు మౌనం పాటించి జోహార్లు చెప్పింది. సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు కా॥ సింహాద్రి శివారెడ్డి; సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్; సిపిఐ జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ నాగేశ్వరరావులు ఈ సభలో ప్రసంగిస్తూ దీర్ఘకాల పోరాటానికి సంసిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

12-12-12న తూర్పుగోదావరిజిల్లా రంపచోడవరంలో-పది పార్టీల పిలుపులో భాగంగా, నియోజకవర్గస్థాయి సదస్సు జరిగింది. స్థానిక అంబేద్కర్ ఆవరణలో జరిగిన ఈ సదస్సులో ఏజన్సీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కా॥ ఇల్లా రామిరెడ్డి; సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కా॥ పి. సోమన్న; సిపిఎం నాయకులు కా॥ వేణుగోపాల్ ప్రసంగించారు.

20-11-12న పశ్చిమగోదావరిజిల్లా గోపాలపురం నియోజకవర్గస్థాయి సదస్సు స్థానిక మండల కార్యాలయం వద్ద జరిగింది. ఈ సదస్సులో సిపిఎం జిల్లా నాయకులు కా॥ జె. రాంబాబు; సిపిఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసి) నాయకులు కా॥ పి. రామకృష్ణ; గౌరీపట్నం ఏరియా క్వారీ వర్కర్స్ యూనియన్ (ఎఐఎఫ్‌టియు-న్యూ అనుబంధం) అధ్యక్షులు కా॥ పెంటయ్య తదితరులు పాల్గొని ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

4-12-12న పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో నియోజకవర్గస్థాయి సదస్సు జరిగింది. సదస్సు ప్రారంభానికి ముందుగా 200 మందితో పోలవరంలో ప్రభుత్వ విద్యుత్ విధానాన్ని నిరసిస్తూ ప్రజా ప్రదర్శన జరిగింది. అనంతరం జరిగిన సదస్సులో ఏజన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కా॥ కుంజం రామారావు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా ఉపాధ్యక్షులు కా॥ మాదేపల్లి వెంకటరత్నం; సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ శ్రీనివాస్; సిపిఎం నాయకులు కా॥ ఫ్రాన్సిస్, సిపిఐ నాయకులు కా॥ జె.వి. నరశింహారావు; సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ జె. వెంకటేశ్వరరావు; ఎంసిపిఐ(యు) నాయకులు కా॥ అప్పలరాజు తదితరలు పాల్గొని ప్రసంగిస్తూ ప్రజలపై జరుగుతున్న ముప్పేట దాడిని ప్రజాతంత్ర శక్తుల మద్దతుతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

26-12-12న మంగళగిరిలో-ఇంధన ఛార్జీల సర్దుబాటు పేరిట మోపిన భారాల్ని చెల్లించేది లేదని, వాటిని వెంటనే రద్దుచేయాలని డిమాండు చేస్తూ సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో స్థానిక రతనాలచెరువు నుండి బాధిత ప్రజానీకం ప్రదర్శనగా స్థానిక విద్యుత్తు కార్యాలయానికి చేరుకొని అధికారులను నిలదీశారు. నిరుపేదలకు రు. 2600, రు. 4200 వరకు వచ్చిన బిల్లులను అధికార్లముందుంచి, ఈ విధానాలను ప్రజలు సహించబోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ జగ్గారపు సుబ్బారావు, వెంకటపతి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

5-12-12న గుంటూరు జిల్లా రెంటచింతల నియోజక వర్గస్థాయి సదస్సు స్థానిక కోదండ రామాలయం ఆవరణలో జరిగింది. ఈ సదస్సులో సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు; సిపిఎం డివిజన్ నాయకులు కా॥ కె. బాబూప్రసాద్; ఎమ్‌సిపిఐ(యు) జిల్లా కార్యదర్శి కా॥ తూమాటి శివయ్య పాల్గొని విద్యుత్ ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా ఐక్యపోరాట ఆవశ్యకతను వివరించారు. ✡

**అణచబడ్డ దళితులంతా తిరగబడండి**

పేజీలు : 144

**వెల : రు. 50/-**

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

**Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010 and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2**

**Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**